www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 12-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 337

శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, బహుళపక్షం, తిథి: దశమి మ.12.22 తదుపరి ఏకాదశి, నక్షత్రం: జ్యేష్ఠ మ.1.42 తదుపరి మూల, వర్జ్యం: రా.10.32-12.18, దుర్ముహూర్తం: ఉ.10.35-11.20, మ.3.09-3.54, అమృతఘడియలు: లేవు, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.47, సూర్యాస్తమయం: 6.11

గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వందేమాతరం పాడాల్సిందే!

అధికారిక కార్యక్రమాల్లో అమలు పరచాలి

గీతాలాపన సమయంలో అందరూ నిలబడాలి

'జనగణమన' కంటే ముందు వందేమాతరం

మొత్తం ఆరు చరణాలూ ఆలపించాలి 2

స్కూలు కార్యకలాపాలు దీనితోనే ప్రారంభించాలి

కేంద్ర హోంశాఖ మార్గదర్శకాలు జారీ







కూటమికి చెందిన ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు, మంత్రి లోకేశ్

కలిసికట్టుగా కూటమి

మరో 15 ఏళ్లు ఇలాగే కొనసాగాలి: బాబు

కూటమి బలం మరింత పెరిగింది

ఎక్కడా విభేదాలు ఏర్పడలేదు

ఈ ఐక్యత కింది వరకూ కొనసాగాలి

గుజరాత్‌లో 5 దఫాలుగా ఒకే ప్రభుత్వం

అదే స్ఫూర్తితో ఇక్కడా గెలవాలి: సీఎం

అర్థవంతంగా మాట్లాడాలని సూచన

మన మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నాలు

అందరూ అప్రమత్తంగా ఉండాలి: పవన్

ఎన్నికల్లో ఏ స్ఫూర్తితో పనిచేశామో.. భవిష్యత్‌లోనూ అదే స్ఫూర్తితో కూటమి ఎమ్మెల్యేలు పనిచేయాలి. పార్టీల మధ్య భిన్నాభిప్రాయాలు ఉంటే అంతర్గతంగా కూర్చుని పరిష్కరించుకోవాలి. కూటమి ధర్మానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలి.
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

మా సమస్యలపై మా ఎమ్మెల్యే సభలో మాట్లాడారు. మంత్రులు సమాధానం చెప్పారని నియోజకవర్గ ప్రజలందరూ అనుకోవాలి. వైసీపీ హయాంలో బూతులు తిట్టుకున్నారని.. మనం కూడా బూతులు తిట్టకూడదు. ప్రజామోదయోగ్యంగా సభ జరగాలి.
- సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 15 ఏళ్లపాటు కూటమి ఐక్యత ఇలాగే కొనసాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ ఇరవై నెలల్లో మూడు పార్టీల నాయకత్వంలో ఎక్కడా విభేదాలు ఏర్పడలేదని, ఇది శుభ పరిణామమని చెప్పారు. ఇకపైనా ఇదే ఐక్యత కొనసాగాలని, కింది స్థాయి వరకు ఇలాగే ఉండాలని.. అప్పుడే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఇందుకు తగ్గట్లుగా మంచి పనులు చేసి ఎమ్మెల్యేలు పేరు తెచ్చుకోవాలని కోరారు. బుధవారం అసెంబ్లీ కమిటీ హాలులో టీడీపీ-జనసేన-బీజేపీలతో కూడిన ఎన్డీఏ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్ రాజు కూడా పాల్గొన్నారు. "మొన్నటి ఎన్నికల కంటే

మిగతా 13వ పేజీలో...

40 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదు

చంద్రబాబు అసహనం..

వారితో నేరుగా మాట్లాడతానని వెల్లడి 13

కూటమి ఎమ్మెల్యేలు తప్పు చేయొద్దు

15 ఏళ్లు కలిసి ప్రయాణించాల్సిందే: పవన్

మార్చి 7 వరకు అసెంబ్లీ

17 పనిదినాలు సమావేశాల నిర్వహణ 12

14న రాష్ట్ర బడ్జెట్... 17, 18 దానిపై చర్చ

సభావ్యవహారాల సలహా సంఘం నిర్ణయం

ఏపీలో ఆర్‌ఆర్‌ఆర్

పునర్నిర్మాణం, పునరుద్ధరణ, అభ్యుదయంతో ముందుకు

క్వాంటమ్ కంప్యూటింగ్‌తో అమరావతిలో కొత్త అధ్యాయం

175 నియోజకవర్గాల్లో ఎంఎ్‌సఎంఈ పార్కుల కార్యాచరణ

సామాజిక భద్రత, సాధికారితతోనే నిజమైన పునరుద్ధరణ

ఉభయ సభల ఉమ్మడి భేటీలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు స్వాగతం పలుకుతున్న సీఎం చంద్రబాబు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ట్రిపుల్ ఆర్ సంకల్పంతో ముందుకు సాగుతోందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. అవి పునర్నిర్మాణం(రీబిల్డ్), పునరుద్ధరణ (రెన్యూ), పురోగతి (రైజ్)గా పేర్కొన్నారు. బుధవారం ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. గత 19నెలలుగా ప్రభుత్వం రాష్ట్ర పునరుద్ధరణ దశ నుంచి ప్రగతి వైపు స్పష్టమైన ప్రయాణాన్ని కొనసాగిస్తోందని చెప్పారు. మానవ వనరుల సామర్థ్యం, సుస్థిరాభివృద్ధి, జవాబుదారీతనంతో కూడిన పాలనతో పెట్టుబడి పెట్టడం ద్వారా దీర్ఘకాలిక పరివర్తన దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ మార్పు సంక్షోభం నుంచి ఆత్మవిశ్వాసం వైపు ప్రయాణాన్ని

మిగతా 12వ పేజీలో...

అలా వచ్చారు.. ఇలా వెళ్లారు!

11వ తేదీ.. 11 మందితో 11 నిమిషాలు

9.59 గంటలకు సభలోకి జగన్ అండ్ కో

10.10 గంటలకే వాకౌట్

ప్రాంగణంలో ప్లకార్డులతో వైసీపీ సభ్యుల ర్యాలీ

గవర్నర్ ప్రసంగ సమయంలో నినాదాలు

పట్టించుకోకుండా కొనసాగించిన నజీర్

11 నిమిషాలకే సభ నుంచి నిష్క్రమించిన జగన్, వైసీపీ సభ్యులు



సభలో జగన్, బొత్స, పెద్దిరెడ్డి, వైసీపీ ప్రజాప్రతినిధులు





వైవీ సుబ్బారెడ్డికి నీడలా చిన్నప్పన్న (ఫైల్ ఫొటో)

సుబ్బన్న కోసమే అప్పన్న!

నాడు టీటీడీ చైర్మన్‌గా వైవీ

ఒక్క నెలలో 6433 'సుపథం' టికెట్లు


చైర్మన్ ఆఫీసుకు చిన్నబాసుగా అప్పన్న.. ఇతర సేవలు, దర్శనాలూ ఎన్నో?

మీ 'మనిషి' కాకుండా ఎలా సాధ్యం?.. వైవీ సుబ్బారెడ్డి బదులిస్తారా?

(తిరుమల/అమరావతి - ఆంధ్రజ్యోతి)

'చిన్నప్పన్న 2018 వరకు మాత్రమే నాకు పీఏగా ఉన్నాడు. నేను టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించాక అతనితో ఎలాంటి సంబంధాలూ లేవు!'... అని వైసీపీ రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పదేపదే చెబుతున్నారు. మరి... చైర్మన్‌తో ఎలాంటి సంబంధం 'లేని' అప్పన్నకు ఒక్క నెలలో ఆరువేలకు పైగా 'సుపథం' టికెట్లు ఎలా కేటాయించారు? అవును నిజం! 2021 సెప్టెంబరులో చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి సిఫారసుపై 595 సుపథం టికెట్లు జారీ

మిగతా 14వ పేజీలో...



		CHAIRMAN SIR	SUBBU	APPANNA
18-09-2021	SUPATHAM	16	483	143
19-09-2021	SUPATHAM	38	649	306
20-09-2021	SUPATHAM	31	495	347
21-09-2021	SUPATHAM	8	379	183
22-09-2021	SUPATHAM	24	496	130
23-09-2021	SUPATHAM	6	512	142
24-09-2021	SUPATHAM	0	343	146
25-09-2021	SUPATHAM	71	632	266
26-09-2021	SUPATHAM	53	435	255
27-09-2021	SUPATHAM	80	548	163
28-09-2021	SUPATHAM	46	391	78
29-09-2021	SUPATHAM	0	393	111
30-09-2021	SUPATHAM	17	409	109
TOTAL		595	15913	6433

2021 సెప్టెంబరు నెలలో చిన్నప్పన్నకు కేటాయించిన 'సుపథం' టికెట్ల వివరాలివి.

రాష్ట్రంలో 'ఏఐ లివింగ్ ల్యాబ్స్'

ప్రతి కుటుంబంలో ఒకరికి కృత్రిమ మేధలో శిక్షణ

ఉపాధ్యాయులకు ఉచిత ఏఐ టీచింగ్ కిట్స్


తిరుపతిలో రాష్ట్ర డేటా సెంటర్‌కు 'డిజాస్టర్ రికవరీ సెంటర్' ఏర్పాటు

గృహాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల సమర్పణ గడువు జూన్ 30 వరకూ పొడిగింపు

నీటి వనరుల నిర్వహణకు రూ.344 కోట్లు

పలు ఆర్డినెన్స్‌ల స్థానంలో బిల్లులకు ఆమోదం

రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయాలు



అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాంకేతిక విప్లవం తీసుకురావడానికి "ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్" ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. బుధవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 20 ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా ఏఐ లివింగ్ ల్యాబ్స్ ప్రాజెక్టు నిర్వహణ కోసం అమరావతి కేంద్రంగా ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఫౌండేషన్ అనే లాభాపేక్ష లేని కంపెనీ ఏర్పాటుకు అనుమతిచ్చింది. ఇందుకోసం

మిగతా 14వ పేజీలో...

గూగుల్ డేటా సెంటర్ బాధ్యత అదానీదే!

నిర్మాణం, నిర్వహణ ఆ సంస్థదే.. ప్రభుత్వానికి గూగుల్ లేఖ

అదానీ పేరిటే భూమి కేటాయింపు.. అదనంగా మరో 170 ఎకరాలు

క్యాబినెట్ సూత్రప్రాయ నిర్ణయం!

వైజాగ్‌లో 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి

భారత్‌లో గూగుల్ అతిపెద్ద పెట్టుబడి ఇదే

ఏఐ కోర్సుల రూపకల్పనకు పరిశ్రమలతో సంప్రదింపులు: కేంద్రం

విశాఖకు మళ్లీ ఐబీఎం.. భూమి కోసం అన్వేషణ

తాత్కాలిక కార్యకలాపాల కోసం ఐస్ప్రౌట్‌లో కో వర్కింగ్ స్పేస్ తీసుకునే అవకాశం! 14

గ్రూప్-1పై సిట్

అడిషనల్ డీజీ స్థాయి అధికారి నేతృత్వంలో ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశం

మెయిన్స్ పరీక్షలో అక్రమాల ఆరోపణలపై తేల్చండి

జవాబు పత్రాలను ట్యాంపర్ చేశారేమో పరిశీలించండి

మార్చి 16లోగా నివేదిక సమర్పించాలని సిట్‌కు ఆదేశం

ఎంపికైన అభ్యర్థులు అప్రాధాన్య పోస్టులకు: ధర్మాసనం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చేందుకు హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. వాస్తవాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను ఏర్పాటు చేయాలని లేదా ప్రస్తుతం ఉన్న సిట్‌ను పునర్వ్యవస్థీకరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిట్‌కు

మిగతా 11వ పేజీలో...





శివ.. శివా!

సోమవారం రోజున శ్రీశైలంలో గర్భాలయం వద్ద భక్తుల రద్దీ 14

'ఉద్రిక్తత' వెనుక కుట్రకోణం?

స్థానిక రాజకీయాలతో టార్గెట్‌గా మారిన శ్రీశైలం ఆలయ ఈవో

'వైసీపీ భక్త అధికారి'ని తిరిగి రప్పించే యత్నం!

శివభక్తులు చేతుల్లోకి రాళ్లు ఎలా వచ్చాయి?

తాళం తీసి రద్దీని మరింత పెంచింది ఎవరు?

పోలీసులు నిలువరించకుంటే పెను విషాదమే!?



రాయితో గేటు తాళాన్ని ధ్వంసం చేస్తున్న శివభక్తుడు

కెనడా స్కూల్లో కాల్పులు.. ఏడుగురి మృతి

25 మందికిపైగా గాయాలపాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

కాల్పులకు పాల్పడింది 18 ఏళ్ల ట్రాన్స్‌జెండర్

ఇంట్లో తల్లిని, తమ్ముణ్ని చంపేసి.. అక్కడి నుంచి నేరుగా బడికి వెళ్లి విచక్షణారహితంగా కాల్పులు జరిపిన షూటర్

అనంతరం తనను తాను కాల్చుకుని చనిపోయిన వైనం

థాయ్‌లాండ్‌లోనూ ఒక పాఠశాలలో కాల్పులు 2

స్కూల్ ప్రిన్సిపాల్‌కు, డైరెక్టర్‌కు, ఒక విద్యార్థికి గాయాలు

ఏఐకి సిద్ధంగా లేకపోతే స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చు

ఈ ఏడాదిలో 3వ సారి గూగుల్ ఆఫర్

జీబీవోలోని పలు విభాగాల ఉద్యోగులకు వర్తింపు 2



ప్రధాని మోదీ కళ్లలో భయం

అమెరికాకు మోదీ లొంగిపోయారు.. ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై జంకుతున్నారు

డేటా, ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు


అమెరికా ఒత్తిడికి లొంగి భారతన్ను అమ్మేశారు 2

అనిల్ అంబానీని ఎందుకు అరెస్టు చేయడం లేదు.. రాహుల్ విమర్శలు

తప్పుడు ఆరోపణలు.. సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడతాం: రిజిజు

అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం పాడాల్సిందే!

» మొత్తం ఆరు చరణాలు ఆలపించాల్సిందే: కేంద్రం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: అధికారిక కార్యక్రమాలలో వందేమాతరం పాడాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వందేమాతరం ఆలపించే చోట సభికులంతా శ్రద్ధగా లేచి నిల్చోవాల్సిందేనని పేర్కొంది. జాతీయ గేయం(వందేమాతరం), జాతీయ గీతం(జనగణమన) రెండూ ఆలపించాల్సిన సందర్భాలలో ముందుగా వందేమాతరంలోని మొత్తం ఆరు చరణాలనూ పాడాల్సిందేనంది. కేంద్ర హోంమంత్రిత్వశాఖ గతనెల 28న ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. నిర్దేశిత ప్రభుత్వ కార్యక్రమాలలో వందేమాతరం ఆలాపనకు సంబంధించి తాజా మార్గదర్శకాలను విడుదల చేసింది. రాష్ట్రపతి రాక, త్రివర్ణపతాకం ఆవిష్కరణ, గవర్నర్ల ప్రసంగాలు తదితర సందర్భాలలో 3 నిమిషాల 10 సెకండ్ల వ్యవధితో జాతీయ గేయంలోని ఆరు చరణాలను పాడాలని పేర్కొంది. పాఠశాలల కార్యకలాపాలు జాతీయ గేయం ఆలాపనతోనే మొదలవ్వాలని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం వందేమాతరం 150వ సంవత్సర వేడుకలను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జాతీయ జెండా వందనం, సాంస్కృతిక కార్యక్రమాలు, పరేడ్‌లు తప్ప ఇతర ఉత్సవ కార్యక్రమాలు, ఏదైనా ప్రభుత్వ కార్యక్రమానికి, లేదా ప్రజాకార్యక్రమానికి రాష్ట్రపతి రాక తదితర సందర్భాలలో జాతీయ గేయం అధికారిక వెర్షన్‌ను ఆలపించాలని తాజా ఆదేశాల్లో పేర్కొంది. పాఠశాలల నిర్వాహకులు తమ కార్యక్రమాలలో జాతీయ గేయం, జాతీయ గీతం ఆలాపనకు, విద్యార్థుల్లో జాతీయ జెండా పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించింది. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ తదితర పురస్కారాల ప్రదానోత్సవాలు, రాష్ట్రపతి పాల్గొన్న కార్యక్రమాలు, రాష్ట్రపతి రాక, వీడ్కోలు సందర్భాలలోనూ జాతీయ గేయం ఆలపించాలి. అలాగే, జాతీయ గీతం ఆలాపనకు ముందు మృదంగం వాయిద్యాలు తప్పనిసరి అని తాజా ఆదేశాల్లో పేర్కొన్నారు.

తమిళనాట సంకీర్ణానికి తావు లేదు: స్టాలిన్

చెన్నై, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తమిళనాట సంకీర్ణ ప్రభుత్వానికి తావులేదని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ స్పష్టం చేశారు. చెన్నైలో బుధవారం ఓ ఆంగ్ల పత్రిక నిర్వహించిన కార్యక్రమంలో స్టాలిన్ మాట్లాడుతూ.. ప్రసారమాధ్యమాల్లో చెబుతున్నట్టు కాంగ్రెస్-డీఎంకేల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, రెండు పార్టీలు కలిసే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తాయని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే కూటమి మళ్లీ ఘనవిజయం సాధిస్తుందని సర్వేలు చెబుతున్నాయన్నారు. డీఎంకేకు-ద్వితీయ పార్టీకి మధ్య వ్యత్యాసం 12 శాతం ఉన్నట్టు కొన్ని ముఖ్యమైన సర్వేలు అంచనా వేశాయని, ఈ వ్యత్యాసం 3 శాతం ఉంటేనే క్లీన్ స్వీప్ అని, అలాంటిది 12 శాతం వ్యత్యాసం అంటే అది థంపింగ్ విక్టరీ అవుతుందని విశ్లేషించారు. ఐదేళ్ల ద్రావిడ తరహా డీఎంకే పాలనలో రాష్ట్రం 11.19 శాతం ఆర్థిక ప్రగతిని సాధించిందన్నారు. డీఎంకేతోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని ప్రజలంతా భావిస్తున్నారని స్టాలిన్ చెప్పారు. మరోవైపు, తమిళనాడులో అన్నాడీఎంకే సొంత మెజారిటీతోనే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి అన్నారు. డీఎంకే కూటమిలో గందరగోళ పరిస్థితులు కొనసాగుతున్నాయని చెప్పారు.

నేడు భారత్ బంద్.. బ్యాంకింగ్ సేవలపై ప్రభావం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గురువారం భారత్ బంద్‌కు 10కిపైగా వాణిజ్య, రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. బ్యాంకింగ్ సేవలు, రవాణాతో పాటు మరికొన్ని ప్రభుత్వ రంగాలపై బంద్ ప్రభావం ఉండనుంది. దేశవ్యాప్తంగా దాదాపు 30 కోట్ల మంది కార్మికులు బంద్‌లో పాల్గొంటారని 10 కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక పేర్కొంది. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు, కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ బంద్ తలపెట్టాం' అని వివరించారు. ఆస్పత్రులు, అత్యవసర సేవలు, అంబులెన్స్, ఆరోగ్య సేవలు, పాలు, ఫార్మసీల వంటి సేవలు కొనసాగుతాయి. ప్రైవేటు కార్యాలయాలు, ఐటీ కంపెనీలు, మెట్రో సేవలు, పాఠశాలలు, కాలేజీలు కొనసాగే అవకాశముంది.

44 ఏళ్ల తర్వాత ముంబై పీఠంపై బీజేపీ

» బీఎంసీ మేయర్‌గా రీతూ తావ్‌డే



ముంబై, ఫిబ్రవరి 11: సుమారు 44 ఏళ్ల తర్వాత ముంబై మేయర్ పీఠంపై బీజేపీ జెండా ఎగిరింది. బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) 78వ మేయర్‌గా ఆ పార్టీకి చెందిన రీతూ తావ్‌డే బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కమలం పార్టీ మొదటిసారిగా 1982-83లో ఈ పదవిని దక్కించుకోగా, మళ్లీ ఇన్నేళ్లకు ఆ అవకాశం లభించింది. రీతూ తావ్‌డేతో పాటు శివసేన అభ్యర్థి సంజయ్ ఘాడీ డిప్యూటీ మేయర్‌గా ఎన్నికయ్యారు. దీంతో గత 25 ఏళ్లుగా ముంబై రాజకీయాలను శాసిస్తున్న ఠాక్రే కుటుంబ ఆధిపత్యానికి తెరపడింది. జనవరి 15న జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో 227 సీట్లకుగాను బీజేపీ 89 స్థానాలను గెలుచుకోగా, మిత్రపక్షమైన శివసేన షిండే వర్గం 29 స్థానాలను దక్కించుకుంది. ఈక్రమంలో అధికార కూటమి మేజిక్ ఫిగర్ 114ను దాటి అధికారాన్ని చేజిక్కించుకుంది.

ఒడిశాలో నక్సల్స్ లొంగుబాటు విధానం సవరణ

భువనేశ్వర్, ఫిబ్రవరి 11: రాష్ట్రంలో మావోయిస్టుల ప్రభావాన్ని పూర్తిగా తొలగించి, వారిని జనజీవన స్రవంతిలో కలిపేందుకు ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మావోయిస్టుల లొంగుబాటు, పునరావాస విధానాన్ని సవరించింది. నిషేధిత సీపీఐ (మావోయిస్టు), దాని అనుబంధ సంస్థలు, మావోయిస్టులు, వామపక్ష తీవ్రవాదులు, నక్సల్స్, మిలిటెంట్లకు, తుపాకులు, లేక అవి లేకుండా లొంగిపోయే క్యాడర్లకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందని పేర్కొంది. ఒడిశాలో నిషేధిత సంస్థల కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తులు రాష్ట్రానికి చెందిన వారా.. కాదా అనే దానితో సంబంధం లేకుండా ఈ పథకానికి అర్హులేనని స్పష్టం చేసింది. అలాగే రాష్ట్రం వెలుపల నక్సల్స్ కార్యకలాపాల్లో పాల్గొన్న ఒడిశా వారిని కూడా అర్హులుగానే పరిగణిస్తామని వెల్లడించింది. అయితే వారు మరెక్కడా పునరావాస ప్రయోజనాలను పొందలేదని నిరభ్యంతర పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. .

భారత్ ఆకాంక్షలను గౌరవిస్తాం: చైనా

» భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి మద్దతు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో శాశ్వత సభ్యత్వం కోసం ఇప్పటివరకూ భారత్ ప్రయత్నాలకు మోకాలడ్డిన చైనా స్వరం మార్చింది. ఈ విషయంలో భారతదేశ ఆకాంక్షలను తాము అర్థం చేసుకున్నామని, వాటిని గౌరవిస్తామని తెలిపింది. అలాగే భారత్ అధ్యక్షతన జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి పూర్తి మద్దతు ప్రకటించింది. విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీతో ఢిల్లీలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం సందర్భంగా చైనా ఎగ్జిక్యూటివ్ వైస్ ఫారిన్ మినిస్టర్ (ఈవీఎఫ్ఎం) మా జావ్‌షు ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈ నెల 8 నుంచి 10 వరకూ జరిగిన బ్రిక్స్ షెర్పా సమావేశాల్లో పాల్గొనేందుకు ఆయన భారత్ వచ్చారు.

నేడు బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు

ఢాకా, ఫిబ్రవరి 11: బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు గురువారం జరగనున్నాయి. ఎన్నికల వేళ హింసాత్మక ఘటనలు జరగకుండా దేశవ్యాప్తంగా దాదాపు 10లక్షల మంది పోలీసులను ఎన్నికల భద్రత విధులకు కేటాయించారు. 12.77కోట్ల మంది బంగ్లాదేశ్ పౌరులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్‌ను మహ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేయడంతో ఈ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ), జమాతే ఇస్లామీ పార్టీల మధ్యనే పోటీ నెలకొంది. బంగ్లాదేశ్‌లో మొత్తం 300 పార్లమెంటు స్థానాలకు గాను 299సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. ఒక స్థానంలో అభ్యర్థి చనిపోవడంతో అక్కడ ఎన్నికను వాయిదా వేశారు.

మోదీ కళ్లలో భయం!

అమెరికాకు ప్రధాని మోదీ పూర్తిగా లొంగిపోయారు

» డాటా, ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాలను పణంగా పెట్టారు

» అమెరికా ఒత్తిడికి ఉక్కిరిబిక్కిరై భరతమాతను అమ్మేశారు: రాహుల్




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ అమెరికాకు పూర్తి లొంగిపోయారని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత-అమెరికా వర్తక ఒప్పందం ద్వారా 140 కోట్ల భారతీయ ప్రజల భవిష్యత్తును ఆయన తాకట్టు పెట్టారని విమర్శించారు. డాటా, ఇంధన భద్రత, రైతుల ప్రయోజనాల విషయంలో అమెరికాకు మోదీ సర్కారు దాసోహమైందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్న అంశాలకు మోదీ భయపడుతున్నారని అన్నారు. భరతమాతను అమెరికాకు అమ్మేశారు. ఇందుకు సిగ్గు అనిపించడం లేదా? అని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 'అమెరికాకు లొంగిపోవడం మీకు సిగ్గుగా అనిపించడం లేదా?' అని నిలదీశారు. బుధవారం లోక్‌సభలో అధికారపక్ష సభ్యుల తీవ్ర అభ్యంతరాల నడుమ, స్పీకర్ స్థానంలో ఉన్న బీజేపీ ఎంపీ జగదాంబికాపాల్ అడ్డంకుల మధ్య రాహుల్ ప్రసంగిస్తూ ప్రధానిపై నిప్పులు చెరిగారు. బీజేపీ ఆర్థిక ప్రయోజనాలు అందిస్తున్న వారిపై అమెరికాలో కేసు ఉందని, వారిని కాపాడేందుకే ఆ దేశానికి మోదీ లొంగిపోయారని రాహుల్ గాంధీ ఆరోపించారు. సాధారణ పరిస్థితుల్లో దేశాన్ని మోదీ అమ్మబోరని తనకు తెలుసునని, అయితే వారు ఆయన్ను ఒత్తిడిలోకి నెట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారని, అందుకే ఆయన దేశాన్ని అమ్మేశారని విమర్శించారు. ప్రత్యర్థి గొంతు పట్టుకుంటే బాధితుడి కళ్లలో భయం ఎలా ఉంటుందో మార్షల్ ఆర్ట్స్ తెలిసిన వ్యక్తిగా తనకు తెలుసునని.. తనకు ప్రధాని కళ్లలో ఆ భయం కనబడుతోందని చెప్పారు. 140 కోట్ల మంది ప్రజల అత్యంత ముఖ్యమైన డాటా అమెరికాకు ఉచితంగా వెళుతోందని, సోర్స్ కోడ్‌ను వెల్లడించరని, వారికి 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడే అందుకే ఇచ్చారని ఆరోపించారు. వ్యవసాయ యాంత్రీకరణతో చక్కగా సాగు పనులు చేసుకుంటున్న రైతులు, అమెరికా వ్యవసాయ విధానం దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మన టెక్స్‌టైల్స్ తుడిచిపెట్టుకుపోయాయని, జీరో శాతం టారిఫ్ ఉన్న బంగ్లాదేశ్ మన వస్త్ర పరిశ్రమను కుప్పకూలుస్తోందన్నారు. మన ఇంధన భద్రతను కూడా అమెరికాకు తాకట్టుపెట్టారని, మనం ఏ ఇతర దేశం నుంచీ చమురును కొనుగోలు చేయలేమని చెప్పారు. ఏ భారతీయ ప్రధానీ ఇలా చేయరని, అందులో ఎలాంటి హేతుబద్ధతా లేదని చెప్పారు. అమెరికా తన డాలర్‌ను కాపాడుకోవాలనుకుంటోందని, అందుకు మనం సహకరిస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉందని, ఆయన్ను ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. అనిల్ అంబానీని ఎప్‌స్టీన్‌కు కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పరిచయం చేశారని ఆరోపించారు. అదానీపై ఉన్న కేసులకు సంబంధించి అమెరికాలో సమన్లు జారీ అయ్యాయని గత 18 నెలలుగా భారత ప్రభుత్వం స్పందించడం లేదని చెప్పారు.

రాహుల్‌పై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడతాం: రిజిజు

ఎలాంటి నోటీసు ఇవ్వకుండా రాహుల్ తీవ్రమైన తప్పుడు ఆరోపణలు చేశారని, ఆయనపై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడతామని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు పేర్కొన్నారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరిపై తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించారు. మరోవైపు, తనకు ఎప్‌స్టీన్ కార్యకలాపాల్లో ఎలాంటి ఆసక్తి లేదని, 30 లక్షల ఈమెయిల్స్‌లో తన పేరు 3, 4 సార్లు మాత్రమే ప్రస్తావించారని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు. తనను ఎప్‌స్టీన్ రెండు నాలుకల ధోరణి గల వ్యక్తిగా అభివర్ణించారని ఆయన గుర్తు చేశారు. తాను భారత ప్రభుత్వంలో చేరకముందు అమెరికాలో ఒక స్వతంత్ర శాంతి కమిషన్‌లో ఉన్నప్పుడు లింక్డ్ఇన్ వ్యవస్థాపకుడైన రీడ్ హాఫ్‌మన్‌ను భారత్‌కు ఆహ్వానించానని, ఆ సందర్భంగా ఎప్‌స్టీన్‌ను ఒక ప్రతినిధి వర్గంలో భాగంగా కలుసుకున్నానని చెప్పారు. ఆయన నేరాలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

లోకం తీరు

||వ తేదీ..||మంది..|| నిమిషాలు ఉండి వెళ్లిపోయారు: స్పీకర్ !



పెంగ్విన్‌కు ఢిల్లీ పోలీసుల నోటీసు

» పెంగ్విన్‌గానీ లేదా నరవణేగానీ అబద్ధం చెబుతున్నారన్న రాహుల్‌గాంధీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11 : మాజీ ఆర్మీ చీఫ్ ఎం.ఎం. నరవణే పుస్తకం "ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ" పబ్లిష్ కాకుండానే సోషల్ మీడియాలో బయటకు రావడంపై ప్రచురణ సంస్థ పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియాకు వివరణ ఇవ్వాల్సిందిగా ఢిల్లీ పోలీసులు నోటీసు జారీ చేశారు. ఈ పుస్తకం అనధికారికంగా బయటకు రావడంపై పలు ఆరోపణలు వస్తుండడాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నోటీసులు జారీ చేశారు. ఈ విషయమై పెంగ్విన్‌కు పలు ప్రశ్నలతో ఢిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ నోటీసు జారీ చేసినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. కాగా ఈ విషయమై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మంగళవారం మాట్లాడుతూ.. నరవణే పుస్తకం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. అటు పెంగ్విన్‌గానీ ఇటు నరవణే గానీ అబద్ధం చెబుతుండవచ్చని పేర్కొన్నారు. అయితే నరవణే అబద్ధం చెబుతారని తాను అనుకోనని ఆయన అన్నారు.

ఆమె మాట్లాడిన తీరు నచ్చలేదు

» అందుకే స్విట్జర్లాండ్‌పై 9% అదనపు సుంకాలు.. స్విస్ నేతపై ట్రంప్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: టారిఫ్‌లు తగ్గించాలని ఓ స్విస్ నేత తనతో మాట్లాడిన తీరు తనకు నచ్చలేదని,అందుకే స్విట్జర్లాండ్‌పై అదనంగా 9% సుంకాలు విధించాలని ఆదేశాలిచ్చానని ట్రంప్ పేర్కొన్నారు. స్విట్జర్లాండ్‌పై 30% టారిఫ్‌లు విధించామని, అది చాలా తక్కువని పేర్కొన్నారు. ఆ తర్వాత తనకు ఒక స్విస్ నేత నుంచి అత్యవసర కాల్ వచ్చిందని అప్పుడు ఆ నేత మాట్లాడిన తీరు తనకు నచ్చలేదని, అందుకే సుంకాలను 39 శాతానికి పెంచానని చెప్పారు. ఎలాంటి సుంకాలు చెల్లించకుండా స్విట్జర్లాండ్ మా దేశానికి ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది" అని ట్రంప్ పేర్కొన్నారు.

25 మంది ఎంపీలు స్పీకర్‌ను తిట్టిపోశారు!

» చాంబర్లో ప్రియాంక, వేణుగోపాల్ కూడా ఉన్నారు

» వారిని మరింత రెచ్చగొట్టారు.. నేనే సాక్షిని: కేంద్ర మంత్రి రిజిజు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: ఇరవై-పాతిక మంది కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్ చాంబర్లోకి దూసుకెళ్లి.. ఆయన్ను అనుచితంగా దుర్భాషలాడారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఆరోపించారు. ఆ సమయంలో ఆ పార్టీ ఎంపీలు ప్రియాంకాగాంధీ వాద్రా, కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారని.. తమ సభ్యులను మరింత రెచ్చగొట్టారని బుధవారం ధ్వజమెత్తారు. ఈ నెల 4న జరిగిన ఈ పరిణామానికి తాను ప్రత్యక్ష సాక్షినని చెప్పారు. ఓం బిర్లా చాలా మృదుస్వభావి అని.. లేదంటే వారందరిపై కఠిన చర్యలు తీసుకుని ఉండేవారని తెలిపారు. 'స్పీకర్ అనుమతి లేనిదే సభలో సభ్యులు మాట్లాడేందుకు వీల్లేదు. ప్రధాని కూడా సభాపతి అనుమతితోనే మాట్లాడతారు. కానీ, తనకెవరి అనుమతీ అక్కర్లేదని ప్రతిపక్ష నేత రాహుల్ అన్నారు. తన ఇష్టం వచ్చింది మాట్లాడతానన్నారు. రాహుల్‌గాంధీకి నేను పాఠాలు చెప్పలేను. కానీ ఆయన ఏ లోకంలో జీవిస్తున్నారో అర్థం కావడం లేదు. పార్లమెంటు ఆయన ఇష్టం ఇచ్చినట్లు నడవదని.. చిన్నపిల్లల్లా ప్రవర్తించకూడదని కాంగ్రెస్ సీనియర్ నేతలైనా ఆయనకు చెప్పాలి' అని రిజిజు స్పష్టంచేశారు.

'పప్పు'లో కాలేసిన అమెరికా!

» అమెరికా పప్పులపై సుంకాలను భారత్ సున్నాకు తగ్గిస్తుందన్న అంశంపై వెనక్కి..



వాషింగ్టన్/ న్యూయార్క్, ఫిబ్రవరి 11: భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌లోని అంశాలపై అమెరికా పప్పులో కాలేసింది. భారత్ సుంకాలు సున్నాకు తగ్గించే అమెరికన్ వ్యవసాయ ఉత్పత్తుల్లో కొన్ని పప్పుధాన్యాలు కూడా ఉన్నాయంటూ విడుదల చేసిన ఫ్యాక్ట్ షీట్‌ను సవరించుకుంది. అంతేకాదు గూగుల్, అమెజాన్ వంటి దిగ్గజ టెక్ సంస్థలు భారత్‌లో పొందే ఆదాయంపై వేస్తున్న డిజిటల్ సర్వీసెస్ ట్యాక్స్‌ను కూడా భారత్ తొలగిస్తుందన్న అంశాన్నీ వెనక్కి తీసుకుంది. అంతే కాకుండా రూ.45 లక్షల కోట్ల(500 బిలియన్ డాలర్ల) అమెరికా ఉత్పత్తులను కచ్చితంగా దిగుమతి చేసుకుంటామని భారత్ మాటిచ్చిందన్న అంశాన్నీ మార్చి.. ఈ మేరకు దిగుమతులు చేసుకునేందుకు ప్రయత్నిస్తామని భారత్ హామీ ఇచ్చిందని చేర్చింది. ఈ మేరకు సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను విడుదల చేసింది. మరోవైపు, పాక్ ఆక్రమిత కాశ్మీర్ (పీఓకే), చైనా ఆక్రమణలో ఉన్న ఆక్సాయ్‌చిన్ ప్రాంతాలను భారత్‌లో భాగంగా చూపుతూ పెట్టిన మ్యాప్‌ను అమెరికా వాణిజ్య విభాగం (యూఎస్‌టీఆర్) తొలగించింది. సాధారణంగా అమెరికా తమ మ్యాప్‌లలో పీఓకే, ఆక్సాయ్‌చిన్ ప్రాంతాల హద్దులను చుక్కల లైన్‌తో విడిగా చూపేది. కానీ వారం క్రితం భారత్‌తో వాణిజ్య ఒప్పందంలోని అంశాలను వివరిస్తూ 'ఎక్స్'లో పెట్టిన పోస్టులో పీఓకే, ఆక్సాయ్‌చిన్ పూర్తిగా భారత్‌లోనే ఉన్నట్టుగా చూపింది.

ఏఐకి సిద్ధంగా లేకపోతే స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చు

» ఏడాదిలో 3వ సారి గూగుల్ ఆఫర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: టెక్ దిగ్గజం గూగుల్ మరోసారి తన ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ(వీఈపీ) ప్యాకేజీని ప్రకటించింది. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేనివారు వీఈపీ తీసుకోవాలని కోరింది. గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్(జీబీఓ)లో సొల్యూషన్స్ టీమ్, సేల్స్, కార్పొరేట్ డెవలప్‌మెంట్ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ ఆఫర్‌కు అర్హులని కంపెనీ పేర్కొంది. అమెరికాలోని కస్టమర్ సేల్స్ టీమ్, ఇతర కస్టమర్ విభాగాల్లో పనిచేస్తున్న వారికి ఈ ఆఫర్ వర్తించదని స్పష్టం చేసింది. బిజినెస్ ఇన్‌సైడర్ కథనం ప్రకారం గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ ఫిలిప్ షిండ్లర్ కంపెనీ అంతర్గత లేఖలో ఉద్యోగులకు ఈ విషయాన్ని పేర్కొన్నారు. 'ప్రస్తుత వ్యాపార వాతావరణం ఎంతో వేగంగా మారుతోంది. పోటీ తీవ్రత, పని వేగం గణనీయంగా పెరుగుతున్నాయి. కంపెనీ ఏఐ లక్ష్యాలను అందుకునేలా పనిచేయడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉండక తప్పదు. అందుకు సిద్ధంగా లేమని భావిస్తున్నవారి కోసం ఓ ప్రణాళిక సిద్ధంగా ఉంది' అని షిండ్లర్ తన లేఖలో పేర్కొన్నారు. గూగుల్ ఈ ఆర్థిక సంవత్సరంలో ఇలాంటి ప్రణాళికను ప్రకటించడం ఇది మూడోసారి. గత ఏడాది జూన్, అక్టోబరులో ఇలాంటి ప్యాకేజీలనే ఉద్యోగులకు ఆఫర్ చేసింది.

అమెరికా మమ్మల్ని టాయ్‌లెట్ పేపర్‌లా వాడుకుంది

» అగ్రరాజ్యం కోసం ఎన్నో యుద్ధాలు

» పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్



ఇస్లామాబాద్, ఫిబ్రవరి 11: పాకిస్థాన్‌ను అమెరికా టాయ్‌లెట్ పేపర్‌లా వాడుకుందని దాయాది దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర ఆరోపణలు చేశారు. పాక్ సాయం కావాల్సి వచ్చినప్పుడు బాగా వాడుకుని, అవసరం తీరగానే అమెరికా తమను పక్కన పడేసిందని ఆయన ఆక్షేపించారు. అయినా, గుణపాఠం నేర్చుకోలేదన్నారు. ఇస్లామాబాద్‌లోని షియా మసీదులో ఇటీవల జరిగిన భారీ బాంబు పేలుళ్ల ఘటనపై పార్లమెంటులో మాట్లాడుతూ, ఖవాజా ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా కోసం తనకు సంబంధం లేని అనేక 'సూపర్ యుద్ధాల్లో' పాక్ పాల్గొన్నదన్నారు. "అఫ్ఘాన్ విషయంలో రెండు సందర్భాల్లో అమెరికా తరపున పోరాడాం. 1979లో అఫ్ఘాన్‌పై రష్యా దురాక్రమణ సమయంలో తొలిసారి, 2001లో తాలిబన్లపై జరిగిన పోరాటంలో రెండోసారి యుద్ధంలో పాల్గొని తప్పుచేశాం. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయాం. అప్పట్లో దేశ పాలకులుగా ఉన్న ఇద్దరు నియంతలు తమ అధికారం నిలుపుకోవడం కోసం, తమ పాలనకు అగ్రరాజ్యం మద్దతు సాధించడం కోసం ఈ యుద్ధాల్లోకి పాక్‌ను లాగారు. ఈ సమయంలో మన దేశాన్ని, మన భూభాగాలను వాడుకుని, ఆ తర్వాత టాయ్‌లెట్ పేపర్ కంటే ఘోరంగా అమెరికా తీసిపారేసింది" అని ఖవాజా వ్యాఖ్యానించారు.

కెనడా స్కూల్లో కాల్పులు.. ఏడుగురి మృతి

25 మందికిపైగా గాయాలపాలు.. ఇద్దరి పరిస్థితి విషమం.. కాల్పులకు పాల్పడింది 18 ఏళ్ల ట్రాన్స్‌జెండర్!

» ఇంట్లో తల్లిని, తమ్ముణ్ని చంపేసి.. అక్కణ్నుంచి బడికి వెళ్లి విచక్షణ రహితంగా కాల్పులు జరిపిన షూటర్

» తనను తాను కాల్చుకుని ఆత్మహత్య



టంబ్లర్ రిడ్జ్ స్కూల్ నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

టొరంటో, ఫిబ్రవరి 11: కెనడాలోని బ్రిటిష్ కొలంబియా రాష్ట్రంలో టంబ్లర్ రిడ్జ్ సెకండరీ స్కూల్లో మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో (స్థానిక కాలమానం ప్రకారం) ఒక షూటర్ విచక్షణ రహితంగా కాల్పులు జరిపింది. ఈ కాల్పుల్లో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. ఆస్పత్రికి వెళ్లే దారిలో మరొకరు మరణించారు. మరో 25 మందికిపైగా గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. బడిలో కాల్పులు జరిపిన ఆ షూటర్ తనను తాను కాల్చుకుని చనిపోయినట్టు పోలీసులు గుర్తించారు. అయితే, ఈ కాల్పులు జరిపింది మహిళా షూటర్‌గా పోలీసులు తొలుత భావించినప్పటికీ.. 'జెస్సీ స్ట్రాంగ్ (18)' అనే ట్రాన్స్‌జెండర్‌గా దర్యాప్తులో గుర్తించారు. పుట్టుకతో అబ్బాయి అయినా.. జెస్సీ 2023 నుంచి తనను తాను అమ్మాయిగా భావించుకుంటున్నట్టు ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు జరిపే క్రమంలో... ఆ స్కూలుకు సమీపంలోని ఒక ఇంట్లో రెండు మృతదేహాలు కనిపించాయి. ఆ రెండు మృతదేహాలూ జెస్సీ తల్లి, తమ్ముడివిగా భావిస్తున్నారు. జెస్సీ తొలుత వారిద్దరితో గొడవపడి, వారిని చంపేసి నేరుగా పాఠశాలకు చేరుకుని అక్కడ కాల్పులు జరిపినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. అబ్బాయిగా పుట్టినా తనను తాను అమ్మాయిగా భావించుకోవడంతో స్కూల్లో తోటి పిల్లలు ఎగతాళి చేశారని, వేధింపులకు గురిచేశారని.. తనను అర్థం చేసుకోని సమాజంపై తనకు ద్వేషం కలిగిందని.. ఈ ఘోరానికి పాల్పడేముందు జెస్సీ లేఖ రాసినట్టు తెలుస్తోంది. కెనడాలోని నోవా స్కోషియాలో గాబ్రియేల్ వోర్ట్‌మన్ అనే దుండగుడు 2020లో.. పోలీసు దుస్తులు ధరించి, పోలీసు వాహనంలో రెండు రోజులపాటు తిరుగుతూ జరిపిన కాల్పుల్లో 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సమయంలో అతడు తన సొంత ఇంటితోపాటు పలు ఇళ్లకు నిప్పు పెట్టాడు. ఆ మంటల్లో కాలి మరో 9 మంది చనిపోయారు. దాని తర్వాత కెనడాలో కాల్పుల ఘటనలో ఇంతమంది చనిపోవడం ఇదే. కాగా, కాల్పుల ఘటనపై భారత ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.


థాయ్‌లాండ్‌లోనూ

థాయ్‌లాండ్‌లోని హత్ యాయ్ నగరంలో ఒక పాఠశాలలోకి అసాల్ట్‌రైఫిల్‌తో చొరబడిన ఒక టీనేజర్(18) జరిపిన కాల్పుల్లో.. బడి ప్రధానోపాధ్యాయుడు, డైరెక్టర్ సహా ముగ్గురు గాయపడ్డారు. వీరిలో పాఠశాల డైరెక్టర్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచినట్టు తెలుస్తోంది. ఈ దురాగతానికి పాల్పడే ముందు ఇంటివద్ద అతడు తన తల్లితో కూడా గొడవపడ్డాడని..ఆమెకు హాని తలపెట్టే ప్రయత్నం చేశాడని.. అతణ్ని అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు రాగా,వారిలో ఒకరినుంచి ఎం4 రైఫిల్ లాక్కుని స్కూల్లోకి వచ్చాడని అధికారులు తెలిపారు.

4 వేల కోట్ల స్పామ్ కాల్స్, 13 వేల కోట్ల స్పామ్ మెసేజ్‌లు

ఏఐ వాయిస్, అనుకరణలతో సైబర్ నేరగాళ్ల మోసాలు.. మెసేజింగ్ యాప్‌ల్లో చొరబడి ఖాతాలు ఖాళీ

» ట్రూకాలర్ ఇండియా ఇన్‌సైట్ రిపోర్టులో వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: టెక్నాలజీ ఎంత అప్‌డేట్ అయితే.. సైబర్ నేరగాళ్లు కూడా అంతలా ముదురుతున్నారు. గతంలో ఫోన్ కాల్, మెసేజ్‌లు చేసి మోసాలు చేసే దశ నుంచి.. ప్రస్తుతం డిజిటల్ అరెస్టులు, ఏఐ వాయిస్ అనుకరణలు లాంటి పలు రకాల మోసాలతో బురిడీ కొట్టిస్తున్నారు. అలాగే ప్రఖ్యాత కంపెనీలను అనుకరిస్తూ మెసేజింగ్ యాప్స్ ద్వారా కూడా మన ఫోన్లలోకి జొరబడి ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. వచ్చే రోజుల్లో ఈనేరగాళ్లు మరింతగా సవాళ్లు విసరనున్నారు. దేశంలో స్కామ్‌ల ముప్పు ఎలా పరిణమిస్తోందో ట్రూకాలర్ యాప్ తన ఇండియా ఇన్‌సైట్ రిపోర్టు-2025లో వివరించింది. 32 కోట్ల ట్రూకాలర్ వినియోగదారుల డేటాను విశ్లేషించి ఇటీవల విడుదల చేసిన ఆ నివేదికను తయారు చేసింది. కొత్త రూపాల్లోని స్కామ్‌ల్లో గుర్తింపు ధ్రువీకరణకు చెందినవి, సుపరిచిత సంస్థలను అనుకరించి చేసే వంచనలు, కాల్స్ మెసేజ్‌లు కలిపి మోసం, ఏఐతో చేసిన వాయిస్ సందేశాలు తదితరాలు ఉంటున్నాయి. "తాము స్వయంగా బదిలీ చేసిన డబ్బు న్యాయబద్ధంగా చేశామని స్కామర్ల బాధితులు భావిస్తారు. డిజిటల్ అరెస్టు దీనికి ఉదాహరణ. బాధితుల ప్రమేయం లేకుండా బ్యాంకు ఖాతాలను, ఫోన్లను స్కామర్లు వారి అధీనంలోకి తీసుకుని, ఓటీపీతో డబ్బు బదిలీ చేసే స్కామ్‌లకు, డిజిటల్ అరెస్టులకు తేడా ఉంది" అని ట్రూకాలర్ సీఈవో రిషిత్ ఝున్‌ఝున్‌వాలా చెప్పారు. ట్రూకాలర్ నివేదిక ప్రకారం.. సాధారణ ఎస్ఎంఎస్, ఫోన్ కాల్స్‌కు బదులుగా థర్డ్ పార్టీ మెసేజింగ్ యాప్స్ అయిన వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ డైరెక్ట్ మెసేజ్ (డీఎం), టెలీగ్రామ్ లాంటి వాటిని నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నారు. అలాగే ఎస్ఎంఎస్‌లతో ఫేక్ కరెంట్ బిల్లులు, ట్రాఫిక్ చలాన్ల వంటి వాటి ద్వారా డబ్బు కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారు. ట్రూకాలర్ ఇన్‌స్టాల్ చేసుకున్న వినియోగదారుల ద్వారా 4,168 కోట్ల స్పామ్ కాల్స్‌ను, 12,903 కోట్ల స్పామ్ మెసేజ్‌లను గుర్తించారు. ఈ స్పామ్ కాల్స్‌లో 770 కోట్ల కాల్స్ బ్యాంకులను, ప్రభుత్వ సంస్థలను, పేమెంట్ ప్లాట్‌ఫామ్‌లను, ప్రఖ్యాత బ్రాండ్లను అనుకరించి మోసం చేసే ఉద్దేశంతో చేసినవే. ఇక స్కామర్ల లక్ష్యం ముఖ్యంగా వృద్ధులే. వీరైతేనే వాళ్ల వలలో సులువుగా పడతారు. స్కామ్ జరిగిన విషయం బయటకు చెప్పలేరు. కమ్యూనిటీ రిపోర్టింగ్ సహకారంతో 1,189 కోట్ల స్పామ్ కాల్స్‌ను వినియోగదారులకు చేరకుండా ట్రూకాలర్ అడ్డుకుంది. ఒక్కో స్పామ్ కాల్‌కు 1.8 నిమిషాల సమయం అనుకుంటే, మొత్తం స్పామ్ కాల్స్‌ను అడ్డుకోవడం ద్వారా ప్రతిరోజు 21.7 లక్షల గంటల సమయాన్ని, ప్రతి వారానికి 1.5 కోట్ల గంటల సమయాన్ని ట్రూకాలర్ కాపాడింది. ఇక ఆండ్రాయిడ్, ఐఫోన్ల కోసం ట్రూకాలర్ ఫ్యామిలీ ప్రొటెక్షన్ ఫీచర్‌ను తీసుకొస్తోంది. ఐదుగురు సభ్యులు దీనిలో ఉంటారు. సభ్యులెవరికైనా స్కామ్ కాల్ వస్తే వెంటనే అడ్మిన్‌కు నోటిఫికేషన్ వెళుతుంది. బ్లాక్ చేసిన స్కామర్ల నంబర్లను సభ్యులు షేర్ చేసుకోవచ్చు. కాగా, ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ వివరాల ప్రకారం.. 2025లో భారతీయులు మోసాల కారణంగా రూ. 19,813 కోట్లు కోల్పోయారు. వీటిపై 21.77 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి. అధునాతన టెక్నాలజీ వినియోగంతో జరుగుతున్న ఈ మోసాలను, మోసగాళ్లను గుర్తించడం కష్టంగా మారుతోంది.



మయూర వాహనంపై స్వామి, అమ్మవార్లు

మయూర వాహనంపై మల్లన్న

శ్రీశైలం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు బుధవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు మయూర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అక్కమహాదేవి అలంకార మండపం వద్ద ప్రత్యేక పూజాదికాలు నిర్వహించి క్షేత్రపురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. మయూర వాహనంపై దర్శనమిచ్చిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు.

మొక్కు చెల్లించుకున్న బండ్ల గణేశ్

- 23 రోజులు పాదయాత్ర చేసి తిరుమలకు



తిరుమల ఆలయం ముందు బండ్ల గణేశ్

తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత బండ్ల గణేశ్ తిరుమలలో తలనీలాలు సమర్పించి మొక్కు చెల్లించుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును జైలుకు పంపించినప్పుడు ఆయన సురక్షితంగా బయటకు వస్తే కాలినడకన తిరుమలకు వస్తానని మొక్కుకున్న బండ్ల గణేశ్ హైదరాబాద్ నుంచి 23 రోజుల పాటు పాదయాత్ర చేసి మంగళవారం కొండకు చేరుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.

సమష్టి కృషితో ఎన్‌డీపీఎస్ కేసుల్లో ముద్దాయిలకు శిక్ష

విజయవాడ(విద్యాధరపురం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మాదక ద్రవ్యాల కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ఆంధ్రప్రదేశ్ పోలీస్ విభాగం, ఈగల్ టీమ్, ప్రాసిక్యూషన్ విభాగం విశేష కృషి చేశాయని డీజీపీ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. గతేడాది జనవరి 1 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎన్‌డీపీఎస్ చట్టం కింద వివిధ కోర్టుల్లో మొత్తం 72 కేసుల్లో 127 మంది ముద్దాయిలకు కఠిన శిక్షలు విధించినట్టు తెలిపింది. అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 21, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరం జిల్లాలో 7, విశాఖ, గుంటూరు జిల్లాల్లో 6 కేసులు చొప్పున నమోదయ్యాయని వెల్లడించింది. గంజాయి, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోరాటంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపింది. గంజాయి, మాదక ద్రవ్యాలు అక్రమంగా రవాణా చేస్తున్నట్టు సమాచారం తెలిస్తే 1972 ఫోన్‌కు సమాచారం తెలియపరచాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొంది.

నేను దొంగను కాదు టీచర్!

- నింద భరించలేక టెన్త్ విద్యార్థి బలవన్మరణం
- నెల్లూరు జిల్లా పేడూరు గుమ్మళ్లపాలెంలో ఘటన

తోటపల్లిగూడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయురాలు మోపిన చోరీ నిందను భరించలేక పదోతరగతి విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బుధవారం నెల్లూరు జిల్లా తోటపల్లిగూడూరు మండలం పేడూరు గుమ్మళ్లపాలెంలో ఈ ఘటన జరిగింది. గ్రామంలోని సంగారు మల్లి, మాధవి దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సుదీప్(16) ఇందుకూరుపేట మండలంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి. తరగతి గదిలో ఓ విద్యార్థి బ్యాగులోని నగదు చోరీ అవడంతో ఆ విద్యార్థి సుదీప్‌పై అనుమానం వ్యక్తం చేశాడు. దీంతో ఉపాధ్యాయురాలు బుధవారం సుదీప్‌ను నిలదీశారు. తాను తీయలేదని సుదీప్ ప్రాధేయపడినా ఉపాధ్యాయురాలు పట్టించుకోలేదు. దీంతో సాయంత్రం స్కూలు నుంచి వచ్చిన సుదీప్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మరణించాడు. పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు ఉరికి వేలాడుతున్న సుదీప్‌ను ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ముగిసిన గుణదల లూర్దుమాత 102వ మహోత్సవాలు

విజయవాడ (గుణదల), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులపాటు సాగిన గుణదల లూర్దుమాత 102వ మహోత్సవాలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి హాజరైన బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు భక్తులకు సందేశమిస్తూ క్రీస్తు మార్గమే మనకు రక్షణ మార్గమని వెల్లడించారు. బిషప్‌గా బాధ్యతలు చేపట్టి 10 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ను గురువులు సత్కరించారు.

గిరిజన శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన

ఆరు ఐటీడీఏల్లో పీవో పోస్టులు ఖాళీ

- మైదాన ఐటీడీఏల పరిస్థితి దారుణం
- డైరక్టరేట్‌లోనూ పాలన అంతంతే
- గిరిజన మంత్రి, ముఖ్యకార్యదర్శి ఉన్నా అవస్థలలోనే గిరిజనుల సంక్షేమం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలోని గిరిజన సంక్షేమశాఖలో పాలన తీరు అయోమయంగా ఉంది. ఈ శాఖలో ప్రధాన విభాగాలన్నీ ఇన్‌చార్జ్‌ల హయాంలోనే నడుస్తున్నాయి. ప్రతి విభాగంలోనూ ఇన్‌చార్జులే దర్శనమిస్తున్నారు. ఈ శాఖ ముఖ్యకార్యదర్శి ఎం.ఎం. నాయక్ గిరిజన సంక్షేమశాఖతో పాటు సాంఘిక సంక్షేమశాఖ కూడా నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఈ శాఖకు ముఖ్యకార్యదర్శిని నియమించలేకపోయారు. దీంతో పాటు గిరిజన సంక్షేమ డైరక్టర్‌గా ఉన్న సదాభార్గవి సెలవుపై వెళ్లడంతో సాంఘిక సంక్షేమశాఖ గురుకుల సొసైటీ సెక్రటరీ ప్రసన్న వెంకటేశ్‌ను ఇన్‌చార్జ్ డైరక్టర్‌గా నియమించారు. ప్రధానమైన ఇంజనీర్-ఇన్-చీఫ్ పోస్టుకు కూడా ఆ శాఖ చీఫ్ ఇంజనీర్‌నే ఇన్‌చార్జ్‌గా పెట్టి నడిపిస్తున్నారు. గిరిజన సంక్షేమ గురుకుల సొసైటీ కార్యదర్శిగా ఇటీవలి వరకు ఐఏఎస్ అధికారి గౌతమి ఉన్నారు. ఇటీవల ఆమె కూడా సెలవుపై వెళ్లడంతో ఈ పోస్టుకు కూడా ఇన్‌చార్జ్‌ను నియమించారు. ట్రైకార్‌కు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఇన్‌చార్జ్ అధికారి పాలనలో సాగుతోంది. గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణా సంస్థ(టీసీఆర్ అండ్ టీఎం)కు రెగ్యులర్ అధికారి లేకపోవడంతో పాలన కుంటుపడుతోంది.

మంత్రి, ముఖ్యకార్యదర్శి ఉన్నా..

గిరిజన మహిళ అయిన ఆ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వారు. ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్ ఎస్టీ వర్గానికి చెందినవారే. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఆ శాఖ నిర్వహిస్తున్న అధికారులు కూడా ఎస్టీలే అయినప్పటికీ గిరిజన శాఖకు రెగ్యులర్ అధికారులను నియమించలేక పోతున్నారు. ఈ శాఖలో ప్రధానమైన డైరక్టర్‌గా ఇటీవల వరకు ఉన్న సదాభార్గవి, ఈఎన్‌సీ ఇన్‌చార్జ్‌గా ఉన్న చీఫ్ ఇంజనీర్ వసంత ఎస్టీ వర్గానికి చెందినవారే. మంత్రితో పాటు ఇంత మంది ఎస్టీ అధికారులున్నా ఆ శాఖలో సమర్థవంతమైన పాలన కరువైందనే విమర్శలు వస్తున్నాయి.

రెగ్యులర్ అధికారి లేక..

రాష్ట్రంలో 8 సమగ్ర గిరిజనాభివృద్ధి విభాగా(ఐటీడీఏ)లు, మరొకటి మైదాన ఐటీడీఏ ఉన్నాయి. వీటిలో 6 ఐటీడీఏలకు ప్రాజెక్టు అధికారులే(పీవో) లేరు. ఇతర జిల్లా అధికారులతోనో, అదే ఐటీడీఏల్లో జూనియర్ అధికారులతోనో వీటిని నిర్వహిస్తున్నారు. సాధారణంగా ఐటీడీఏలకు రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులుగా కొత్తగా నియమితులైన ఐఏఎస్ అధికారులకు బాధ్యతలు ఇవ్వడం ఆనవాయితీ. అయితే, ఆరు ఐటీడీఏల్లో రెగ్యులర్ అధికారి లేక ఇన్‌చార్జ్ పాలన నడుస్తోంది. సీతంపేట ఐటీడీఏకు ఇన్‌చార్జ్‌గా సబ్‌కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా పార్వతీపురం ఐటీడీఏకు జాయింట్ కలెక్టర్ ఇన్‌చార్జ్, పాడేరు ఐటీడీఏకు ప్రాజెక్టు అధికారి, జాయింట్ కలెక్టర్ ఒక్కరే ఉన్నారు. చింతూరు ఐటీడీఏకు కూడా సబ్‌కలెక్టర్ ఇన్‌చార్జ్ పీవోగా ఉన్నారు. నెల్లూరు, శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టుల పీవో పోస్టులు ఎప్పటి నుంచో ఇన్‌చార్జ్ పాలనలోనే ఉన్నాయి. అక్కడ డీటీడబ్ల్యూవోలు ఇన్‌చార్జ్ పీవోలుగా కొనసాగుతున్నారు. ఐఏఎస్ అధికారులను పీవోలుగా నియమిస్తామని ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్నా.. అది సాకారం కావడం లేదు.

మరణిస్తూ ఐదుగురి జీవితాల్లో వెలుగులు



విజయకుమార్

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఒకరి అవయవదానం.. ఐదుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. ఖమ్మం జిల్లా మధిర ప్రాంతానికి చెందిన కందిమళ్ల విజయకుమార్ (20) తాడేపల్లి మండల పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూలో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 6న బైక్‌పై వెళుతూ ప్రమాదానికి గురయ్యాడు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మణిపాల్ వైద్యశాలలో చేర్చగా ఈ నెల 11న బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. విజయ్ తండ్రి సైదేశ్వరరావు, కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఏపీ జీవన్‌దాన్ ట్రస్ట్ ఛైర్మన్ రాంబాబు, మణిపాల్ వైద్యశాల డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అవయవదానం నిర్వహించారు. దాత గుండె, కాలేయాన్ని మణిపాల్‌లో అవసరమైన వారికి అమర్చారు. ఊపిరితిత్తులను హైదరాబాద్‌లోని కిమ్స్ వైద్యశాలకు, కిడ్నీలను గుంటూరు విధాత హాస్పిటల్‌కు, కార్నియాను విజయవాడలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రికి తరలించారు.

ఏపీటీడీసీ 50 ఏళ్ల వేడుకలకు లోగో డిజైన్ పోటీలకు ఆహ్వానం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) స్థాపించి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఫిబ్రవరి 18వ తేదీ నుంచి గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. వేడుకల కోసం ప్రత్యేకంగా రూపొందించే "APTDC@50" లోగో డిజైన్ల కోసం ప్రతిభావంతులైన రూపకర్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పర్యాటక ఆపరేషన్స్ ఈడీ ఎ.ఎల్.పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక వైభవాన్ని చాటి చెప్పేలా 50 ఏళ్ల వేడుకల లోగో ఉండాలన్నారు. నిపుణుల కమిటీ ద్వారా ఎంపికైన ఉత్తమ లోగోకు రూ.20 వేల నగదు పారితోషకంతో పాటు అధికారిక సత్కారం ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ డిజైన్లను ఈ నెల 14వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు gmmktg.@aptdc.in,jayahobharathiyam@gmail.comకు పంపవలసి ఉంటుందని తెలిపారు. స్వర్ణోత్సవ వేడుకలను రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ప్రతి నెల ఒక వేదిక చొప్పున నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

గుంటూరు, కడపలో ఆధునిక క్యాన్సర్ చికిత్స

- ఓఎన్‌జీసీ సీఎస్ఆర్‌తో రెండు లైనాక్ యంత్రాలు మంజూరు
- కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్‌కు పెమ్మసాని కృతజ్ఞతలు



కేంద్రమంత్రి హర్‌దీప్‌సింగ్ పూరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్

న్యూఢిల్లీ/గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు, కడప ప్రభుత్వాస్పత్రులలో ఆరోగ్య, మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులను అందించేందుకు ముందుకు రావడంపై కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరికి కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం పార్లమెంటులో హర్‌దీప్‌సింగ్ పూరిని ఆయన కార్యాలయంలో పెమ్మసాని కలిశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా.. రూ.60 కోట్ల విలువైన అత్యాధునిక లైనాక్ యంత్రాలను గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయడానికి ఆమోదం లభించడం క్యాన్సర్ చికిత్సకు గొప్ప ఊతమని, దీని ద్వారా ఏపీ, పొరుగు రాష్ట్రాల రోగులకు సమయానుకూలంగా, ప్రపంచ స్థాయి రేడియోథెరపీ సేవలు అందుబాటులోకి వస్తాయని పెమ్మసాని తెలిపారు. కాగా.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన స్క్రీనింగ్‌లో లక్షలాది మందిని పరీక్షించగా, 22,888 అనుమానాస్పద క్యాన్సర్ కేసులు గుర్తించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వేలాది మందికి పైగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఓఎన్‌జీసీ సంస్థ సీఎస్ఆర్ కింద గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒక్కొక్కటి సుమారు రూ.30 కోట్ల విలువైన రెండు అత్యాధునిక లైనాక్ యంత్రాలను అందజేసింది. ఈ యంత్రాల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో క్యాన్సర్ చికిత్సకు ఊతం లభిస్తుంది. ఈ యంత్రాల కోసం అవసరమైన ప్రత్యేక బంకర్లు, మౌలిక వసతులు, శిక్షణ పొందిన ఆంకాలజిస్టులు, సాంకేతిక సిబ్బంది ఇప్పటికే సిద్ధంగా ఉన్నారు. యంత్రాల ఏర్పాటు పూర్తయిన వెంటనే వైద్యసేవలు ప్రారంభించే అవకాశం ఉంది. యంత్రాల కొనుగోలు ప్రక్రియను హెచ్‌ఎల్‌ఎల్ లైఫ్ కేర్ లిమిటెడ్ ద్వారా అమలు చేయనున్నారు.

ఏప్రిల్‌లో 10 లక్షల మందితో బీసీ గర్జన

- సభకు ప్రధాని మోదీ హాజరు: ఆర్.కృష్ణయ్య
- చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి
- బీసీల మేధో మథన సదస్సులో తెలుగు ఎంపీల డిమాండ్



బీసీల మేధో మథన సదస్సులో పాల్గొని సంఘీభావం ప్రకటిస్తున్న ఎంపీలు ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, బీద మస్తాన్‌రావు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తెలుగు ఎంపీలు డిమాండ్ చేశారు. చట్టసభల్లో రిజర్వేషన్ల ద్వారానే బీసీలకు రాజకీయ స్వతంత్రం వస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను బీసీల జనాభా ప్రకారం 27 శాతం నుంచి 56 శాతానికి పెంచాలని కోరారు. విద్యా, ఉద్యోగ, రిజర్వేషన్లపై ఉన్న బీసీ క్రిమిలేయర్‌ను తొలగించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీసీల న్యాయమైన డిమాండ్లకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఢిల్లీలోని ఏపీభవన్‌లో ఏపీ, తెలంగాణ బీసీ సంఘాల ఆధ్వర్యంలో.. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ అధ్యక్షతన బీసీల మేధో మథన సదస్సు జరిగింది. బీజేపీ ఎంపీలు ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, టీడీపీ ఎంపీలు బీద మస్తాన్‌రావు, కలిశెట్టి అప్పలనాయుడు, బస్తీపాటి నాగరాజు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్ర శేషు ఈ సదస్సులో పాల్గొన్నారు. బీసీల డిమాండ్ల సాధన, ఆత్మగౌరవం కోసం బీసీ సోదరులందరూ ఉద్యమించాలని ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. వచ్చే ఏప్రిల్‌లో 10 లక్షల మందితో ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా బీసీ గర్జన బహిరంగ సభను నిర్వహించబోతున్నామని తెలిపారు. బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ యాక్ట్ మాదిరిగా బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ యాక్ట్‌ను తీసుకురావాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు పెట్టాలని కోరారు. కేంద్రంలో రూ.2 లక్షల కోట్లతో బడ్జెట్‌లో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని పాకా సత్యనారాయణ కోరారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగపరమైన హక్కులు నేటికీ అందని ద్రాక్షలాగా ఉండటం దురదృష్టకరమని ఎంపీ బస్తీపాటి నాగరాజు అన్నారు. బీసీల హక్కులను సాధించేందుకు ప్రతి ఒక్కరూ పోరాటానికి సిద్ధం కావాలని కలిశెట్టి పిలుపునిచ్చారు.

నేనే ఐపీఎస్... నేనే ఎన్ఐఏ..

- నచ్చిన హోదా చెబుతూ నకిలీ అధికారి మోసాలు
- హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి.. ర్యాపిడో డ్రైవర్ నుంచి రూ.1.50 లక్షలు స్వాహా
- అరెస్టు చేసిన తిరుపతి పోలీసులు



నిందితుడు సురేశ్ వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకిశోర్

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆయనొక ఐపీఎస్ అధికారి..! అంతేకాదు ఎన్ఐఏ అధికారి, డిటెక్టివ్ కూడా..! ఇలా తనకు నచ్చిన హోదా చెప్పుకుంటూ నకిలీ ఐడీ కార్డ్ చూపించి నమ్మిస్తాడు. ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ విడతలవారీగా దండుకుంటాడు. ఇలా.. అతడు చేస్తున్న బహుపాత్రాభినయానికి తిరుపతి అలిపిరి పోలీసులు తెరదించారు. బుధవారం అలిపిరి సీఐ రామకిశోర్ వివరాలు వెల్లడించారు. ఒడిశాకు చెందిన కె. సురేశ్‌కుమార్ అలియాస్ సూర్య ఐదేళ్లుగా తిరుపతి రూరల్ మండలం శెట్టిపల్లెలో నివాసం ఉంటున్నాడు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పలువురిని మోసగించి లక్షల రూపాయలు కాజేశాడు. తిరుపతిలో ర్యాపిడో డ్రైవర్ వెంకటేశ్వర రావుకు సురేశ్ పరిచయమయ్యాడు. తాను ఢిల్లీలోని ఎన్ఐఏలో పనిచేస్తున్న ఐపీఎస్ అధికారినని నమ్మించాడు. హైదరాబాద్‌లోని ఆదాయ పన్ను శాఖ కార్యాలయంలో డివిజనల్ అడ్వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ ఆశపెట్టాడు. అతని మాటలు నమ్మిన వెంకటేశ్వర రావు విడతల వారీగా రూ.1.50 లక్షలు సమర్పించుకున్నారు. తర్వాత అతడి తీరుపై అనుమానం రావడంతో డబ్బు తిరిగి ఇచ్చేయాలని కోరాడు. అయితే డబ్బు ఇచ్చేదిలేదని బెదిరించడంతో వెంకటేశ్వరరావు అలిపిరి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు సురేశ్‌ను అరెస్ట్‌చేసి విచారించగా హైదరాబాద్ తోపాటు పలు నగరాల్లో పలువురిని మోసగించినట్టు తేలింది. దీంతో అతన్ని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించారు.



విజయవాడలోని ఈట్ స్ట్రీట్ వద్ద మంత్రి లోకేశ్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలపై హర్షం

- మంత్రి లోకేశ్ చిత్ర పటానికి శాప్ ఛైర్మన్ పాలాభిషేకం

విజయవాడ సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,200 కోట్లు విడుదల చేసి విద్యార్థుల చదువుకు మంత్రి లోకేశ్ భరోసా కల్పించారని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు కొనియాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విద్యా శాఖ మంత్రి లోకేశ్ చిత్ర పటానికి విజయవాడలోని ఈట్ స్ట్రీట్ వద్ద బుధవారం ఆయన పాలాభిషేకం చేశారు.

అల్లూరి, చిత్తూరు జిల్లాల్లో పొగమంచు

- అరకులోయలో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత

విశాఖపట్నం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): కోస్తా, రాయలసీమల్లోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం పొగమంచు కురిసింది. అల్లూరి సీతారామరాజు, చిత్తూరు జిల్లాల్లో మరింత ఎక్కువగా ఉంది. ఉత్తరాది నుంచి వీస్తున్న గాలులతో ఎక్కువ ప్రాంతాల్లో చలి ప్రభావం కొనసాగింది. అరకులోయలో 7.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం ఉదయం చిత్తూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని, శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో చలి ప్రభావం ఉంటుందని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అణు 'సంధి'లో అవని

మూడుదశాబ్దాలుగా అణుయుద్ధాన్ని వెనక్కునెట్టగలిగిన ఒక ఒప్పందం గడువుతీరి గాలికికొట్టుకుపోయినప్పుడు ప్రపంచానికి వెన్నులో భయం పుట్టడం సహజం. అమెరికా, రష్యాలను ఇంతకాలం కాలుదువ్వకుండా కట్టడి చేసిన 'న్యూస్టార్ట్' ఒప్పందం ఫిబ్రవరి 5న కాలగర్భంలో కలిసిపోయింది. భూమిమీద ఉన్న అణ్వాయుధాల్లో దాదాపు 90శాతం తమ ఆయుధగిడ్డంగుల్లో దాచుకున్న ఈ రెండుదేశాల మధ్య ఒక చట్టబద్ధమైన అడ్డంకి తొలగిపోయినందున ఇక అణుయుద్ధం తప్పదా? అని మీడియా అదేపనిగా అడుగుతోంది. అణ్వాయుధ నిల్వలపై పరిమితులు తొలగిపోయాయి కనుక, పరస్పరం పోటీపడుతూ ఆయుధాలు పోగేసుకొనే అవకాశాలు అధికం. ఒప్పందాన్ని మరో ఏడాది కొనసాగించడానికి అమెరికా గనుక ముందుకు వస్తే, తామూ సిద్ధమేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆర్నెల్లముందే ఓ మాటన్నారు కానీ, అమెరికా అధ్యక్షులవారు నోరువిప్పలేదు. సరైన సమయంలో ఆయన సముచిత నిర్ణయాన్ని తీసుకుంటారని వైట్‌హౌస్ ప్రపంచానికి హామీ ఇచ్చింది కానీ, ఒప్పందం కాలగర్భంలో కలిసిపోవడానికే ట్రంప్ సాయపడ్డారు.

గడువు తీరినప్పటికీ, అమెరికా హద్దులు దాటనంతవరకూ తాము న్యూస్టార్ట్ పరిమితులు, నియమనిబంధనలకు లోబడే నడుచుకుంటామని రష్యా విదేశాంగమంత్రి బుధవారం కూడా మాటిచ్చారు. ట్రంప్ తెంపరితనం తెలిసిందే కనుక ప్రపంచానికి ఆయనమీదే అనుమానం. గత ఏడాది పుతిన్ ఎంతో చక్కగా ఒప్పందాన్ని కొనసాగించే ప్రతిపాదన చేస్తే, చైనాను చేర్చితేనే కొత్త ఒప్పందాలు, కొనసాగింపుల గురించి ఆలోచిస్తానని ట్రంప్ వ్యాఖ్యానించారు. చైనా వెంటనే ఆ వ్యాఖ్యలను తిరస్కరించింది. పుతిన్ ప్రతిపాదించిన మరో ఏడాది గడువుకు రష్యా కట్టుబడివుంటుందని, అయితే, అమెరికా కూడా సదరు ఒప్పందం ఇంకా అమల్లో ఉన్నట్టుగానే వ్యవహరించాలని రష్యా అంటోంది. అబుదాబీలో గతవారం జరిగిన చర్చల్లో అమెరికా–రష్యాలు ఈ ఒప్పందాన్ని మరో ఆర్నెల్లు అనధికారికంగా పొడిగించాలని అనుకున్నట్టు వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే ప్రయత్నంలో భాగంగా అబుదాబీలో వరుసభేటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే, ఒప్పందానికి అనధికారికంగా కట్టుబడటం జరిగేపని కాదని, అణ్వాయుధాల విషయంలో రాతకోతలు ఉండితీరాల్సిందేనని విశ్లేషకుల వాదన.

ఒకపక్క ఉక్రెయిన్ యుద్ధం జరుగుతున్న తరుణంలో, అణుకట్టడికి దోహదపడుతున్న ఒక బలమైన ఒప్పందం లేకపోవడం భయం కలిగించే అంశం. 2010లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా, రష్యా అధ్యక్షుడు దిమిత్రీ మెద్వదేవ్ మధ్య ఈ ఒప్పందం కుదిరింది. నిక్సన్, బ్రెజ్నేవ్‌ల మధ్య 1972లో సాల్ట్–1తో మొదలైన వరుస ఒప్పందాల్లో ఇది ఆఖరుది. ఈ న్యూస్టార్ట్ కింద చేరోదేశం 700కన్నా ఎక్కువ క్షిపణులు, 1500 కన్నా ఎక్కువ అణ్వస్త్రాలను వినియోగానికి సిద్ధంగా నిల్వ ఉంచకూడదు. ఈ హద్దులు పాటిస్తున్నదీ లేనిదీ పరస్పరం తనిఖీచేసుకొనే అధికారాలు కూడా వాటికి దఖలు పడ్డాయి. ఉక్రెయిన్ యుద్ధం ఆరంభమైన ఏడాదికి, 2023 ఫిబ్రవరిలో, అమెరికామీదా, నాటోమీద తీవ్ర ఆగ్రహంతో పుతిన్ ఈ ఒప్పందానికి వీడ్కోలు చెప్పినా, నిబంధనలకు కట్టుబడివుంటామని హామీ ఇచ్చారు. అదే పుతిన్ ఆర్నెల్ల ముందుగానే 'న్యూస్టార్ట్' కొనసాగింపు గురించి ప్రతిపాదన చేసినా, అమెరికా అధ్యక్షుడు నోరువిప్పడం లేదు. దీనికితోడు, అమెరికా మళ్ళీ అణుపరీక్షలకు సిద్ధం కావాలని వ్యాఖ్యానించి ఈ మధ్యనే ప్రపంచాన్ని భయపెట్టారు కూడా.

తమ దేశ ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అన్ని మార్గాలనూ వాడుకుంటామని ఉక్రెయిన్ దండయాత్రలో ఉన్న పుతిన్ కూడా అదేపనిగా హెచ్చరిస్తున్నారు. 2024లో అణ్వాయుధాలను సైతం వినియోగించగలిగే ఒక ఆదేశంమీద ఆయన సంతకం కూడా చేశారు. కొన్ని కొత్తరకం అణ్వాయుధాలను సిద్ధం చేస్తున్నారని విమర్శలు కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఇప్పుడు ఉపరితలంలో అంత ప్రమాదం ఏమీలేనట్టు కనిపిస్తున్నా, రేపటిరోజుల్లో పరిస్థితులు ఎలా మారతాయో చెప్పలేం. శాంతి ఒప్పందం ఎన్నటికీ కుదరని, యుద్ధం ఎంతకూ ఆగని వాతావరణంలో అగ్గి మరింత రాజుకొని ఎవరైనా కట్టుతప్పవచ్చు. జూన్‌లోగా యుద్ధం ఆగిపోవాలని ట్రంప్ బలంగా కోరుతున్నట్టు ఉక్రెయిన్ అధినేత అంటున్నారు కానీ, అత్యంత కఠినమైన రష్యా డిమాండ్లను పశ్చిమదేశాలు అంగీకరించినప్పుడే అది ఆచరణ సాధ్యమవుతుంది. దశాబ్దాల భయం నుంచి ప్రపంచాన్ని బయటపడవేసిన న్యూస్టార్ట్ ఒప్పందం కూలిపోయి ప్రపంచం ప్రస్తుతం ఒక ప్రమాదకర దశలో ఉంది.

అన్నదాతకు గ్లోబల్ గ్యారెంటీ

"ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ ఒక ఆశాకిరణం. భారత్ కుదుర్చుకుంటున్న ఇన్ని వాణిజ్య ఒప్పందాలు ఆ దేశంపై ప్రపంచానికి ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తున్నాయి. ప్రపంచ వృద్ధిలో 15శాతం వాటా భారత్ నుంచే వస్తోంది." అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థకు చెందిన క్రిస్టాలినా జార్జీవా చెప్పిన నిజం ఇది. భారత్ – అమెరికా మధ్య కుదిరిన తాజా ట్రేడ్ డీల్‌తో ఇది మరోసారి నిజం అయింది. ప్రధాని మోదీ దార్శనికతతో భారత్ నేడు ప్రపంచ వేదికపై ఒక శక్తిమంతమైన ఆర్థిక శక్తిగా ఆవిర్భవిస్తోంది.

అమెరికాతో కుదిరిన చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందం అంకెలకు సంబంధించింది కాదు, ఇది 140 కోట్ల మంది భారతీయుల ఆత్మనిర్భరతకు దక్కిన అంతర్జాతీయ గుర్తింపు. సుమారు 190 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని రాబోయే ఐదేళ్లలో 500 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా కుదిరిన ఈ ఒప్పందం, భారత ఆర్థిక వ్యవస్థలో నూతన అధ్యాయాన్ని లిఖించబోతోంది. భారతీయ ఎగుమతిదారులకు అపారమైన అవకాశాలు లభించనున్నాయి. భారతీయ వస్త్రాలు, ఇంజనీరింగ్ వస్తువులు, ఫార్మా ఉత్పత్తులపై అమెరికా విధిస్తున్న దిగుమతి సుంకాలు భారీగా తగ్గడం వల్ల మన ఎగుమతిదారులకు ఏటా సుమారు 10 బిలియన్ డాలర్ల అదనపు ఆదాయం చేకూరుతుంది.

ఒకే సంవత్సర కాలంలో ప్రపంచంలోని ఐదు శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థలతో భారత్ వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడం నరేంద్ర మోదీ ఆర్థిక దౌత్య విజయం. ఈ ఒప్పందాలు కుదుర్చుకున్న దేశాల ఆర్థిక శక్తిని గమనిస్తే, ఇవి ప్రపంచ మొత్తం జీడీపీలో 50 శాతానికి పైగా వాటా కలిగి ఉన్నాయి. ప్రపంచ సంపదలో సగం వాటా ఉన్న మార్కెట్లలోకి నేడు భారతీయ వస్తువులకు నేరుగా మార్గం దొరికింది. యూఏఈ, ఆస్ట్రేలియా, మారిషస్ వంటి దేశాలతో పాటు ఐరోపాలోని కీలక దేశాలతో కుదిరిన ఈ ఒప్పందాల ద్వారా కోట్లాది మంది యువతకు ఉపాధి, లక్షలాది చిన్న మధ్యతరహా పరిశ్రమలకు గ్లోబల్ మార్కెట్, రైతులకు గిట్టుబాటు ధర లభించబోతున్నాయి. ఇది కేవలం వ్యాపారం కాదు, 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మించే దిశగా వేసిన బలమైన పునాది.



అమెరికాతో జరిగిన ఒప్పందంలో రైతు వ్యతిరేక అంశాలు ఉన్నాయని కాంగ్రెస్ ప్రచారం చేస్తున్నది. ఆ పార్టీ చెబుతున్నట్లు, విదేశీ ఉత్పత్తులు మన మార్కెట్‌ను ముంచెత్తడం అనేది ముమ్మాటికీ అవాస్తవం. దీన్ని నివారించేందుకే ప్రభుత్వం నెగెటివ్ లిస్ట్ అనే రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసింది. మన దేశంలోని చిన్న, మధ్య తరహా రైతులకు వెన్నెముకగా ఉన్న పాడి పరిశ్రమ, గోధుమలు, వరి, చెరకు వంటి కీలక పంటలను ఈ జాబితాలో ఉంచడం ద్వారా అమెరికా నుంచి వచ్చే చౌకైన దిగుమతుల నుంచి మన రైతులకు పూర్తి రక్షణ కల్పించారు. అంటే, మన అంతర్గత మార్కెట్ స్థిరంగా ఉంటుంది, విదేశీ పోటీ వల్ల మన రైతుకు నష్టం కలిగే అవకాశమే లేదు.

మరోవైపు, ఈ ఒప్పందం భారతీయ రైతులకు కొత్త ఆదాయ మార్గాలను తెరుస్తోంది. ఇప్పటివరకు అమెరికా వంటి దేశాలకు మన వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతి చేయాలంటే కఠినమైన ఫైటోశానిటరీ నిబంధనలు, భారీ సుంకాలు అడ్డంకిగా ఉండేవి. ఈ ఒప్పందం వల్ల భారతీయ మామిడి, ద్రాక్ష, దానిమ్మ, బాస్మతియేతర బియ్యం వంటి ఉత్పత్తులకు అమెరికా మార్కెట్లోకి జీరో డ్యూటీ లేదా నామమాత్రపు సుంకంతో ప్రవేశం లభిస్తుంది. దీనివల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గి, రైతు పండించిన పంటకు అంతర్జాతీయ స్థాయిలో గిట్టుబాటు ధర లభిస్తుంది. ఇది కేవలం వ్యాపారం కాదు, మన అన్నదాతను గ్లోబల్ ఎగుమతిదారుగా మార్చే ఒక గొప్ప సామాజిక మార్పు. అలాగే ఈ ఒప్పందం వల్ల అగ్రి–టెక్నాలజీ, కోల్డ్ స్టోరేజ్ రంగాల్లో అమెరికా నుంచి భారీ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉంది. పంట కోత అనంతరం జరిగే వృథాను అరికట్టడానికి ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. తద్వారా రైతు పండించిన ప్రతి గింజకూ విలువ లభిస్తుంది.

మేధో సంపత్తి హక్కుల విషయంలో ప్రభుత్వం రాజీ పడిందని, దీనివల్ల మందుల ధరలు పెరుగుతాయని కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు హాస్యాస్పదం. భారత ఫార్మా రంగం ప్రపంచానికే మెడికల్ హబ్‌గా ఉంది. మన దేశంలోని సామాన్యులకు చౌకగా లభించే జెనరిక్ మందుల లభ్యతకు ఎలాంటి ముప్పు వాటిల్లదనీ, పేటెంట్ చట్టాల్లో మన జాతీయ ప్రయోజనాలే పరమావధిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందనీ విపక్షాలు గ్రహించాలి. అలాగే డేటా ప్రైవసీ, సార్వభౌమత్వం గురించి కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదం. డిజిటల్ విప్లవం ద్వారా భారతీయుల డేటా భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ ప్రభుత్వం ఇప్పటికే కఠిన చట్టాలను రూపొందించింది. అమెరికా టెక్ కంపెనీలు భారత చట్టాలకు లోబడి ఉండాల్సిందే తప్ప, మన పౌరుల సమాచారాన్ని తరలించుకుపోవడం సాధ్యం కాదు.

ఈ ఒప్పంద చర్చల్లో పారదర్శకత లేదనే విమర్శలు కూడా అర్థరహితమైనవి. అంతర్జాతీయ వాణిజ్య చర్చలు వ్యూహాత్మక గోప్యతతో జరుగుతాయి. ఒప్పందం పూర్తయ్యాక ప్రతి అంశం ప్రజల ముందుకు వస్తుంది. 2014కు ముందు దేశాన్ని కుంభకోణాలమయం చేసినవారు, నేడు పారదర్శకత గురించి మాట్లాడటం విడ్డూరం. కోట్లాదిమంది యువతకు లభించే ఉపాధిని అడ్డుకోవడమే విపక్షాల అసలు ఎజెండాగా కనిపిస్తోంది. 21వ శతాబ్దం భారత్‌దే అని ప్రపంచం నమ్ముతున్న తరుణంలో, అమెరికాతో కుదిరిన ఈ ఒప్పందం మన దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు నడిపించే ఒక శక్తిమంతమైన అడుగు. అభివృద్ధికి అడ్డుపడటం మానుకుని, దేశ ప్రయోజనాల కోసం జరుగుతున్న ఈ బృహత్తర కార్యాన్ని విపక్షాలు గుర్తించాలి.

○ **యస్.విష్ణువర్ధన్‌రెడ్డి**
బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు

చినజీయర్ వ్యాఖ్యలపై ఓ వైష్ణవుడి ధర్మాగ్రహం

నా వయస్సు 78 సంవత్సరాలు. ఈ వయోభారం నా మీద ఉన్న ప్రత్యేక బాధ్యతలను గుర్తుచేస్తూంటుంది. జాగ్రత్తగా ఆలోచించి మరీ మాట్లాడాల్సిన అవసరం ఉన్నదన్న సూచన చేస్తుంది. చిన్ననాటి నుంచే వైష్ణవ సంప్రదాయానికి అంకితభావంతో ఉన్న సామాన్యుడిని. త్రిదండి పెద శ్రీమన్నారాయణ జీయర్ స్వామి ఆశీస్సుల కింద 'సమాశ్రయణం' (పంచ సంస్కారం) పొందే సదవకాశం కలిగినవాడిని. ఆ అనుభవమే, నా ఆధ్యాత్మిక వ్యక్తిత్వాన్ని, నియమశీలతను జీవితాంతం నిలిచేలా మలిచింది.

శైవ, వైష్ణవ, శాక్త, స్మార్త తదితర అనేక ధారలు కలిసి ప్రవహించే ఒక విశాలమైన నాగరిక, ఆధ్యాత్మిక పరంపరగా, సజీవ వాహినైన 'సనాతన ధర్మం'గా వైదిక తత్త్వాన్ని భావించాను. వైష్ణవ సంప్రదాయానికి కట్టుబడి ఉన్నప్పటికీ, హిందూ సంప్రదాయాలన్నిటినీ సమాన గౌరవంతో భావిస్తూ వచ్చాను. అందుకే, ఇటీవలి పరిణామాలు ఒక మౌనమైన విరక్తికి దారి తీశాయి. ఇది కోపం కాదు, లోతైన ఒక విషాదం. దీనికి తక్షణ కారణం, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామీజీ అలవోకగా, జగద్గురు ఆదిశంకరాచార్యుల గురించి చేసిన వ్యాఖ్యలు. ఇవి పలువురు చరిత్రకారులను, పండితులను, వివిధ సంప్రదాయాలకు చెందిన నిష్ఠాగరిష్ఠ భక్తులను కలవరపరిచాయి.

ఆదిశంకరాచార్యులు ఘనమైన వైష్ణవ భక్తుడని, ఆయన నాలుగు శంకర పీఠాలను స్థాపించనేలేదని, శతాబ్దాల తరువాత విద్యారణ్యులు స్థాపించారని, చినజీయర్ స్వామి వ్యాఖ్యలుగా సామాజిక మాధ్యమాలలో విమర్శలతో సహా చక్కర్లు కొడుతున్నాయి. అద్వైత వేదాంతాన్ని ప్రచారం చేసిన తరువాత ఆదిశంకరులు చిన్న వయస్సులోనే హిమాలయాలకు పోయి సమాధి పొందారని ప్రతీతి. ఆ ఆచార్యోత్తముడితో అనుసంధానించబడే శంకర పీఠాల వ్యవస్థకు ఆయనకు సంబంధంలేదనేది జీయర్ స్వామి వ్యాఖ్యల సారాంశం. ఈ వ్యాఖ్యలు సత్యమా, అసత్యమా అన్నది పక్కనపెడితే, ఆదిశంకరాచార్యుల పట్ల అపార భక్తి కలిగిన అనేకమంది మనోభావాలను అవి గాయపరిచాయన్నది మాత్రం వాస్తవం.

ఆదిశంకరాచార్యులు దక్షిణంలో శృంగేరి, పశ్చిమంలో ద్వారక, తూర్పున పూరీ, ఉత్తరంలో జ్యోతిర్మఠం అనే నాలుగు పీఠాలను స్థాపించిన జగద్గురువుగా గుర్తింపు పొందిన మహనీయుడు. ఇవి భారత ఉపఖండమంతటా వేదాధ్యయనాన్ని, ఆధ్యాత్మిక క్రమశిక్షణను, ఐక్యతను కాపాడే ఆధ్యాత్మిక మౌలిక స్తంభాలుగా భావితమయ్యాయి. ఆదిశంకరుల జీవన కాలానికి సంబంధించిన వివరాలలో చరిత్రకారుల అభిప్రాయాలు ఒకింత భిన్నంగా ఉన్నాయి. అయితే అద్వైత చింతనాభివృద్ధిలో ఆదిశంకరుల ప్రాథమిక కీలక పాత్రను గానీ, శంకర పీఠాల వ్యవస్థతో ఆయన అనుసంధానాన్ని గానీ చరిత్రాధ్యయనం ఎప్పుడూ గంభీరంగా ప్రశ్నించలేదు. ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాలపై ఆయన వ్యాఖ్యానాలు ఇప్పటికీ హిందూ ధర్మానికి కేంద్ర స్తంభాలు. మధ్య యుగాలలో హిందూ ధార్మిక సంస్థలను పునరుజ్జీవింపజేసిన మహనీయుడిగా విద్యారణ్యులను గౌరవిస్తారు. కానీ శంకర పీఠాలను ఆదిశంకరాచార్యులు కాదు, విద్యారణ్యులే స్థాపించారన్న వాదన సాధారణంగా అంగీకృతమైన చారిత్రక లేదా సంప్రదాయ కథనంలో భాగంగా కనిపించదు.



> ఆదిశంకరాచార్యుల గురించి చినజీయర్ స్వామి చేసిన వ్యాఖ్యలు వినూత్న భావాలు, ఆలోచనలుగా కాకుండా అసందర్భంగా అనిపించాయి. సనాతన ధర్మానికి నిబద్ధులైన అనేకమంది భక్తుల్లో వేదనను, కలవరాన్ని కలిగించాయి. ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు వారివారి తత్త్వ జ్ఞానాన్ని నలుదిక్కులా ప్రసరింపజేశారే కానీ, పరస్పర ప్రత్యర్థులుగా వ్యవహరించలేదు.

అయితే, ఆ వాదన కంటే ఎక్కువగా కలవరపెట్టే అంశం: అలాంటి వ్యాఖ్యల ధోరణి, దిశ. సంప్రదాయ భేదాల ముసుగులో ఒక మహత్తర సామూహిక ఆధ్యాత్మిక వారసత్వాన్ని, వర్గీయ వ్యాఖ్యానాల ద్వారా తగ్గించినట్టు అనిపించినప్పుడు, సనాతన ధర్మంలో అనవసర విభేదాలు పుట్టే ప్రమాదం ఉంటుంది. అవసరమా?

జగద్గురువుగా ప్రసిద్ధికెక్కిన ఆదిశంకరాచార్యులు వైష్ణవులు, శైవులు, స్మార్తులు తదితర అన్ని సంప్రదాయాల వారిచే సమరీతిలో గౌరవింపబడుతూ వచ్చిన ఐక్యతా ప్రతీక. వైష్ణవ క్రమశిక్షణలో పెరిగినవాడినైనా, విశాలమైన హిందూ నాగరిక దృష్టికోణానికి కట్టుబడి ఉన్నవాడిగా, ఈ పరిణామం ఒక అసహజమైన అశాంతిగా భావన కలుగుతున్నది. అభిప్రాయభేదాలకు ఆస్కారం ఇస్తూనే, సాధారణ తత్త్వజ్ఞానాన్ని చెరిపేయని పరంపర కారణానే సనాతన ధర్మం సజీవ వాహినిగా నిలిచింది. ఆ సున్నితమైన సమతౌల్యాన్ని మనం కోల్పోకూడదు.

అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత... ఈ మూడు ప్రధాన వేదాంత సంప్రదాయాల వర్తమాన ప్రతినిధులను, ఆచార్యులను సందర్శించే, ఆశీస్సులు పొందే భాగ్యం నాకు పలుమార్లు లభించింది. ఆ అనుభవాల ద్వారా స్పష్టంగా అర్థమైంది ఏమిటంటే, భారత తత్వశాస్త్రం గతానికి చెందిన ఒక అవశేషం కాదు, అనాది నుంచి నేటిదాకా ప్రవహిస్తున్న సజీవధార. ఆ ధారను ముందుకు తీసుకువెళ్తున్న మహనీయులు తమ విజ్ఞానాన్ని గంభీరతతోనే కాకుండా, కృపతో, సంయమంతో జీవింపజేస్తున్న ప్రతినిధులు. వారితో మాట్లాడుతుంటే, సజీవమైన ఆధ్యాత్మిక సంప్రదాయాన్ని ప్రత్యక్షంగా అనుభవించినట్లుగా భావన కలగడం సహజం. ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు ఆదిలో కానీ, కాలగమనంలో కానీ, వారివారి తత్త్వ జ్ఞానాన్ని నలుదిక్కులా ప్రసరింపజేశారే కానీ, పరస్పర ప్రత్యర్థులుగా వ్యవహరించలేదు.

ఈ ముగ్గురు మహా ఆచార్యులు తమ తమ కాలాల ఆధ్యాత్మిక అవసరాలకు స్పందనగా అవతరించారు. విభజన, అయోమయం వ్యాప్తిలో ఉన్న కాలంలో శంకరాచార్యులు అద్వైత వేదాంతాన్ని ప్రతిపాదించి ఆత్మజ్ఞానాన్ని వెలిగించారు. అదే ఏకత్వ దర్శనం. ఉపనిషత్తుల ఆత్మజ్ఞానంపై, అంతర్గత మేల్కొలుపుపై ఆయన పునఃప్రాధాన్యాన్ని నెలకొల్పారు. వివిధ దేవతారూపాలను, క్రమబద్ధమైన తర్కాన్ని, ఆధ్యాత్మిక సాధనను సమన్వయపరిచే ఒక విశాల సమ్మేళనాన్ని ఆయన తత్వం అందించింది. వేద జ్ఞానాన్ని సంరక్షించి, తరతరాలకు అందించే స్థిరమైన పీఠాల ఆవిర్భావానికి అది దారితీసింది. అద్వైత తత్త్వ హృదయంలో, సర్వసత్త్వంలో నిగూఢంగా ఉన్న ఏకత్వ ప్రకటన ఉంది.

రామానుజాచార్యులు విశిష్టాద్వైతం ద్వారా భక్తి, ప్రపత్తి మార్గాలను ప్రజలందరికీ అందించారు. భక్తి భూమికను పూర్తిగా పునర్నిర్మించారు. బ్రహ్మన్ ఏకత్వాన్ని అంగీకరిస్తూనే, జగత్తు యథార్థతను, జీవాత్మ వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించారు. ఈ రెండింటినీ శ్రీమన్నారాయణుడితో గాఢమైన సంబంధంలో బంధించారు. ఫలితంగా భక్తి, ప్రపత్తి మార్గాలు సామాన్యులకూ అందుబాటులోకి వచ్చాయి. సామాజిక అడ్డంకులను దాటుతూ, భక్తిని జీవనంలో ఆచరించే కరుణగా మారుస్తూ, ఆయన దృక్కోణం విస్తరించింది.

మధ్వాచార్యులు ద్వైత వేదాంతాన్ని ప్రతిపాదించారు. దేవుడు, జీవుడు, పదార్థం మధ్య నిత్యమైన భేదాన్ని స్థాపిస్తూ, భేదం లోపం కాదు, భక్తిని అర్థవంతం చేసే దైవ సంకల్పం అనే విషయాన్ని బోధించారు. 'పంచభేద' సిద్ధాంతం ద్వారా విశ్వాసంలో వ్యక్తిత్వాన్ని కాపాడుతూ, విష్ణువుకు నిత్య సేవనే కేంద్రంగా కలిగిన ఒక దృఢమైన, వాస్తవోన్ముఖ భక్తిని అది ప్రేరేపించింది. రాఘవేంద్రస్వామి మఠం ద్వారా, ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఈ సంప్రదాయాలన్నింటి ద్వారా స్పష్టమయ్యేది ఒకే ఒక్క విషయం. అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం పరమసత్యంపై పరస్పర పోటీ వాదనలు కావు. ఒకే పరమసత్యానికి మూడు సంపూర్ణ వ్యక్తీకరణలు మాత్రమే.

అవగాహనను విస్తరించగలిగే ఒక కొత్త దృక్కోణాన్ని ప్రతిపాదించాల్సిన చోట, ఆదిశంకరాచార్యుల గురించి చినజీయర్ స్వామి చేసిన వ్యాఖ్యలు వినూత్న భావాలు, ఆలోచనలుగా కాకుండా అసందర్భంగా అనిపించాయి. సనాతన ధర్మానికి నిబద్ధులైన అనేకమంది భక్తుల్లో, వేదనను, కలవరాన్ని కలిగించాయి. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత సంప్రదాయాల వర్తమాన ఆచార్యులు చినజీయర్ స్వామీజీ, శంకర పీఠాధిపతులు, మంత్రాలయ పీఠాధిపతి ఒకే వేదికపై ఆసీనులై, విశ్వహిందూ ధర్మాన్ని ప్రపంచానికి మరింత బలంగా పరిచయం చేయాలి. సనాతన ధర్మానికి తాము సంరక్షకులమన్న భావన కలిగించాలి.

■ **వనం జ్వాలానరసింహారావు**

34వ జాతీయ నాస్తిక మేళా

దేవుడి ఉనికిలో, దైవ భావంలో విశ్వాసం ఉంచేది 'ఆస్తికత్వం'. అందుకు విరుద్ధంగా, వాటిని కచ్చితంగా తిరస్కరించేది 'నాస్తికత్వం'. అయితే నాస్తికత్వం అనేది దేవుడు లేడు అనే దగ్గరే ఆగిపోతే విశ్వాసం, అవిశ్వాసాల మధ్య సంఘర్షణగానే మిగిలిపోతుంది తప్ప, సామాజిక ప్రయోజనం ఉండదు. ఆస్తిక భావజాలం ప్రజావ్యతిరేకమైనది, మనిషిని నిర్వీర్య వ్యక్తిగా, నిస్సహాయకుడిగా, బలహీనుడిగా మారుస్తుంది. క్రియారహితుడిగా భావదాసుణ్ణి చేస్తుంది. మార్క్సిస్టు గతితార్కిక చారిత్రక భౌతికవాదం ప్రాతిపదికగా ఉన్న క్రియాశీలక నాస్తిక వాదం... దోపిడీ రహితమైన, మనిషిని మనిషిగా జీవించే మానవీయ సమాజ నిర్మాణం... నాస్తిక సమాజ లక్ష్యం. మన దేశంలో వేల సంవత్సరాల క్రితమే పీడిత ప్రజల సిద్ధాంతంగా ముందుకొచ్చిన లోకాయతం, చార్వాక స్రీలను వారసత్వంగా స్వీకరించి శ్రమజీవుల సంస్కృతిగా 'నాస్తిక మేళా'ను చార్వాక రామకృష్ణ మాస్టారు తీర్చిదిద్దారు. ఇవాళ దేశంలో ఫాసిస్టు శక్తులు స్వైర విహారం చేస్తున్నాయి. అఖండ భారత్ మహా కలల్లో విహరించే మతోన్మాద సంఘాలిప్పుడు సాంస్కృతిక పెత్తనం కోసం ప్రశ్నించే గొంతుల్ని, అసమ్మతి తెలిపే బుద్ధిజీవుల్ని, అనాగరికపు ఆచారాన్ని ఎదిరించే హేతువాదుల్ని, పుక్కిటి పురాణాలు ప్రజల చరిత్ర కాదన్న చరిత్రకారుల్ని వేధించి ప్రాణాలు తీస్తున్నాయి. భారత ప్రధాన న్యాయమూర్తి (ప్రస్తుతం మాజీ) బీఆర్ గవాయ్‌పై దాడి, హర్యానా ఏడీజీ వై.పూరన్ కుమార్ ఆత్మహత్య ఘటనలు మన దేశంలో నెలకొన్న వ్యవస్థీకృత కులోన్మాదం, దానికి వెన్నుదన్నుగా నిలిచిన మతోన్మాద దుస్థితిని తెలుపుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఈ నెల 14, 15 తేదీలలో గుంటూరు జిల్లా, మంగళగిరి సమీపంలోని చార్వాక ఆశ్రమంలో 34వ జాతీయ నాస్తిక మేళా జరుగుతున్నది. 14న 'సమకాలీన సందర్భాల్లో భగత్‌సింగ్, పెరియార్ నాస్తిక ఆలోచనల ప్రాసంగికత' అంశంపై బి.రంగస్వామి, 'ప్రాచీన భారతంలో చార్వాకం' అంశంపై ఎంవీఎస్ శర్మ, 'పురాణ ప్రలాపం' అనే అంశంపై జె.లక్ష్మీరెడ్డి, 'దాచేస్తే దాగని సత్యం.. జీవ పరిణామం' అంశంపై కట్టా సత్యప్రసాద్, 'మతాలు–మూఢవిశ్వాసాలు' అంశంపై ముళ్ళై వేందన్, 'ఖగోళ శాస్త్ర విజ్ఞానం' అంశంపై రవిరాజా పోతినేని ప్రసంగిస్తారు. 15వ తేదీన 'ప్రైవేటీకరణ విధానాలు–మన దృక్పథం' అంశంపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, 'భారత రాజ్యాంగం – లౌకికవాదం – సవాళ్లు' అంశంపై డా. చెన్నుపాటి దివాకర్ బాబు, 'సంక్షోభ కాలంలో బుద్ధిజీవుల పాత్ర' అంశంపై ఎన్.వేణుగోపాల్, 'ఫాసిజం–భారతీయ సమాజం' అంశంపై డా. బి.వి.రాఘవులు, 'వైజ్ఞానికతకు మతభావాలకు పొసగని మైత్రి' అంశంపై డా. జయకుమార్ తదితరులు ప్రసంగిస్తారు.

○ **నాస్తిక సమాజం**
ఆంధ్రప్రదేశ్–తెలంగాణ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com

చట్టబద్ధత లేని తెలంగాణ వాదన

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఏర్పడిన జల వివాదాల పరిష్కారానికి కేంద్రం జల వివాదాల కమిటీని ఏర్పరిచింది. ఈ కమిటీ సమావేశానికి తెలంగాణ విశ్వాసంతో, చిత్తశుద్ధితో హాజరుకాలేదు. ఏదో ఒక లాంఛనం నెరవేర్చడానికన్నట్లుగా వచ్చింది. సమావేశంలో చర్చించవలసిన అంశాలపై కూడా దానికి స్పష్టత లేదు. కృష్ణా జలాలపై ఎప్పటిలాగే పాత పాటే పాడింది. ట్రిబ్యునల్ నివేదిక వచ్చే వరకు చెరో యాభై శాతం వాటా పంపిణీ జరపాలని కోరింది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన 512 (ఆంధ్ర), 299 (తెలంగాణ) టీఎంసీలకు ఒక చట్ట పాతిపదిక ఉంది. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టులకు చేసిన కేటాయింపులే ఆధారం. విభజన తరువాత ఇరు రాష్ట్రాలలో అమలులో ఉన్న ప్రాజెక్టుల చట్టబద్ధ కేటాయింపులు అలాగే ఉన్నాయి. మరి, తెలంగాణ చెప్తున్న చెరో యాభై శాతానికి ప్రాతిపదిక ఏమిటి? ఒక క్యాబినెట్ నిర్ణయం. ఈ వివాదంలో తెలంగాణ ఒక కక్షిదారు. వారి ఏకపక్ష నిర్ణయాల ఆధారంగా ఎలా నీటి పంపకాలు చేస్తారు? పైగా దీనికి చట్టబద్ధత కూడా లేదు. ఇంతకు ముందు కృష్ణా బోర్డులో ఇదే వాదన చేశారు. అక్కడ, చట్టబద్ధత లేదని తిరస్కరించారు. ట్రిబ్యునల్‌లో వాదనలు తుది దశకు చేరుకున్న సమయంలో ఒక కక్షిదారు ప్రతిపాదనను ఎలా ఆమోదిస్తారు?

ఈ సమావేశంలో ఒక ఆసక్తికర అంశం చర్చకు వచ్చింది– అది పోలవరం, నల్లమల సాగర్ అనుసంధానికి ప్రతిపాదించిన జలాల వినియోగం. ఆంధ్రప్రదేశ్ వరద నీరు... అని వర్ణిస్తే వరదనీరు అనే భావం ఉండదని జలాల విశ్వసనీయత, లభ్యత ఆధారంగా చిత్రించటం సబబు అని కేంద్ర జల సంఘం చైర్మన్ అన్నట్లు వార్తలు వచ్చాయి. రెండు కృష్ణా ట్రిబ్యునల్స్ కూడా వరద నీరు అనే పదం వాడలేదు. మిగులు జలాలు లేక కేటాయించని జలాలు అనే పేర్కొన్నాయి. ఈ మిగులు జలాల వినియోగానికి సంబంధించి అప్పటి మైసూరు (ఇప్పుడు కర్ణాటక) రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు అనుమతించిన మిగులు జలాల వినియోగాన్ని క్యారీ ఓవర్ స్టోరేజ్‌లోనే, అలాగే బేసిన్ లోపల మాత్రమే వాడేటట్లుగా నియంత్రించాలని అర్థించింది. కానీ, ఇలా చేస్తే ఉపయోగపడగల నీరు అనవసరంగా సముద్రం పాలవుతుందని కర్ణాటక అభ్యర్థనను ట్రిబ్యునల్–1 తిరస్కరించింది. ఇదే అంశంపై ట్రిబ్యునల్–2లో ఈ మిగులు జలాలను మూడు రాష్ట్రాలకు పంచాలని కర్ణాటక ప్రతిపాదించింది. అలా చేస్తే సందిగ్ధత, అస్పష్టత ఏర్పడతాయని చెప్తూ ఆంధ్రప్రదేశ్‌కు 2,578 టీఎంసీల పైబడి లభ్యమయ్యే పంచబడని జలాలు... హక్కు లేకుండా వాడుకోవచ్చని ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. వరద జలాలు అనే పద ప్రయోగం సాధారణ ప్రజానీకానికి అర్థమయ్యే పరిభాష. మిగులు జలాల పదం సాంకేతిక సందర్భంగా ఉపయోగించబడింది.


కృష్ణ, గోదావరి నదుల ప్రవాహ నిడివిలో చివరిది ఆంధ్రప్రదేశ్. రెండు ట్రిబ్యునల్స్ కూడా చిట్టచివరి రాష్ట్రానికే ఈ మిగులు జలాల వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చాయి. ట్రిబ్యునల్–2 ముందు తెలంగాణ చాలా విచిత్రమైన, వింతైన వాదనలు చేస్తోంది. ఆ పరంపరలోనే వారు కృష్ణానదికి కడపటి రాష్ట్రం తెలంగాణ అనీ, ఆంధ్రప్రదేశ్ కాదనీ వాదించారు. ఈ సందర్భంగా ఒకటి గమనించాలి. ఆంధ్రప్రదేశ్ మిగులు జలాలను ఎత్తిపోతల పథకాలకు ఉపయోగించటం ఒక అంశం అయితే, ఆ పైన లభించే మిగులు జలాలను బేసిన్‌లో నిల్వ చేసుకోవాలంటే శ్రీశైలం, నాగార్జున సాగర్‌ల జలాశయాలలోనే. తెలంగాణకైనా ఆ రెండే కదా! ఒక విధంగా ఈ రెండు రిజర్వాయర్ల పరంగా రెండు రాష్ట్రాలను అవిభక్త కవలలుగా పరిగణించాలి. మిగులు జలాలైనా, క్యారీ ఓవర్ స్టోరేజ్ అయినా నీటి ఆవిరి నష్టాల్లో మిగులు జలాలైనా ఇద్దరు ఉమ్మడి భాగస్వాములే కావడానికి అవకాశం ఉంది. కనుక తెలంగాణకు ఎంత కాదనుకున్నా ఆంధ్రప్రదేశ్‌తో సఖ్యత, అవగాహన అవసరం. ఇది దృష్టిలో పెట్టుకొని ఇచ్చిపుచ్చుకునే ధోరణి ప్రదర్శించటం తెలంగాణకు అవసరమని గ్రహించాలి.

> పోలవరం–నల్లమల సాగర్‌కు ఉపయోగించే నీరు (మిగులు జలాలైనా, నికర జలాలైనా, వరద జలాలైనా) వాడుకునే హక్కు ఆంధ్రప్రదేశ్ కలిగి ఉంది. దీనిపై తెలంగాణకు ఎందుకు ఆక్షేపణలు ఉండాలి? కృష్ణా ట్రిబ్యునల్స్ అనుసరించిన ప్రాతిపదికను బట్టి... తెలంగాణ ఏ ట్రిబ్యునల్ ముందు వాదించినా, మిగులు జలాలు వారికి దక్కవు.



ఇక గోదావరి జలాల విషయానికి వస్తే తెలంగాణ ఒక మొండి వైఖరి అవలంబిస్తోంది. కిందనున్న రాష్ట్రం మిగులు జలాలను వాడుకుంటే మీకు అభ్యంతరం ఏమిటి అని అడిగితే, ఆ జలాలపై వారికి హక్కు ప్రాప్తిస్తుందని సాకు చెప్తోంది. గోదావరి ట్రిబ్యునల్ తన తీర్పులో అప్పటి ఎగువ రాష్ట్రాలయిన పూర్వ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిషాలలో కొన్ని ప్రాజెక్టు స్థలాల దగ్గర 75 శాతం విశ్వసనీయతతో లభించే గోదావరి జలాలలో కొంత భాగం నీరు కిందకు ప్రవహించటానికి వీలు కల్పిస్తూ, అక్కడ వినియోగాలపై కొన్ని పరిమితులు విధించింది. దీనికి భిన్నంగా పూర్వ అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు మాత్రం ఎటువంటి షరతులు విధించకుండా... అందుబాటులో ఉన్న అన్ని జలాలను లేదా మిగులు జలాలను ఉపయోగించుకోవచ్చనే హక్కును కల్పించింది. అంతేగాక నిబంధన–iv ప్రకారం ప్రతి రాష్ట్రం తనకు కేటాయించిన వాటాలను ఇతర బేసిన్లకు మళ్ళించవచ్చని కూడా పేర్కొంది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ పోలవరం–నల్లమల సాగర్‌కు ఉపయోగించే నీరు (మిగులు జలాలైనా, నికర జలాలైనా, వరద జలాలైనా) వాడుకునే హక్కు కలిగి ఉంది. దీనిపై తెలంగాణకు ఎందుకు ఆక్షేపణలు ఉండాలి? కృష్ణా ట్రిబ్యునల్స్ అనుసరించిన ప్రాతిపదికను బట్టి... తెలంగాణ ఏ ట్రిబ్యునల్ ముందు వాదించినా, మిగులు జలాలు వారికి దక్కవు. ఈ నీటిని అన్ని రాష్ట్రాలకు పంచితే ఎవరిష్టం వారిగా ఉపయోగించడం జరుగుతుందని, అస్పష్టత చోటుచేసుకుంటుందని ట్రిబ్యునల్–2 నివేదిక చెప్పింది. తెలంగాణ ఈ సంగతి గ్రహించి, ఆంధ్రప్రదేశ్ ప్రణాళికలకు అడ్డంకులు కలిగించటం మానుకోవాలి.

● **కురుమద్దాలి వెంకటసుబ్బారావు**
విశ్రాంత చీఫ్ ఇంజనీర్



- యూనివర్సిటీల చేతిలో ఇంటర్ విద్యార్థుల డేటా
- ప్లేస్‌మెంట్ గ్యారెంటీ అంటూ మాయమాటలు



- నిత్యం ఫోన్లు.. తమ వర్సిటీలో చేర్పించాలని ప్రలోభాలు

ప్రైవేటు వర్సిటీల ప్రలోభాల ఎర

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోన్న విద్యార్థుల డేటా దేశ వ్యాప్తంగా ప్రైవేటు యూనివర్సిటీలకు లీక్ చేశారు. విద్యార్థి, తల్లిదండ్రుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు, ప్రస్తుతం ఏ గ్రూపులో చదువుతున్నది, కళాశాల పేరు వంటి వివరాలను చేరవేశారు. ఈ లీకేజ్ ఎక్కడి నుంచి జరిగిందనేది మిస్టరీగా మారింది. ప్రైవేటు కళాశాలల నుంచి జరిగిందా/ఇంటర్మీడియట్ బోర్డు నుంచి చేశారా అనేది తెలియకుండా ఉన్నది. దీంతో నిత్యం ప్రైవేటు యూనివర్సిటీల యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ ప్రలోభాలకు గురి చేస్తోన్నాయి. మా క్యాంపస్ అత్యున్నతమైన ప్రమాణాలతో కూడుకొని ఉంటుందని, మీ పిల్లలను చేర్పిస్తే భవిష్యత్తులో ప్లేస్‌మెంట్ గ్యారెంటీ అంటూ వల విసురుతోన్నాయి. కొన్ని యూనివర్సిటీలు అయితే నేరుగా సంప్రదించకుండా వాట్సాప్ ద్వారా సందేశాలు పెడుతోన్నాయి.

ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఈ సంవత్సరం ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్ పరీక్షలకు 60 వేల మందికి పైగా హాజరవుతున్నారు. వీళ్లల్లో ఎక్కువ శాతం ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు చెందిన విద్యార్థులే. తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ఎక్కువ సంఖ్యలో డీమ్డ్ యూనివర్సిటీలు ఉన్నాయి. ఆయా యూనివర్సిటీలు గుంటూరు, విజయవాడల్లో స్థానిక కార్యాలయాలు కూడా ఏర్పాటు చేసుకొని తెలుగు భాష మాట్లాడేవారిని సిబ్బందిగా నియమించుకొన్నాయి. వాళ్లకు టార్గెట్లు పెట్టి నిత్యం విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తోన్నాయి. తమకు వేరే రాష్ట్రాలకు పిల్లలను చదువుల కోసం పంపడం ఇష్టం లేదని మొత్తుకుంటున్నా (మిగతా 8లో)




ఘాట్ రోడ్డులో బస్సులు(పాత చిత్రం)

- కొండపైకి వెళ్లేందుకు 22 ఆర్టీసీ బస్సులు
- వాహన పాసుల పంపిణీకి పోలీసుల సమాయత్తం
- కోటప్పకొండపై సామాన్య భక్తులకు ఈ ఏడాదీ ఇక్కట్లేనా?
- వీఐపీ ఉచిత దర్శనం రద్దుతో ప్రశంసలు.. వాహన పాసులపై విమర్శలు

వీఐపీలకే.. పెద్దపీట

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)
కోటప్పకొండ తిరునాళ్లలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇటీవలే చెప్పారు. కోటయ్య స్వామి వీఐపీ దర్శనం ఉచిత పాసులను అధికారులు రద్దు చేశారు. మంత్రి ప్రకటన.. అధికారుల చర్యలతో సామాన్య భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోటయ్య క్షేత్రంలో ఏటా పడుతున్న ఇక్కట్లు ఈ సారి ఉండవని భక్తులు భావించారు. అయితే కొన్ని శాఖల అధికారుల వీఐపీలకే పెద్దపీట వేసేందుకు సమాయత్త మవుతున్నారు. వీఐపీ ఉచిత దర్శనం తరహాలోనే వీఐపీ వాహనాల విషయంలో చర్యలు తీసుకోవాల్సిన పోలీసు శాఖ ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్న విమర్శలున్నాయి. గత ఏడాది అధిక సంఖ్యలో (మిగతా 8లో)

వీఐపీ దర్శనం టిక్కెట్లకు డిమాండ్

త్రికోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు తొలిసారిగా ఈ ఏడాది వీఐపీ దర్శనం పేరుతో దేవస్థానం ఆన్‌లైన్‌లో రూ.300 టిక్కెట్లను విక్రయి స్తోంది. తొలిరోజు మంగళవారం రెండు వేల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో స్లాట్ వారీగా ఉంచగా కొద్ది గంటల్లోనే భక్తులు కొనుగోలు చేశారు. బుధవారం మరో రెండు వేల టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేశా రు. బుధవారం సాయంత్రానికి భక్తులు మొత్తంగా 2750 టిక్కెట్లను కొనుగోలు చేశారు. భక్తుల డిమాండ్ ఆధారంగా వీఐపీ టిక్కెట్లను పెంచనున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.



తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం

సబ్‌కలెక్టర్ రారు.. ఫైళ్లు కదలవు

- నెల రోజులుగా భర్తీకి నోచుకోని వైనం
- కార్యాలయం చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- అటకెక్కిన ప్రజాఫిర్యాదులు.. అపరిష్కృతంగా భూ సమస్యలు

తెనాలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఏదైనా ఫైల్ వచ్చిందా! అయితే కొత్త సబ్ కలెక్టరో! ఆర్డీవోనో వచ్చే దాకా ఆగాల్సిందే. రెవెన్యూ క్లినిక్‌లలో పెట్టిన దరఖాస్తులైనా, ప్రజా ఫిర్యాదుల కింద ఇచ్చిన అర్జీలైనా, మరే ఇతర అత్యవసర పనులు ఉన్నా నిరీక్షణ మాత్రం తప్పదు. నెల క్రితం సబ్ కలెక్టర్ బదిలీపై వెళ్లాక పూర్తి స్థాయి బాధ్యతలు ఉన్న అధికారిని నియమించకపోవడమే ఇందుకు కారణం. సబ్ కలెక్టర్‌గా ఉన్న సంజనసింహా జనవరి 12న జేసీ హోదాలో పల్నాడు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె వెళ్లాక ఆ స్థానంలో గుంటూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావును ఇన్‌చార్జి ఆర్డీవోగా నియమించారు. అయితే ఆయన శాఖకు సంబంధించి పనుల ఒత్తిడి వల్లో లేక భూ సమస్యల పరిష్కారంలో చిక్కులు తెచ్చుకోవడం ఎందుకనుకున్నారో కాని తెనాలిపై దృష్టి పెట్టలేదు. ఒక వేళ కార్యాలయానికి వచ్చినా భూముల అర్జీలను పక్కన పెట్టేస్తున్నారు. రెవెన్యూ క్లినిక్‌ను ఏర్పాటు చేసి గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఅక్రమాలు, ఇతర సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహిస్తుండగా తెనాలిలో మాత్రం ఆ కార్యక్రమం జరగడంలేదు. చివరకు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో వస్తున్న అర్జీలను కూడా చిన్నపాటి సమస్యలను పరిష్కరిస్తూ మిగిలిన వాటిని పక్కన పెట్టేస్తున్నారు. దీంతో ఆ ఫైళ్లే కుప్పలుగా పేరుకుపోతున్నాయి. రీసర్వేలో ఇబ్బందులు, ఇతర కారణాలతో రైతులు రూరల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. రాజధానిలో కీలకమైన మంగళగిరి, తాడేపల్లి వంటి మండలాలు కూడా తెనాలి డివిజన్ పరిధిలోనే ఉండటం, అక్కడ జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూసేకరణ, ఇతర ఏర్పాట్లలో కూడా జాప్యం జరుగుతుంది. ఇన్ని ఇబ్బందులు ఎదురవుతున్నా పూర్తిస్థాయి బాధ్యతలతో ఎవరినీ నియమించకపోవడం విమర్శలకు కారణమవుతోంది. సమస్యలపై కార్యాలయానికి వెళ్తే కనీసం సమాధానం చెప్పేవారు కూడా కరువయ్యారంటూ కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డుదారులకు గోధుమ పిండిని అందించే కార్యక్రమాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రాతినిథ్యం వహిస్తున్న తెనాలిలో ప్రారంభిస్తే ఆ కార్యక్రమంలో కూడా కింది స్థాయి అధికారులు మినహా డివిజన్ స్థాయి రెవెన్యూ అధికారి లేరంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మహాశివరాత్రికి ఏర్పాట్లు చేయాలి

- సమీక్షలో కలెక్టర్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల్లో భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామి వారిని దర్శించుకునేలా దేవదాయశాఖాధికారులు రెవెన్యూ, పోలీస్ శాఖలను సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ అశుతోష్ శ్రీవాస్తవతో కలిసి జిల్లాలోని శివాలయాల వద్ద మహాశివరాత్రి పర్వదినం ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేబ్రోలులోని బాలకోటేశ్వరస్వామి, పెదకాకాని భ్రమరాంబా మల్లేశ్వరస్వామి దేవస్థానాలతో పాటు అన్ని శివాలయాల వద్ద గత సంవత్సరం శివరాత్రికి వచ్చిన భక్తుల సంఖ్యకి రెండింతల అదనంగా వస్తారనే అంచ నాతో ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం చేయాల న్నారు. పోలీస్ శాఖ సూచన మేరకు భక్తుల రద్దీకి అ నుగుణంగా క్యూలు, బ్యారికేడ్లు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. క్యూల వద్ద నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ప్రసాదాలను పరీక్షించిన తర్వాత పంపిణీ చేయాలని సూచించారు. సూచిక బోర్డులతో పాటు, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రథోత్సవాలు నిర్వహించే ఆలయ అధికారులు ఆర్‌అండ్‌బీ, విద్యుత్, పోలీస్, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలి

జిల్లాలో స్వర్ణ గ్రామ, వార్డు ఉద్యోగుల సేవలను సమతౌల్యంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. అక్షర ఆంధ్ర, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులపై ఒత్తిడి లేకుండా, పని వేళల్లోనే సర్వేలు నిర్వహించేలా పర్యవేక్షణ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.


మహా శివరాత్రి ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ అన్సారియా

ప్రాంతీయ సమీకృత వృద్ధి కేంద్రంగా.. అమరావతి

- విజయవాడ, గుంటూరుతో కలిపి టైర్-2 పట్టణ సముదాయం
- గవర్నర్ ప్రసంగంలో చేర్చిన రాష్ట్ర ప్రభుత్వం

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ సమీకృత వృద్ధి కేంద్రంగా అమరావతిని అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా బుధవారం గవర్నర్ ప్రసంగంలో విజయవాడ - గుంటూరు - అమరావతితో కలిపి క్లస్టర్ లాజిస్టిక్స్, పరిపాలన కార్యకలాపాలు, నైపుణ్యాల కేంద్రంగా బలమైన టైర్-2 పట్టణ సముదాయం ఆవిర్భవించేలా చేస్తామని పేర్కొన్నది. గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని చేర్చడం ద్వారా అమరావతికి ఇస్తోన్న ప్రాధాన్యాన్ని స్పష్టం చేసింది. అమరావతిని క్వాంటం, అధునాతన సాంకేతికతతో అనుసంధానించే కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొంది. రాష్ట్ర పునరుద్ధరణ నుంచి సాంకేతిక, ఆర్థిక పురోగతి వైపు నడిపించడానికి ఈ చొరవ ఎంతో దోహదపడుతుందని తెలిపింది. అమరావతి పునర్నిర్మాణం కొత్త ఉత్సాహంతో జరుగుతుండగా దీనికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు పేర్కొంది. అమరావతి రాజధాని నగర నిర్మాణంతో సుస్థిర ఆర్థిక వృద్ధి కోసం సహకార వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొన్నట్లు తెలిపింది. దీర్ఘకాలిక భరోస దిశగా ఒక ముఖ్యమైన అడుగు వేస్తూ ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తించేందుకు చట్టాన్ని తీసుకొచ్చే ప్రక్రియని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించినట్లు ప్రకటించింది.

హైస్పీడ్ రైల్ కారిడార్‌తో కనెక్టివిటీ, ఆర్థిక వృద్ధి

హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్‌కారిడార్ అమరావతి మీదగానే వెళుతుంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుని పొందుపరిచింది. చెన్నై - బెంగళూరు హైస్పీడ్ రైల్ కారిడార్‌తో అమరావతికి లింకు కోరాం. ఈ ప్రాజెక్టుల వలన రాష్ట్రానికి ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ బాగా పెరుగుతుంది. ఆర్థిక వృద్ధికి వేగవంతంగా అడుగులు పడతాయని ప్రభుత్వం గవర్నర్ ప్రసంగంలో పేర్కొన్నది.

రైలు పట్టాలపై గుర్తుతెలియని ఇద్దరు దుర్మరణం | ఏషియన్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో ముఖేష్‌కు మరో రెండు పతకాలు | పేరేచర్లలో ఉరివేసుకుని యువతి ఆత్మహత్య 6

అమరావతి బౌద్ధ శిల్పకళ సంతృప్తినిచ్చింది
- జర్మనీ కౌన్సిల్ జనరల్ మిచెల్ హాస్పర్ 8


వెంకటపాలెంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు

ఎన్టీఆర్‌కు చంద్రబాబు నివాళి

- అసెంబ్లీకి వెళ్తూ వెలగపూడిలో సీఎం...

తుళ్లూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కాగా ఆనవాయితీ ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఉదయం 9.30 సమయంలో ముఖ్యమంత్రి తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, పలువురు మంత్రులతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలదండలు వేశారు. రాజధాని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ పూలు పరచారు. సూపర్ సిక్స్ పథకాల బ్యానర్‌ను ఏర్పాటు చేశారు.

రాజధానిలో.. కోస్తా మెరీనా

- పీపీపీ విధానంలో నిర్మాణానికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానికి అంతర్జాతీయంగా పర్యాటకులను ఆకర్షించేలా దేశంలోనే అతి పెద్ద కోస్తా మెరీనా ప్రాజెక్టు నిర్మించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. వెంకటపాలెం సమీపంలో కృష్ణానది తీరంలో పీపీపీ విధానంలో ఎకరం విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టు ద్వారా నదీ తీర ప్రాంతంలో ఆధునిక మెరీనా సౌకర్యాలు, వినోదం, ప్రజా వసతులను అభివృద్ధి చేస్తారు. సింగపూర్‌లో పర్యాటకులను ఆకర్షిస్తు న్న మెరీనా బే తరహాలో అమరావతిలో కోస్తా మెరీనా ప్రాజెక్టుని నిర్మించాలని ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా ఇప్పుడు టెండ ర్లు పిలిచేందుకు ఆమోదం తెలిపింది. ఇందులో 60 బెర్తులుంటాయి. స్టిల్ట్ లెవల్‌లో క్లబ్ హౌస్ నిర్మాణం చేస్తారు. అందులో స్విమ్మింగ్ పూల్, ల్యాండ్‌స్కేప్ చేసిన సీటింగ్ ఏరియా, టేబుల్ టెన్నీస్ కోర్టులు, రిసెప్షన్, పచ్చటి లాన్, యాక్టివ్ స్పోర్ట్స్ ఎరీన, ప్లేగ్రౌండ్, బోటింగ్, ఇండోర్ గేమ్స్, పూల్‌రూం, రెస్టారెంట్, స్కైడెక్ సదుపాయాలు ఉంటా యి. రెండో క్లబ్ హౌస్‌లో గెస్టు రూంలు, ప్రైవేటు డైనింగ్, స్టాఫ్ బ్లాక్, బార్, కాన్ఫరెన్స్ రూంలు, ఫిట్‌నెస్ సెంటర్లుంటాయి. రెండు సూట్ రూంలు, చిన్నపిల్లల ఆట స్థలాలు, అవుట్‌డోర్ స్విమింగ్‌పూల్ వంటివి కూడా నిర్మిస్తారు. నాలుగు కేటగిరీల్లో బోట్లు నదిలో షికారు కోసం అందుబాటులో ఉంచుతారు. వాటిల్లో మోటారు బోట్స్, పారాచూట్ లింక్డ్ బోట్స్, స్పీడు బోట్స్ వంటివి ఉంటాయి. ఈ ప్రాజెక్టుకి మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో కొద్ది రోజుల్లోనే పనులు ప్రారంభమౌతాయని సీఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి.


కలెక్టరేట్‌లో రెవెన్యూ క్లినిక్‌లో అర్జీలు ఇస్తున్న బాధితులు (ఫైల్ ఫొటో)

రెవెన్యూ సిత్రాలు

- నాటి సమస్య సృష్టికర్తలే.. నేటి పరిష్కర్తలు
- ఒకే అర్జీ పలు వేదికల వద్దకు.. అవే రెవెన్యూ క్లినిక్‌లకు
- జీరో గ్రీవెన్స్‌పై ప్రభుత్వ ఆదేశాలు పట్టని అధికారులు
- పరిష్కారం దొరక్క కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణ
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రిపీటెడ్ అర్జీలు 5,000

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)
ఎవరైతే సమస్య సృష్టిస్తారో.. మళ్లీ వాళ్ల దగ్గరకే ఆ సమస్య పరిష్కారం కోసం వెళుతున్న విచిత్రం ప్రస్తుతం రెవెన్యూ విభాగంలో నెలకొంది. గత ఏలుబడిలో స్థలాలు, పొలాలను ఉద్దేశపూర్వకంగా లిటిగేషన్‌లో పెట్టేశారు. కాగా ప్రభుత్వం మారితే తమకు న్యాయం జరుగుతుందని రెవెన్యూ బాధితులు గంపెడాశలు పెట్టుకోగా వారిలో నిరాశ నెలకొంది. కొందరు వీఆర్‌వోలు, మరికొందరు పై అధికారులు ఇష్టారీతిన సంతకాలు చేయడం వల్లే ప్రస్తుతం రెవెన్యూ సమస్యలు ఓ కొలిక్కి రావడం లేదని తెలుస్తోంది. సమస్య సృష్టించడంలో ఏ రెవెన్యూ సిబ్బంది అయితే సహకారం అందించిందో, తిరిగి ఆ టేబుల్ వద్దకే నేడు పరిష్కారం కోసం ఆ ఫైల్ వెళ్లడం విడ్డూరం. అప్పుడు పనిచేసిన యంత్రాంగంలో ఏ ఒక్కరూ ఇప్పుడు అక్కడ లేరు. బదిలీపై వేరే చోటుకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది ఇది తాము చేయలేమని, అప్పుడు ఉన్న అధికారి తప్పిదం వల్లే జరిగిందని తప్పుకుంటారు. గ్రామ సభలు మొదలు నేతలు నిర్వహించే ప్రజాదర్బార్‌ల వరకు ఒకే సమస్యపై వచ్చే రెవెన్యూ అర్జీలే అధికం. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఇలా రిపీటెడ్‌గా వచ్చే అర్జీల సంఖ్య దాదాదాపు 5,000 వరకు ఉండొచ్చని రెవెన్యూ విభాగమే అనధికారికంగా చెబుతోంది. గడచిన నెల నుంచి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌ల్లోనూ అదే తంతు. బాపట్ల కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్ టేబుళ్ల వద్దకు ఇప్పటి వరకు 578 సమస్యలు వచ్చాయి. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య 1800 వరకు ఉండొచ్చని తెలుస్తోంది. విచిత్రమేమిటంటే వీటిలో దాదాపు 70 శాతం వరకు గతంలో పీజీఆర్‌ఎస్‌లోనో, రెవెన్యూ గ్రామ సభల్లోనో ఇచ్చినవే. బాపట్ల జిల్లాలో రెవెన్యూ పరమైన సమస్యలతో గడచిన ఆరు నెలల వ్యవధిలో వివిధ వేదికలపైకి దాదాపు 3,600 అర్జీలు వస్తే వీటిలో అత్యధికం యంత్రాంగం సృష్టించిన సమస్యలే కావడం గమనార్హం. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 8,500 వరకు ఉండొచ్చనేది అంచనాగా ఉంది. పరిష్కారం దొరక్క పదేపదే బాధితులు తిరుగుతూ అర్జీలు ఇస్తున్నారే తప్ప మూలాల్లోకి వెళ్లే ప్రయత్నం అధికారులు కూడా చేయడం లేదన్న విమర్శలున్నాయి. సాధారణంగా భూమి కొనుక్కున్న వారు (మిగతా 8లో)

నాగేసు కుటుంబానికి కలెక్టర్ పరామర్శ

● ద్విచక్ర వాహనంపై మృతదేహం తరలింపుపై ఆరా ● కుటుంబానికి అండగా ఉంటానని హామీ ● నాగేసు కుటుంబానికి రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా నిత్యావసరాలు అందజేత ● రాళ్ల చెరువు ప్రాంతంలో గుడారాలు వేసుకొని జీవిస్తున్న కుటుంబాలకు నివాస స్థలాలు, గృహాలు ఇవ్వాలని ఆదేశం

బాపట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మృతి చెందిన కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామానికి చెందిన నిరుపేద నక్కా నాగేసు కుటుంబాన్ని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పరామర్శించారు. నాగేసు మృతితో రోదిస్తున్న కుటుంబాన్ని ఓదార్చారు. ఆ కుటుంబంతో కొంత సమయం గడిపి వారి స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా నిచ్చారు. నాగేసు మృతదేహాన్ని ఆసుపత్రి నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి తరలించడంపై కలెక్టర్ కుటుంబసభ్యులను ఆరా తీశారు. పంటకాలువల్లో చేపలవేట, పొలాలలో ఎలుకలు పట్టి జీవనం సాగించే నాగేసుకు రోజుకు రూ.300 నుంచి రూ.400 సంపాదించేవాడని కుటుంబసభ్యులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కాల్వగట్టు సమీపంలోనే గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నట్లు వివరించారు. ఇద్దరు కుమార్తెలకు వివాహం చేయగా కుమారుడు డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. నాగేసుకు గుండెపోటు రావడంతో ఆసుపత్రికి తరలించామని అక్కడ మృతి చెందడంతో అంబులెన్సుకు చెల్లించేందుకు డబ్బులు లేక మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించినట్లు కుటుంబసభ్యులు కలెక్టర్‌కు తెలిపారు.


రాళ్ల చెరువులో నాగేసు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కలెక్టర్ డాక్టర్ వి. వినోద్‌కుమార్

● రెడ్‌క్రాస్ ద్వారా నిత్యావసరాలు పంపిణీ

నిరుపేద నాగేసు కుటుంబానికి రెడ్‌క్రాస్ సంస్థ ద్వారా నిత్యావసర సరుకులు, దుప్పట్లు, ఒక బస్తా బియ్యం, కూరగాయలు, కిచెన్ కిట్లు, దుప్పట్లు, రగ్గులు, టార్పాలిన్ పట్టాలను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం నాగేసు మరణ ధ్రువీకరణపత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. నాగేసు భార్యకు వితంతు పెన్షన్ మంజూరు చేస్తామని తెలిపారు. ఏ సమస్య వచ్చినా మీకు నేనున్నానంటూ కలెక్టర్ ఆ కుటుంబానికి భరోసానిచ్చారు. రాళ్ల చెరువు ప్రాంతంలో గుడారాలు వేసుకొని జీవిస్తున్న కుటుంబాలకు నివాస స్థలాలు, గృహాలు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పి. గ్లోరియా, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖాధికారి అబ్దుల్, తహసీల్దార్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ముఖేష్‌కు మరో రెండు పతకాలు


కాంస్య పతకంతో ముఖేష్

గుంటూరు(క్రీడలు) ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో బుధవారం ముఖేష్ దేశానికి మరో రెండు పతకాలు సాధించి పెట్టాడు. 25 మీటర్ల రాపిడ్ ఫైర్ జూనియర్ విభాగం లో నేలవల్లి ముఖేష్ వ్యక్తి గత కాంస్య పతకం తో పాటు, మధ్య ప్రదేశ్ కు చెందిన సూరజ్ శర్మ, సాహిల్ చౌదరి లతో కలిసి టీం విభాగం లో స్వర్ణ పతకం గెలిచాడు. ఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్ లో ఈ నెల రెండు నుంచి జరుగుతున్న ఈ చాంపియన్ షిప్ లో గురు, శుక్ర వారాలు 25 మీటర్ల రాపిడ్ ఫైర్ విభాగం పోటీలు జరిగాయి. బుధవారం మధ్యాహ్నం జరిగిన ఫైనల్ పోరు లో ఇండోనేషియా కు చెందిన మహ్మద్ వజాజ్ అదితియా స్వర్ణ పతకం గెలిచాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన సూరజ్ శర్మ రజత పతకం గెలవగా ముఖేష్ కు కాంస్యం లభించింది. టీం విభాగంలో ముఖేష్‌తో కూడిన భారత్ త్రయం స్వర్ణ పతకం గెలవగా, కజకిస్తాన్‌కు చెందిన ఇంటిక్ బే రమజాన్, స్మిర్నవ్ దానిల్, కార్పోవ్ కాన్స్టాంటిన్‌ల త్రయం రజతం లభించింది. ఈ ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఇప్పటివరకు ముఖేష్ నాలుగు విభాగాలలో ఏడు పతకాలకు పోటీ పడగా ఆరు పతకాలు లభించాయి.

సాయి సాధన చిట్‌ఫండ్ బాధితులు పోలీసులను సంప్రదించాలి

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సాయి సాధన చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ బాధితులు సంబంధిత పోలీసు అధికారులను సంప్రదించి వాంగ్మూలం నమోదు చేయించుకోవాలని జిల్లా పోలీస్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో కోరింది. ఇప్పటివరకు ఈ కేసులో వాంగ్మూలాలు నమోదు చేయించుకోని బాధితులు ఎవరైనా ఉంటే ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరింది. అసలు ఆధారాలను నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొని రావాలని కోరింది. నగదు కట్టినట్లుగా ఉన్న బ్యాంక్ స్టేట్‌మెంట్లు, చిట్‌ఫండ్ కంపెనీకి సంబంధించిన చిట్ బుక్స్, ఇతర చెల్లింపు రసీదులు, గుర్తింపు కార్డులు తీసుకొని రావాలని పేర్కొంది. బాధితులు సిట్ విచారణ అధికారి రేపల్లె డీఎస్పీ 8333813225, మాచర్ల రూరల్ సీఐ 9440796229, ఎస్సై అశోక్ 9491010234 నంబర్లను సంప్రదించాలని జిల్లా పోలీస్ కార్యాలయం కోరింది.

గ్రామాల్లో డీవీసీ వైద్య సేవలు అభినందనీయం

● జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు సీనియర్ ప్రెసిడెంట్ ఎస్.ప్రేమానంద్ కృష్ణన్


డీవీసీ ఆసుపత్రికి యంత్రాన్ని అందజేస్తున్న జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు ప్రతినిధులు

పొన్నూరు, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలో నిరుపేదల కోసం డీవీసీ ఆసుపత్రి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందజేయడం అభినందనీయమని జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు సీనియర్ ప్రెసిడెంట్ ఎస్.ప్రేమానంద్ కృష్ణన్ అన్నారు. వడ్లమూడి డీవీసీ ఆసుపత్రికి బుధవారం బెంగళూరుకు చెందిన జన స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు సీఎస్‌ఆర్ ద్వారా రూ. 20 లక్షల విలువైన బీ బ్రౌన్ హెచ్‌డీఎఫ్ డయాలసిస్ యంత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ ప్రెసిడెంట్ ప్రేమానంద కృష్ణన్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిండం తమ బ్యాంకు లక్ష్యమని తెలిపారు. ఆరోగ్య రంగంలో భాగస్వామ్యం ద్వారా సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసుపత్రి సీఈవో డాక్టర్ కరణం నవీన్ మాట్లాడుతూ, ఈ కొత్త యంత్రంతో కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అత్యాధునిక నాణ్యమైన చికిత్సలు అందించగలుగుతామన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన డయాలసిస్ సేవలు అందించేందుకు ఈ యంత్రం దోహదపడుతుందని వివరించారు. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సందీప్ మాట్లాడుతూ, హెచ్‌డీఎఫ్ టెక్నాలజీ వల్ల శరీరంలో విష పదార్థాలు సమర్థవంతంగా తొలగించబడతాయన్నారు. రోగులకు మెరుగైన ఆరోగ్య ఫలితాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజనల్ హెడ్ అమన్నా, చల్లగండ్ల మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అమరేంద్ర, పాల్గొన్నారు.

వర్సిటీ అనే కుటుంబంలో అందరూ సమానమే

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వర్సిటీ అనే కుటుంబంలో అందరూ సమానమని ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వికాస భవన పునర్నిర్మాణం ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి అండగా ఉంటామన్నారు. ఉద్యోగులు వర్సిటీ సమస్యలను పెద్దవి చేయకుండా ఇక్కడే పరిష్కరించుకోవాలన్నారు. కలహాలు లేకుండా వర్సిటీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. పీఎఫ్ లేని ఉద్యోగులకు దాన్ని కల్పించేందుకు పరిశీలిస్తామన్నారు. విశిష్ట అతిథి వీసీ గంగాధర్ రావు మాట్లాడుతూ, దూర విద్య కేంద్రం నుంచి వచ్చే నిధులు ద్వారానే వర్సిటీ ఆర్థికంగా బలోపేతం చెందుతుందని దీనిపై కొంతమంది అధికారులు బురద చల్లటం బాధాకరమన్నారు. ఇకనైనా దూర విద్య కేంద్రంపై దుష్ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. దూరవిద్య డిగ్రీ కోర్సులకు పూర్వ వైభవం తీసు కొచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం మాట్లాడుతూ, నెలల తరబడి విధులకు హాజరుకాకుండా ఉన్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమయానికి రాని ఏ ఉద్యోగి అయినా సహించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టర్ ఆచార్య శివరాం ప్రసాద్, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు, దూర పెద్ద కేంద్రం కోఆర్డినేటర్ ది రామచంద్రన్,రాధాకృష్ణ, అసిస్టెంట్ రిజిస్టర్ కావూరి శ్రీనివాసరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● పీజీ పరీక్ష ఫలితాల విడుదల

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది నవంబర్‌లో నిర్వహించిన పీజీ మూడో సెమిస్టర్ రెగ్యులర్ ఎంకాం, ఎమ్మెస్సీ బోటని, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఫుడ్ ప్రాసెసింగ్ అండ్ క్వాలిటి మేనేజ్మెంట్, ఎంఏ హార్టికల్చర్ అండ్ ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్, 2/5 నానో టెక్నాలజీ మొదటి సెమిస్టర్, 3/5 నానో టెక్నాలజీ మొదటి సెమిస్టర్, 5/5 నానో టెక్నాలజి మొదటి సెమిస్టర్, డిప్లమా ఇన్ మూజిక్ (ఓకల్) పరీక్ష ఫలితాలను పరీక్ష నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్ రావు బుధవారం విడుదల చేశారు. ఈ నెల 20 వరకు రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తులను పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంలో 21వ తేదీలోపు సమర్పించాలని శివప్రసాద్ తెలిపారు. రివాల్యూయేషన్ ఫీజు ఒక్కో సబ్జెక్టుకు రూ.1860 చెల్లించాలన్నారు. ఫలితాల కోసం ఏఎన్‌యూ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): షూటింగ్ బాల్ అసోసియేషన్ గుంటూరు డిస్ట్రిక్ ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు రూరల్ లాలుపురం గ్రామంలోని కాటూరి పబ్లిక్ పాఠశాల ఆవరణలో షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి జట్టు ఎంపికలు నిర్వహించారు. అండర్-17 విభాగంలో జరిగిన ఎంపికలకు దాదాపు 70 మంది క్రీడాకారులు హజరైయ్యారని అసోసియేషన్ చైర్మన్ మార్కపూడి రవిబాబు, స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన జట్టు ఈ నెల 13 నుంచి జరిగే రాష్ట్ర పోటీలలో పాల్గొంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పత్రి వేణుగోపాల్, పీఈటీ జక్కుల పూజిత, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్ బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడకారులతో కోచ్‌లు

రేషన్ అక్రమ రవాణాపై ఉక్కుపాదం


అక్రమ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

అచ్చంపేట, గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలో రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. బుధవారం అచ్చంపేట గ్రామంలోని సీతారాంపురం వాగు వద్ద లేల్ల అప్పిరెడ్డి నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచి తరలించేందుకు సిద్ధం చేసిన ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. మొత్తం 82 బస్తాలలో, ఒక్కో బస్తాలో సుమారు 50 కేజీల చొప్పున ఉన్న 37.25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అచ్చంపేట గ్రామానికి చెందిన ముంద్రు వీరభద్రరావుపై అవసరమైన చర్యలు తీసుకోవాలని విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. అతనిపై ఎస్సెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ సెక్షన్ 6ఏ కింద కేసు నమోదు చేయడంతో పాటు, పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారానికి సంబంధించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని సీఎస్‌డీటీని ఆదేశించినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ జియాలజిస్ట్ జి.అనిల్ బాబు, ఎస్సై కె.అమీర్ విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు.

ఉరివేసుకుని యువతి ఆత్మహత్య

మేడికొండూరు ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మేడికొండూరు మండలం పేరేచర్ల జంక్షన్‌లోని ఒక కిరాణా షాపులో పనిచేస్తున్న యువతి బాత్రూంలో బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మేడికొండూరు సీఐ మధుసూదన్ రావు కథనం ప్రకారం సత్తెనపల్లి మండలం గర్నెపూడి గ్రామానికి చెందిన కాసిమాల మెర్సి (18) అనే యువతి తన కుటుంబంతో కలిసి పేరేచర్ల లక్ష్మీ నరసింహ కాలనీలో నివాసం ఉంటోంది. యువతి జంక్షన్లోని కిరాణా షాప్‌లో మూడు నెలలుగా పనిచేస్తోంది. బుధవారం మెర్సి బాత్రూం కని వెళ్లి బాత్రూం లోని పైపునకు తన చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కొద్దిసేపటి తర్వాత సహచర యువతి బాత్రూంకి వెళ్ళగా మెర్సి ఉరివేసుకొని కనిపించింది. షాపు యజమాని పోలీసులకు సమాచారం పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని యువతి బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కుమార్తె మృతి విషయం తెలుసుకొని అక్కడికి చేరుకున్న మృతురాలి తల్లిదండ్రులు యువతి పనిచేసే షాప్ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. తమ కుమార్తె మృతికి కారణాన్ని వెలికితీయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే పట్టాలపై ఇరువురి మృతి

పెదకాకాని, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రైల్వే పట్టాలపై గుర్తు తెలియని ఇరువురు దుర్మరణం చెందిన సంఘటన బుధవారం పెదకాకాని మండల పరిధిలోని నంబూరు రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. నంబూరు రైల్వే స్టేషన్ సమీపంలోని కల్వర్టు బిడ్జి వద్ద రైల్వే పట్టాలపై ఒక వృద్ధుడు, 45 సంవత్సరాల వయసు కలిగిన మరో వ్యక్తి రైలు కింద పడి మృతి చెందారు. మృతి చెందిన వృద్ధుడి చేతికి యూరినల్ బ్యాగు ఉంది. చేతి పైన పచ్చబొట్టుతో రాముడు, రాములు అని రాసి ఉంది. సమాచారం అందుకున్న ఆర్పీఎఫ్ సీఐ అంజిబాబు, ఎస్‌ఐలు శ్రీనివాసరెడ్డి, దీపికా సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాలను పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ఫ్యాక్టరీ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	130 , 139, 150
చికెన్ విత్ స్కిన్(కిలో)	248.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	258.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కే మయూర్ అశోక్

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు చెల్లించాలి

● కమిషనర్ కే మయూరి అశోక్

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన సర్వీస్ చార్జీల బకాయిలు చెల్లించాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో వివిధ కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల అధికారులతో సర్వీస్ చార్జీల వసూళ్లపై ప్రత్యేక సమావేశం అదనపు కమిషనర్ చల్లా ఓబులేసుతో కలిసి నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని సౌత్ సెంట్రల్ రైల్వే, పోస్టల్, సెంట్రల్ ఎక్సైజ్, ఇన్‌కంటాక్స్, మిలటరీ, నెహ్రూ యువకేంద్రం, స్పైసెస్ బోర్డ్, సీటీఆర్ఐ స్టేషన్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థలు 146 అసెస్‌మెంట్ల ద్వారా సుమారు రూ.37 కోట్లు సర్వీస్ చార్జీలు బకాయిలు ఉన్నాయని తెలిపారు. బకాయిల చెల్లింపుల సమన్వయం కోసం జీఎంసీ డిప్యూటీ కమిషనర్లు, రెవెన్యూ అధికారులను డిపార్టుమెంట్ల వారీగా కేటాయించాలని అదనపు కమిషనర్‌కు తెలిపారు. ఆయా సంస్థలకు ఇప్పటికే డిమాండ్ నోటీసులు ఇచ్చామని అన్నారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతి పొందిన ప్లాన్ మేరకే నిర్మాణాలు జరగాలి

నగరంలో జీఎంసీ నుంచి అనుమతి పొందిన ప్లాన్ మేరకే నిర్మాణాలు జరగాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. బుధవారం ఇన్నర్ రింగ్ రోడ్డు, అమరావతి రోడ్డు, ప్రశాంతినగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి, ఇన్నర్ రింగ్ రోడ్డులో ప్లాన్‌కి అనుగుణంగా భవనం నిర్మాణం లేకపోవడంపై సంబంధిత టీపీబీవో రామకృష్ణకి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. సీపీ రాంబాబు, డీసీపీ సూరజ్, ఏసీపీ రెహ్మాన్, ఇంజనీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వినియోగంలో లేని వస్తువులను తొలగించండి

అన్నక్యాంటీన్ల పరిసరాల్లో వినియోగంలో లేని వస్తువులను తొలగించి, శుభ్రత పాటించాలని కమిషనర్ ఆదేశించారు. బుధవారం ఐడీ హాస్పిటల్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని కమిషనర్ పరిశీలించి, ఆహారం తీసుకుంటున్నవారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలోని అన్న క్యాంటీన్లలో శుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.



మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన బిట్రగుంట మల్లిక

ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చి యార్డు కమిటీ వైస్ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీ మహిళానేత బిట్రగుంట మల్లిక ఈనెల 20న బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకావాలని జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర సినిమాటోగ్రఫి మంత్రి కందుల దుర్గేష్‌ను ఆమె ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం మంత్రిని మల్లిక మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కంకణాల శంకర్, గుగ్గిల సురేష్, అజయ్, త్రిపుర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి పండిత్ దీన్‌దీయాళ్ ఉపాధ్యాయ

● ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చిట్టచివర ఉన్న వ్యక్తికి కూడా స్వాతంత్ర్య ఫలాలు అందాలని నిరంతరం పరితపించిన మహోన్నత వ్యక్తి పండిత్ దీన్‌దీయాళ్ ఉపాధ్యాయ అని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కొనియాడారు. స్థానిక ఆర్ అగ్రహారం, చల మయ్య కళాశాల ప్రాంగణంలో బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన పండిత్ దీన్‌దీయాళ్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ స్పైసెస్ బోర్డ్ డైరెక్టర్ కేవీ సుబ్బారావు, సాధు రామకృష్ణ, మల్లాల లక్ష్మణ్, కుమార్‌గౌడ్, పాలపాటి రవి కుమార్, నేరెళ్ల మాధవరావు, దేసు సత్యనారాయణ, భజరంగ్ రామకృష్ణ మిర్చియార్డ్ డైరెక్టర్ శ్రావణకుమారి తదితరులు పాల్గొన్నారు.

చెస్, సైక్లింగ్‌లలో జిల్లా స్థాయి పోటీలు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు స్థానిక బీఆర్ స్టేడియంలో చెస్, సైక్లింగ్‌లలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్టు డీఎస్‌డీవో పి.అఫ్రోజ్‌ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో భాగంగా ఈనెల 17న అండర్-13, 15, 17, 19 బాల, బాలికల విభాగాల్లో చదరంగం పోటీలు, 24న జూనియర్, అండర్-18 విభా గాల్లో సైక్లింగ్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. విజేతలు తిరుపతి, విజయవాడలలో జరిగే చెస్, సైక్లింగ్ రాష్ట్ర స్థాయిలో పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల్గిన క్రీడాకారులు తమ ఆధార్ కార్డుతో 'స్పోర్ట్స్ ఏపీ. జీవోవీ.ఇన్' అనే వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వివరాలకు స్కేటింగ్‌కు సంబంధించి 9493447566, 6301177119 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించాలి

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఉపాధ్యాయులకు 2022 నుంచి పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఎన్‌టీఏ నాయకులు విజ్ఞప్తి చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషాను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పి.సాయి విశ్వనాథ్, రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ పి.లలితబాబు, రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కేవీ రాఘవులు, టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు టి.రవి, వెంకటేశ్వర్లు నాయక్, జలగం రామారావు, ఎస్‌వీఎన్‌ఆర్ మున్సిపల్ హైస్కూళ్ల హెచ్ ఎంలు వేణుగోపాల్, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల అమర గాయకుడని, ఆయన పాటలు అన్ని తరాలను అలరిస్తాయని జీజీహెచ్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ కొనియాడారు. ఘంటసాల 52వ వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక నాజ్ సెంటర్లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి కళాదర్బార్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో బిజినేపల్లి మోహనరావు, జమ దగ్ని, అబ్దుల్ ఖాదర్, బాబురావు, హనుమాన్ సింగ్, సత్తార్, వీరశంకర్‌రెడ్డి, వేణుభాను, సుభాని, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

అంబటి ఇంటిపై దాడి అమానుషం : పెద్దిరెడ్డి

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎంతో సౌమ్యుడని, ఆయన ఇంటిపై దాడి చేయటం అమానుషమని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గుంటూరులోని నివాసంలో మాజీ మంత్రి అంబటి కుటుంబ సభ్యులను బుధవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, విశ్రాంత జడ్జి జడ శ్రావణ్‌కుమార్‌లు పరామర్శించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నేతలే లక్ష్యంగా దాడులకు తెగబడటం దుర్మార్గమన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, బీసీ నేత, మాజీ మంత్రి జోగి రమేష్ ఇళ్ళపై దాడులు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబటి కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందన్నారు.

ఎన్టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

● స్టాల్స్‌లో తినుబండారాలపై ఎమ్మార్పీ తనిఖీలు
● తాగునీరు, పారిశుధ్యంపై ప్రయాణికుల నుంచి ఆరా
● కనీస సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశాలు



స్టాల్స్‌లో ధరలను పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎన్‌టీఆర్ ఆర్టీసీ బస్టాండ్‌లో కలె క్టర్ ఏ తమీమ్ అన్సారియా బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్రభుత్వం చేపడుతు న్న ఐవీఆర్ఎస్ ద్వారా నిర్వహిస్తున్న పబ్లిక్ పాజిటివ్ పర్‌సెప్షన్ ప్రజల సంతృప్తి స్థాయి లో ఆశాజనకంగా లేకపోవటంపై ఆమె తాజాగా తనిఖీలు చేపట్టారు. బస్టాండ్‌లో కలెక్టర్ నేరుగా ప్లాట్‌ఫామ్‌లపై కలియ తిరిగారు. బస్టాండ్ ఆవరణను, పారిశుధ్యాన్ని పరిశీలించా రు. అలానే మరుగుదొడ్లు, తాగునీటి ప్రదేశాలు పరిశీలించి మరింత శుభ్రత పాటించాలని సూచించారు. తాగునీటి ప్రాంతాలు, మరుగుదొడ్ల ప్రదేశాలను నిత్యం అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. మరో వైపు బస్టాండ్‌లోని స్టాల్స్‌లో కూల్ డ్రింక్స్, వాటర్ బాటిల్స్‌తో పాటు తినుబండారాలను తనిఖీ చేసిన కలెక్టర్ ఎమ్మార్పీ, అమ్మకాలు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సౌకర్యాలపై ప్రయాణికుల నుంచి ఆరా

బస్టాండ్‌లో సౌకర్యాలపై పలువురు ప్రయాణికుల నుంచి కలెక్టర్ అన్సారియా ఆరా తీశారు. సౌకర్యాలు ఎలా ఉన్నాయంటూ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ పర్యటనలో డీపీటీవో సామ్రాజ్యం, బస్టాండ్ ఏటీఎం సాంబశివ పలువురు నాయకులున్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలి : కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర - 2047లో భాగంగా సుస్థిర అభి వృద్ధి లక్ష్యాలను సాధించుటకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్(కేపీఐ)లపై వివిధ శాఖల అధికా రులకు బుధవారం కలెక్టరేట్‌లో శిక్షణ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ-వ్యవస్థ సేవా బట్వాడాను మెరుగుపరచడానికి, జవాబుదారితనాన్ని నిర్ధారించడానికి, ఆర్థిక వృద్ధిని పెంచడానికి, నెలవారీ, త్రైమాసిక, వార్షిక సమీ క్షలకు కీలకంగా మారిందన్నారు. ఆర్థిక, సామాజిక కొలమానాలు, లాజిస్టిక్స్, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, మానిటరింగ్ మెకానిజం అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. జిల్లా, నియోజకవర్గం, గ్రామ-స్థాయి యాక్షన్ ప్లాన్ యూనిట్లను ఏర్పాటు చేశారని, వాటి ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ, శిక్షణ సమన్వయ అధికారులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల హర్షణీయం

● నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు రూ.1200 కోట్లు విడుదల చేయడంపై నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం హర్షం వ్యక్తం చేశారు. పాతగుంటూరులోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో బుధవారం జరిగిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. యువగళంలో ఇచ్చిన ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు విద్యారంగ పటిష్ఠతకు నారా లోకేశ్ కృషి చేస్తున్నారని అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు కందుకూరి వెంకట్ మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యారంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఈ సమావేశంలో నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వడ్రాణం హరిబాబునాయుడు హర్షం

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1200 కోట్లు విడుదల చేయటంపై విద్యార్థుల తల్లిదండ్రుల తరుపున విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు డీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయటంపై విద్యార్థుల భవిష్యత్తుకు గొప్ప ఊరటనిస్తుందన్నారు. ప్రభుత్వం నిర్ణయంతో ఎంతో మంది పేద విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎంతో ఉపశమనం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు కట్టుబడి పనిచేస్తున్న మంత్రి లోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక బ్రాడీపేట, గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కేంద్ర బడ్జెట్ - విశ్లేష ణ అంశంపై సెమినార్ జరిగింది. సెమినార్‌కు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీ చట్టాన్ని పట్టించుకోలేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధుల కేటాయింపులు అత్యంత స్వల్పమని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని బడ్జెట్లో నిర్లక్ష్యం చేశారని అన్నారు. ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ సౌత్ సెంట్రల్ జోన్ కార్యదర్శి జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ కోట్లాది మంది రైతుల సంక్షేమాన్ని, కార్మికుల శ్రేయస్సును బడ్జెట్‌లో విస్మరించారన్నారు. ఈ సమావేశంలో మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కుమార్, అవధానుల హరి, ఎన్.భావన్నారాయణ, వీవీకే సురేష్, బి.లక్ష్మణ రావు, డి.వాసు, శ్రీనివాస్, శేఖరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కాసుల



దాసరి శ్రీనివాస్ నుంచి నియామకపత్రాన్ని అందుకుంటున్న కాసుల కృష్ణంరాజు

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా కాసుల కృష్ణంరాజు నియమితులయ్యారు. విజయవాడ, సీతానగరం కార్యాలయంలో బుధవారం ట్రస్ట్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ దాసరి శ్రీనివాస్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. దాసరి శ్రీనివాస్ మాట్లాడుతూ దేవాలయాల పరిరక్షణకు కృష్ణంరాజు అనేక సేవలు అందించారని గుర్తు చేసుకున్నారు. కాసుల కృష్ణంరాజు మాట్లాడుతూ కీలక బాధ్యతలు అప్పగించిన ట్రస్ట్ వారికి, దాసరి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. దేవాలయాల పరిరక్షణ, కళా బృందాల వైభవానికి కృషి చేస్తానని చెప్పారు.

సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి : వెలుగూరి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి అన్నారు. స్థానిక శ్యామలా నగర్‌లోని సహకార కార్యాలయం ఎదుట ఉద్యోగులు చేపట్టిన నిరసనలు బుధవారం నాటికి 12వ రోజుకు చేరుకున్నాయి. ఆయన మాట్లాడుతూ గురువారం తలపెట్టిన కార్యాలయాల ముట్టడికి మద్దతు ఇస్తున్నట్టు చెప్పారు. ఈ నిరసనల్లో మొవ్వా వెంకటేశ్వరరావు, రవికుమార్, రామానాయుడు, గోవర్ధన్‌రెడ్డి, శ్రీధరర రెడ్డి, రమణమూర్తి, శ్రీనివాసులరెడ్డి, సురేష్‌రెడ్డి, సుబ్బారావు పాల్గొన్నారు.

రాజధాని రహదారులపై ప్రభుత్వం దృష్టి సారించాలి : ముప్పాళ్ల

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజధాని రహదారుల పై ప్రభుత్వం దృష్టి సారించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. గుంటూరు, కొత్తపేట సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఆర్డీఏ ఇతర శాఖల సమన్వయంతో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల రద్దు, ఇతర డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గురువారం తలపెట్టిన సమ్మెలో కార్మిక, ప్రజాసంఘాల పాల్గొనాలన్నారు.

ఎలక్ట్రిక్ బస్సుల కోసం గ్యారేజ్ కేటాయింపు విరమించుకోవాలి

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ పేరుతో ప్రైవేటు వారికి గుంటూరు-2 డిపో గ్యారేజ్‌ను కేటాయింపు ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ నన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి నేషనల్ మజ్దూర్ యూనిటి అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఎన్‌టీఆర్ బస్టాండ్‌కు బుధవారం వచ్చిన చైర్మన్ సురేష్‌రెడ్డికి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కెఎల్ రావు, డిపో కార్యదర్శి వి అమర్‌నాథ్‌లు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎలక్ట్రిక్ బస్సులు ప్రైవేటు యాజమాన్యం వారు నిర్వహిస్తుండటంతో గుంటూరు-2 డిపో గ్యారేజ్ కాకుండా, పెదకాకాని జాతీయ రహదారి పక్కనే ఉన్న నాలుగున్నర ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. అంతేగాక గుంటూరులో పాత ఆర్ఎమ్ కార్యాలయం స్థలం కూడా ఖాళీగానే ఉందని అది కూడా కేటాయించవచ్చని కోరారు. అసోసియేషన్ నాయకులు ఎస్‌డీ షెరీఫ్, నాగేశ్వరరావు తదితరులున్నారు.



అసెంబ్లీ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీతో కలసి పర్యవేక్షిస్తున్న ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత

● బందోబస్తు ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన ఐజీ, ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌లతో కలిసి ఎస్పీ వకుల్ జిందాల్ క్షేత్ర స్థాయిలో పర్యటించి సమీక్షించారు. బందోబస్తుకు నియమించిన పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఐజీ, ఎస్పీలు ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మీడి యా ప్రతినిధులు, సందర్శకులు ప్రవేశించే గేట్లు 1, 2, 3, 4లను పరిశీలించి, సంబంధిత అనుమతులు కలిగిన వారిని ఆయా గేట్ల ద్వారా మాత్రమే అనుమతించాలని, అందరితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, అదనపు ఎస్పీ హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, ఇతర అధికారులు పాల్గొన్నారు..

మహాశివరాత్రికి శివాలయాల వద్ద ....

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రముఖ శివాలయాలు, శైవక్షేత్రాలు, తిరునాళ్లు, రథోత్సవాలు నిర్వ హించే ప్రాంతాలు, పుష్కర ఘాట్లు, నదీ తీర ప్రాంతాల వద్ద పటిష్ఠమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక, వాహనాల పార్కింగ్‌కు సమర్థవంతమైన ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ తెలిపారు. పండుగ రోజున ఆయా ఆలయాలు, పండుగ ప్రదేశాల్లో పెదకాకాని శివాల యం, వడ్లమూడి బాల కోటేశ్వర స్వామి (క్వారీ) తిరునాళ్లలో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు.


కారులో మర్చిపోయిన నగదు అందజేత

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కారులో మర్చిపోయిన రూ.2 లక్షల నగదు అంధ ఉపాధ్యాయునికి కొత్తపేట పోలీసులు అందించారు. పల్నాడు జిల్లా, కారంపూడి మండలం, పేట సన్నిగండ్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడైన పోట్ల లక్ష్మీనారాయణ ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నారు. ఈనెల 10న తన తండ్రికి వైద్య చికిత్స నిమిత్తం నరసరావుపేట నుంచి గుంటూరుకు కారులో వచ్చారు. సాయంత్రం సుమారు 4 గంటలకు గుంటూరు వారి తోట 7వ లైన్ వద్ద కారు దిగి ఆసుపత్రిలోకి వెళ్లారు. ఈ సందర్భంగా తనతో తీసుకొచ్చిన రూ.2 లక్షల నగదు సంచిని కారులోనే మర్చిపోయారు. దీంతో కొత్తపేట పోలీసులను ఆశ్రయించారు. కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి ఆదేశాల మేరకు క్రైమ్ కానిస్టేబుళ్లు జానీబాషా, డేగల కోటేశ్వరరావు, చుట్ల శ్రీనివాసరావు ఘటనాస్థల పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను నిశితంగా పరిశీలించి బాధితుడు దిగిన సమయాన్ని ఆధారంగా తీసుకుని వాహనాన్ని గుర్తించారు. డ్రైవర్‌ను సంప్రదించి రూ.2 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి ఆదేశాల మేరకు ఎస్సై హనుమంతురావు చేతుల మీదుగా నగదును బాధిత ఉపాధ్యాయునికి అందజేశారు. సకాలంలో స్పందించి నగదును వెతికి అందించిన కొత్తపేట పోలీసులకు ఉపాధ్యాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లాడ్జిలో వ్యభిచారానికి పాల్పడుతున్న 17 మంది అరెస్టు

అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బ్రాడీపేట, 2/10వ లైనులో గల చెరుకూరి రెసిడెన్సిలో వ్యభిచారానికి పాల్పడుతున్న 17 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసారు. టాస్క్‌ఫోర్స్ సీఐకి వచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, అరండల్‌పేట ఎస్ఐ నరసింహారావు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది కలిసి లాడ్జి పై దాడి చేసారు. మొత్తం 17 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 17 సెల్‌ఫోన్లు సీజ్ చేసారు.

లాలాపేటలో ప్రింటర్స్ నిర్వాహకుడు అదృశ్యం



కె.శ్రీనివాసరావు

లాలాపేటలో నేషనల్ హాఫ్‌సెట్ ప్రింటర్స్ నిర్వహిస్తున్న కొసరాజు శ్రీనివాసరావు(50) బుధవారం ఇంట్లో లెటర్ రాసి ఎవరికి చెప్పకుండా అదృశమయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు నేపథ్యంలో అదృశ్యమైనట్లు భావిస్తున్నారు. భార్య నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు లాలాపేట పోలీసులకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

జిల్లాలో రబీ సీజన్‌కు సరిపడా యూరియా నిల్వలు

● జిల్లా వ్యవసాయ అధికారి ముళ్లపూడి పద్మావతి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ 2025-26 సీజన్‌కు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి ముళ్లపూడి పద్మావతి తెలిపారు. జిల్లాలోని అన్ని పంటలకు గాను మొత్తం 55,840 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని గుర్తించి, పంపిణీ ప్రణాళికను రాష్ట్ర వ్యవసాయ సంచాలకులకు పంపినట్లు చెప్పారు. అక్టోబరు 2025 నుంచి ఫిబ్రవరి 2026 వరకు జిల్లాకు 51,014 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా రైతులకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అదనంగా ఈ ఫిబ్రవరి నెలాఖరుకు మరో 3,905 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నదని చెప్పారు. రాబోయే 21 రోజులకి 8,513 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, ప్రస్తుతం 7,398 మెట్రిక్ టన్నుల యూరియా కోఆప రేటివ్ సొసైటీలు, ఆర్ఎస్ గోడాముల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



హజ్ యాత్రికుల వ్యాక్సినేషన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

హజ్ యాత్రికులకు అన్ని సదుపాయాలు కల్పిస్తున్నాం

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, మెడికల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తోందని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. హజ్ యాత్రికుల కోసం బుధవారం గుంటూరు జీజీహెచ్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నసీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వ ర్యంలో కూటమి అధికారంలోకి వచ్చాక హజ్ యాత్రికులకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వ్యాక్సినేషన్ ద్వారా యాత్రికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరిపై అల్లా కృప ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్ర మంలో హజ్ కమిటీ చైర్మన్ హసన్ బాషా, సభ్యులు జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వీ రమణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఏ శ్రావణ్‌బాబు వ్యాక్సినేషన్ కార్యక్రమం పర్యవేక్షించారు. బుధవారం 145 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ చేసినట్లు డాక్టర్ శ్రావణ్‌బాబు తెలిపారు. గురు వారం కూడా యాత్రికుల కోసం వైద్యశిబిరం కొనసాగుతుందని ఆయన ప్రకటించారు.

రంజాన్ ప్రార్థనలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస ప్రార్థనలకు జీఎంసీ నుంచి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర నగర పాలక సంస్థ అధికారులను ఆదేశించారు. బుధవారం మేయర్ ఛాంబర్‌లో ఈనెల 19 నుంచి ప్రారంభం కానున్న రంజాన్ ఉపవాస ప్రార్థనల్లో ముస్లింలకు ఇబ్బందులు లేకుండా చేపట్టాల్సిన చర్యలపై జీఎంసీ అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని మసీదుల వద్ద ప్రత్యేకంగా పారిశుధ్య పనులు, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాట్లను త్వరగా చేపట్టాలన్నారు. మసీదుల వద్ద రంజాన్ మాసం ముగింపు వరకు విద్యుత్ అంతరాయం రాకుండా, తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. హలీం సెంటర్ల వద్ద కూడా పారిశుధ్యాన్ని పర్యవేక్షించాలని, రంజాన్ నెలను కూటమి ప్రభుత్వం, ప్రత్యేకించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారన్నారు.

సైబర్ సెక్యూరిటీపై ప్రజల్లో చైతన్యం రావాలి

● ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



మాట్లాడుతున్న మన్నవ మోహనకృష్ణ

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటీ, సైబర్ మోసాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ వెల్లడించారు. బుధవారం చౌడవరంలోని ఆర్వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో వాట్సాప్ గవర్నెన్స్, సైబర్ సెక్యూరిటీపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ గవ ర్నెన్స్ 'మన మిత్ర' అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిర గాల్సిన అవసరం లేకుండా, టెక్నాలజీతో పాలనను నేరుగా మీ మొబైల్‌కు చేర్చారని వెల్లడించారు. ప్రజలు తమ మొబైల్‌లో 95523 00009 నంబర్ సేవ్ చేసుకుని, వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపాలి. వెంటనే వచ్చే రిప్లైలో తమకు నచ్చిన భాషను ఎంచుకోవడం ద్వారా కేవలం నిమిషాల వ్యవధిలోనే 900 పైగా ప్రభుత్వ సేవలను పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్స్ ఎన్వీ శ్రీని వాస్ రావు, కొమ్మినేని రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీతారామయ్య హైస్కూల్లో విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం

గుంటూరు (కార్పొరేషన్), ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు బుధవారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రసంగాలు, వినోదాత్మక అంశాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల పాలకవర్గ గౌరవాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ పాఠశాల పరంపరలను, విలువలను భవిష్యత్తులోనూ నిలబెట్టాలని సూచించారు. పాఠశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వర ప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ దోసకాయల దుర్గాశ్యామ్, సీని యర్ కోఆర్డినేటర్ ఘట్టమనేని రాధామాధవి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అన్నా నందకిశోర్ తదితరులు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. సీఎంఏ ఫైనల్‌లో తమ విద్యార్థి ఎస్ శివారెడ్డి 800 మార్కులు గాను 537 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా సీఎంఏ ఇంటర్‌లో ఎస్ కిషోర్ 800 మార్కులు గాను 506 మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను సంస్థ చైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మీ తదితరులు అభినందించారు.

బాల్యవివాహాలను అరికట్టాలి

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలు ఒక్కటి కూడా జరగకుండా ప్రజలు సహకరించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలపై నిర్వహి స్తున్న బాల్య వివాహ్ విముక్త భారత్ 100 రోజుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా బుధవారం ఎన్‌టీఆర్ బస్టాండ్, గుంటూరు రైల్వే స్టేషన్లలో వీధి నాటకం ద్వారా అవగా హన కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా పథక సంచాలకురాలు పీపీజీ ప్రసూన, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ విజయ్‌కుమార్, మిషన్ సమన్వయకర్త శ్రీవాణి పాల్గొన్నారు.

మార్చి ఒకటిన ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం ఎన్నికలు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీ ఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలను మార్చి ఒకటో తేదీన నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధి కారి సీహెచ్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణకు నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్‌కు ఎన్నికల అధికారిగా మేయర్ కోవెల మూడి రవీంద్ర బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు ఈ నెల 12న అరు లైన ఓటర్ల జాబితాని స్టేడియంలో ఏర్పాటు చేస్తామని, 13న ఎలక్షన్ నోటిఫి కేషన్ జారీ చేస్తామని శ్రీనివాస్ తెలిపారు.

ఏపీలో సబ్ కా సాత్- సబ్ కా వికాస్ పాలన

● లోక్‌సభలో జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ విజన్, చంద్రబాబు, పవన్ సమర్థవంతమైన పాలనలో సబ్ కా సాత్- సబ్ కా వికాస్ అనేది నినాదంగా మిగిలిపోకుండా ఏపీలో నిజం అవుతోందని జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ బుధవారం లోక్‌సభలో పేర్కొన్నారు. యూరోపియన్ యూనియన్, కేంద్రప్రభుత్వం మధ్య ఇటీవల జరిగిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం వల్ల కాకినాడ వంటి ప్రాంతాల్లోని ఆక్వాకల్చర్, మత్స్య పరిశ్రమకు గొప్ప అవకాశాలు లభిస్తాయని, తద్వారా మత్స్యకారుల ఆదాయం పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్ 2026-27పై జరిగిన చర్చపై ఎంపీ తంగెళ్ల మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నాయకత్వంలో కాకినాడ గేట్‌వే పోర్ట్ పనులు 30శాతం పూర్తయ్యాయని, 2026 డిసెంబర్ నాటికి ఇది అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు కేంద్రం మరింత మద్దతు ఇవ్వాలని కోరారు. పవన్‌కల్యాణ్ పర్యవేక్షణలో ఏపీలో 3,200 కిలోమీటర్ల రహదారులు, 77 వంతెనల పనులు వేగంగా జరుగుతున్నాయని, పీఎంజీఎస్‌వై కింద ఏపీకి మరిన్ని నిధులు కేటాయించాలని విన్నవించారు.

శావల్యాపురం-బాపట్ల రైలుమార్గంపై విముఖత

● నరసరావుపేట ఎంపీ ప్రశ్నకు రైల్వే మంత్రి స్పందన

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): శావల్యాపురం-బాపట్ల మధ్యన నూతన రైలు మార్గం నిర్మాణానికి రైల్వేశాఖ పరోక్షంగా విముఖతను కనబరిచింది. ఈ రెండు స్టేషన్లు ఇప్పటికే ఉన్న రైల్వే నెట్‌వర్క్‌తో గుంటూరు, తెనాలి మీదగా కనెక్ట్ అయి ఉన్నాయని స్పష్టం చేసింది. గుంటూరు-విజయవాడ డబుల్ లేన్ సెక్షన్‌లో రద్దీ నియంత్రణ, ఈ ప్రాంతంలో కనెక్టివిటీని పెంచేందుకు అనేక ఇతర ప్రాజెక్టులు మంజూరు చేసి నిర్మిస్తున్నామని తెలిపింది. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు సమాధానంగా రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందించారు. దీంతో ఇప్పట్లో శావల్యాపురం-బాపట్ల వయా చిలకలూరిపేట, పర్చూరు రైలుమార్గం సర్వే కూడా చేపట్టే అవకాశాలు లేవని రైల్వేవర్గాలు అభిప్రాయం వ్యక్తం చేస్తోన్నాయి. గుంటూరు-విజయవాడ డబుల్ లేన్‌లో రద్దీ నియంత్రణకు చేపట్టిన ప్రాజెక్టుల జాబితాని రైల్వే మంత్రి విడుదల చేశారు.

మెప్మాలో రుణాలు మేసిన ఉద్యోగులపై వేటు

● రుణాల పంపిణీలో భారీ స్కాం

● నరసరావుపేట మునిసిపాలిటీ పరిధిలో రూ.కోట్లలో మోసం



నరసరావుపేట మునిసిపాలిటీలోని మెప్మా కార్యాలయం

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మెప్మాలో పెద్ద ఎత్తున జరిగిన రుణాల కుంభకోణంపై ఎట్టకేలకు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చర్యలు తీసుకుంది. మొత్తం ఎనిమిది మంది సీవోలు, సీఎంఎంలను సస్పెండ్ చేస్తూ పీడీ మురళీ బుధవారం ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. కలెక్టర్ కృతికా శుక్లా దృష్టి సారించడంతో మెప్మా అవినీతి గుట్టురట్టయింది. నరసరావుపేటలో బోగస్ గ్రూపులు, సభ్యులను సృష్టించి పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నారు. ఇందుకు కొందరు బ్యాంకు అధికారులు కూడా సహకరించినట్టు విచారణలో వెలుగుచూసిందంటున్నారు. నరసరావుపేట, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, గురజాల మునిసిపాలిటీల పరిధిలో మెప్మాలో రుణాల మెక్కేశారు. నరసరావుపేటలో ఇరువురు సీవోలు దీపా, ప్రణతిలను సస్పెండ్ చేస్తూ పీడీ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిసింది. మిగతా పట్టణాల్లో కూడా ఆరుగురు సీవోలు, సీఎంఎంలను సస్పెండ్ చేసినట్టు సమాచారం. కాగా సదరు ఉద్యోగులపై కేసులు నమోదు చేయనున్నారు. వీరి ఆస్తులను కూడా జప్తు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. కొట్టేసిన సొమ్మును తిరిగి రికవరీ చేయనున్నారు. మెప్మా స్కాంను కలెక్టర్‌ల సదస్సులో కృతికా శుక్లా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే. సీఎం కూడా మెప్మా స్కాంపై కఠిన చర్యలకు ఆదేశించారు. ఒకే సారి ఎనిమిది మంది ఉద్యోగులపై వేటు పడటంతో జిల్లాలోని మెప్మా విభాగంలో కలకలం రేపింది.

ముందు చూపేది..?

● కోటప్పకొండలో తరిగిపోతున్న ప్రభల ఏర్పాటు స్థలం

● పొలాల్లో వెలుస్తున్న రియల్ వెంచర్‌లు

● ప్రభల కోసం ప్రత్యేక స్థలం కేటాయించాలని కోరుతున్న నిర్వాహకులు



కోటప్పకొండలో భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేందుకు చదును చేసిన పొలం.. పక్కనే రియల్ వెంచర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

కోటప్పకొండ తిరునాళ్లపై ముందుచూపు కొరవడింది. తిరునాళ్లలో ప్రముఖం భారీ విద్యుత్ ప్రభలే. ఈ ప్రాంత సంస్కృతి సంప్రదాయాలకు నెలవుగా ప్రభల ఏర్పాటు జరగుతోంది. శతాబ్దాలుగా కోటయ్య తిరునాళ్లకు పెద్ద ఎత్తున ప్రభలు వస్తున్నాయి. తిరునాళ్లలో ప్రభలు ఏర్పాటుకు భవిష్యత్తులో స్థల సమస్య పొంచి ఉంది. కొండలో నరసరావుపేట, చిలకలూరిపేట రహదారి మధ్య ఉన్న స్థలంలో ప్రభలు ఏర్పాటు చేస్తారు. గతంలో ఇక్కడ అన్ని పొలాలే ఉన్నాయి. కొంత కాలంగా కొండలో రియల్ వ్యాపారం ఊపందుకుంది. దీంతో రియల్ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. అయితే ప్రైవేట్ వ్యక్తులు వారి పొలాలను రియల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో ప్లాట్లు వేసి స్థిరాస్తి వ్యాపారులు విక్రయిస్తున్నారు. రియల్ వెంచర్‌లకు అడ్డుగా ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారు. దీంతో ప్రభల ఏర్పాటులో నిర్వాహకులు ఇబ్బందులు ఎద్కుర్కొంటున్నారు.



గతేడాది తిరునాళ్లలో కొలువుదీరిన భారీ విద్యుత్ ప్రభలు

● రూ.లక్షలు వెచ్చించి ప్రభల తరలింపు

రూ.లక్షలు వెచ్చించి ఎంతో శ్రమతో ప్రభలను కొండకు తరలిస్తారు. తిరునాళ్లకు అవసరమైన స్థల కేటాయింపుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి. కనీసం 10 ఎకరాల స్థలాన్ని ప్రభల కోసం కేటాయించాల్సి ఉంది. ఈ దిశగా అధికార యంత్రాంగం స్పందించాలి. ఇటీవల తిరునాళ్ల ఏర్పాట్లపై జరిగిన సమీక్షలో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రభల స్థలం అంశంపై చర్చించారు. కోటప్పకొండ తిరునాళ్ల అంటేనే ప్రభల పండుగని తిరునాళ్లలో ప్రభలే ప్రత్యేక ఆకర్షణని, రియల్ వెంచర్ లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పుల్లారావు కోరారు. ఇప్పటికైనా తిరునాళ్ల ప్రభల కోసం స్థలం కేటాయింపునకు అవసరమైతే భూసేకరణ చేయాలని ప్రభల నిర్వాహకులు కోరుతున్నారు.

అమరావతి బౌద్ధ శిల్పకళ సంతృప్తినిచ్చింది

● జర్మనీ కౌన్సిల్ జనరల్ మిచెల్ హాస్పర్



పురావస్తు ప్రదర్శనశాలలో బుద్ధుని విగ్రహం వద్ద మిచేల్ హాస్పర్

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బౌద్ధ చారిత్రక ప్రాధాన్యాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన అమరావతి శిల్పకళను చూడటం తనకెంతో సంతృప్తిని కలిగించిందని జర్మనీ కౌన్సిల్ జనరల్ మిచెల్ హాస్పర్ పేర్కొన్నారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని కలిసేందుకు రాష్ట్రానికి వచ్చిన ఆయన అమరావతిలో పర్యటించారు. ముందుగా కేంద్రపురావస్తు ప్రదర్శనశాలలోని మహాచైత్యం శిల్పాలను తిలకించారు. శిల్పాల చారిత్రక ప్రాధాన్యాన్ని గైడ్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం మహాచైత్యం సందర్శించారు. అక్కడ నుంచి ధ్యానబుద్ధ ప్రాజెక్టు సందర్శించగా ధ్యానబుద్ధ రూపశిల్పి, టూరిజం శాఖ డైరక్టర్ ఆర్.మల్లికార్జునరావు, టూరిజంశాఖ అధికారులు స్వాగతం పలికి ప్రాజెక్టు నిర్మాణ విశేషాలు, బుద్ధుని జాతక కథల శిల్పాలను గురించి వివరించారు. రాష్ట్రంలో బౌద్ధ కేంద్రాల గురించి మిచెల్ హాస్పర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక పూటలో తాను గీసిన మిచెల్ హాస్పర్ చిత్రపటాన్ని మల్లికార్జునరావు బహూకరించారు. అనంతరం మిచెల్ హాస్పర్ అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. మిచెల్ హాస్పర్ వెంట ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి, టూరిజం ఆర్డీ ప్రసన్నలక్ష్మి, జిల్లా అధికారి నాయుడమ్మ, అమరావతి మేనేజరు మణికుమార్, పురావస్తు సంగ్రాలయ అధికారులు సూర్యప్రకాష్, నాగేంద్ర, నరేశ్, తహసీల్దార్ దానియేలు, సీఐ అచ్చియ్య తదితరులు పాల్గొన్నారు.



బౌద్ధ శిల్పాన్ని తన సెల్‌తో పోటో తీస్తున్న మిచేల్ హాస్పర్

డాక్టర్ మేరీ గ్లోరీకి 'పూజ్యనీయులు' గౌరవం

● గుంటూరులో ఘనంగా ఉత్సవం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గుంటూరులో 36 ఏళ్లపాటు వైద్య సేవలందించి వేలాది మందికి ప్రాణాధారంగా నిలిచిన దివంగత డాక్టర్ మేరీ గ్లోరీకి రోమన్ క్యాథలిక్ శ్రీసభ అత్యున్నత గౌరవాలలో ఒకటైన రెండో దశ 'పూజ్యనీయులు' బిరుదును ప్రకటించింది. 2025 నవంబర్ 21న పోప్ లియో 14 ఈ గౌరవాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా గుంటూరులోని సెయింట్ జోసెఫ్స్ పాఠశాల ఆవరణలో జేఎంజే సభ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ఉత్సవం నిర్వహించారు. ఆస్ట్రేలియా నుంచి కుటుంబసభ్యులు, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ మేత్రాసన బిషపులు, జేఎంజే సుపీరియర్ జనరల్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. డాక్టర్ మేరీ గ్లోరీ 1920లో గుంటూరుకు చేరి వైద్య సేవలతో పాటు మిషనరీ సేవలను అంకిత భావంతో అందించారు. 2013లో 'దైవ సేవకురాలు'గా గుర్తింపు పొందిన ఆమె, తాజా గౌరవంతో సెయింట్ హోదాకు మరింత చేరువైనట్లు క్యాథలిక్ వర్గాలు పేర్కొన్నాయి. కార్యక్రమంలో విశాఖపట్నం ఆర్చ్ బిషప్ ఉడుమల బాల, గుంటూరు బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య, విజయవాడ బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, గుంటూరు విశ్రాంత బిషప్ గాలి బాలి, జేఎంజే సభ సుపీరియర్ జనరల్ రెవరెండ్ మేరి కారికా కున్నెల్, క్యాథలిక్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ ఫాదర్ డాక్టర్ మాథ్యూ అబ్రహం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మేరీ గ్లోరీ జీవితం, సేవా స్ఫూర్తిని ప్రతిబింబించే నృత్య, డాక్యుమెంటరీ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



డాక్టర్ మేరీ గ్లోరీ(ఫైల్)



ఘనంగా జరిగిన ఉత్సవంలో పాల్గొన్న బిషప్‌లు

విరామంతో ఒత్తిడి దూరం

● సీబీఎస్ఈ విధానంలో ఇంటర్ పరీక్షలు

● గతంలో 12 రోజుల్లో పరీక్షలు పూర్తి..

● నూతన విధానంలో 23 రోజులు నిర్వహణ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పరీక్షల కోసం అహర్నిశలు శ్రమించినా పరీక్ష రోజు ఒత్తిడికి గురవ్వకుండా ఉండటం సవాలే. ఇంత వరకు ఇంటర్ విద్యార్థులు రోజు విడిచి రోజు, 10వ తరగతి విద్యార్థులు వరుసగా పరీక్షలు రాయాల్సి వస్తోంది. దీంతో తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యేవారు. దీనిని గుర్తించిన విద్యాశాఖ ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు వీలుగా పరీక్షల మధ్య విరామాన్ని తీసుకొచ్చింది. ఈ ఏడాది నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో సీబీఎస్ఈ విధానంలో పరీక్షలు జరగనున్నాయి. జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రస్తుతం ఇంటర్ ప్రథమ ఏడాది పరీక్షలు జరగనున్నాయి. గతంలో వరుసగా పరీక్షలు జరిగి 12 రోజుల్లో పూర్తయ్యేవి. తాజాగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 23 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. అంతేగాక ఒక రోజు ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇంతక ముందు గణితం కొంత మంది, చరిత్ర, వృక్ష శాస్త్రం తదితర పరీక్షలన్నీ ఒకే రోజు జరిగేవి. దీని వల్ల గందరగోళ పరిస్థితులు తలెత్తేవి. ఇక నుంచి ఒక్కో సబ్జక్టుకు ఒక్కో రోజు కేటాయించారు. పరీక్షా కేంద్రాల్లో గతంలో మాదిరిగానే సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది.

● పల్నాడు జిల్లాలో మొత్తం 49 పరీక్షా కేంద్రాలు

పల్నాడు జిల్లాలో మొత్తం 49 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. అన్ని కేంద్రాలకు 814 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. పల్నాడులో ఇంటర్ ప్రథమ సంవత్సరం 16,594 మంది, ద్వితీయ సంవత్సరం 15,628 మంది, ఒకేషనల్ ప్రథమ సంవత్సరం 1,146 మంది, ద్వితీయ సంవత్సరం 1,008 మంది మొత్తం 34,376 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసే వీలుంది. పరీక్ష పరీక్షకు వీరామం ఉండటంతో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. విరామ సమయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. విద్యార్థులకు తమ ప్రాంతాలకు దగ్గరలో ఉన్న పరీక్షా కేంద్రాలను కేటాయించాం. ప్రాక్టికల్ పరీక్షలను ఇప్పటికే పూర్తి చేశాం.

- నీలావతి, పల్నాడు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

లాటరీ టికెట్ల విక్రయం కేసులో నేడు కోర్టుకు అంబటి

● సీఐను బెదిరించిన కేసులో బెయిల్

● అంబటి విడుదలపై చివరి వరకు తీవ్ర ఉత్కంఠ

గుంటూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు బెయిల్‌పై విడుదల విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ఆయన రిమాండ్‌లో ఉన్న కేసులో బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే అదే సమయంలో మరో కోర్టులో సత్తెనపల్లి టౌన్ పోలీసులు పీటీ వారెంట్ జారీ చేయడంతో ఈనెల 22లోగా అంబటిని కోర్టులో హాజరు పరచాలని కోర్టు ఆదేశించింది. దీంతో పోలీసులు గురువారం కోర్టులో హాజరపరిచేందుకు హటాహుటిన రాజమండ్రి బయలుదేరి వెళ్లారు. అయితే ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న కేసులో అంబటికి బెయిల్ రావడంతో ఆయనను జైలు నుంచి విడిపించేందుకు ఆయన తరుపు న్యాయవాదులు కూడా రాజమండ్రికి పరుగెత్తారు. కాగా, అంబటికి బెయిల్ మంజూరైందని ఆయన తరఫున న్యాయవాదులు రాజమండ్రి సెంట్రల్ జైలుకు సమాచారం పంపారు. అదే సమయంలో అంబటికి కోర్టు పీటీ వారెంట్ జారీ చేసిన నేపథ్యంలో ఆయనను విడుదల చేయవద్దంటూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రాజమండ్రి సెంట్రల్ జైలు అధికారులకు పోలీసులు పంపారు. ఈ నేపథ్యంలో రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బుధవారం అంబటి విడుదలకు బ్రేక్ పడింది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023లో సంక్రాంతి సంబరాల పేరుతో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఉన్న అంబటి రాంబాబు పెద్ద ఎత్తున లాటరీ టికెట్లు విక్రయించి కోట్లు దోచుకున్నారని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో సెక్షన్లు నాన్ బెయిలబుల్ కావడంతో సత్తెనపల్లి టౌన్ పోలీసులు బుధవారం గుంటూరులోని ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో పీటీ వారంట్ దాఖలు చేశారు. కేసులో నిందితుడైన అంబటిని ఈనెల 22లోగా కోర్టులో హాజరు పరచాలని జడ్జి కుముదిని ఆదేశించారు. సీఐను దూషించిన కేసులో అంబటికి కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆయనను విడుదల చేసే అవకాశం ఉండడంతో పీటీ వారెంట్‌పై ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు ఆదేశించడంతో ఆయనను హుటాహుటిన గుంటూరు కోర్టుకు తీసుకువచ్చేందుకు సత్తెనపల్లి టౌన్ పోలీసులు బుధవారం రాజమండ్రి బయలుదేరి వెళ్లారు.

దోమలు.. బాబోయ్ దోమలు..!

● దోమలు పట్టుకోవడంపై ప్రత్యేక్ష శిక్షణ

● ఇన్సెక్ట్ కలెక్టర్లకు క్షేత్రస్థాయిలో అభ్యాసం

● 15 ఏళ్ల తరువాత శిక్షణ ప్రారంభం



గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దోమలు, కీటకాల సేకరణ ఉద్యోగులు ఇన్సెక్ట్ కలెక్టర్లలో నైపుణ్యాన్ని పెంచేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దోమల సంతతిని ప్రాథమిక దశలో గుర్తించేందుకు మెళకువలను వివరిస్తోంది.

● 'మస్కిటో కలెక్షన్ ట్యూబ్ ద్వారా పట్టివేత

దోమలు పట్టుకోవడం ఎలా, అవి ఏ సంతతికి చెందినవి, వాటివల్ల వచ్చే సమస్యలపై ఉద్యోగులకు శిక్షణలో సీనియర్లు అవగాహన కలిస్తున్నారు. సాధారణంగా పట్టుకుంటే దోమలు ప్రాణాలు విడుస్తాయి. కానీ 'మస్కిటో కలెక్షన్ ట్యూబ్ ద్వారా దోమలు పట్టుకుంటారు. గోడలు, మూలాలు, మరుగుదొడ్లు, ఇతర ప్రదేశాలపై విశ్రాంతి దశ ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఉన్నప్పుడు టార్చ్ లైట్ సాయంతో 'మస్కిటో కలెక్షన్ ట్యూబ్‌ను నోట్లో పెట్టుకొని పీలుస్తారు. అప్పుడు దోమలు ట్యూబ్‌లోనికి వెళ్లి తెర ఉన్నచోట అగిపోతాయి. వాటిని ప్రత్యేకంగా పరీక్షించి, పట్టుబడిన దోమలు ఏ రకం, వాటివల్ల ఎటువంటి జ్వరాలు వస్తాయన్న దానిపై అవగాహనకు వస్తారు. వాటి నిరోధానికి చర్యలు తీసుకుంటారు.

● సత్వరం చర్యలు తీసుకునేలా..!

దోమల వల్ల వచ్చే సమస్యలను గుర్తించి, స్థానిక జిల్లా మలేరియా, ఇతర అధికారులకు తెలియచేసి, నిరోధక చర్యలు తీసుకునే విధంగా వీరు వ్యవహరిస్తారు. సమాచారాన్ని అనుసరించి, సదరు అధికారులు యాంటీ లార్వా ఆపరేషన్, ఇండోర్ స్ప్రే, ఇండోర్ రెసిడ్యుయల్ స్ప్రే, ఫాగింగ్ వంటి చర్యలు తీసుకుంటారు. ఇన్సెక్ట్ కలెక్టర్లు తమ జోన్ పరిధిలో 'హాట్‌స్పాట్‌గా గుర్తించిన చోట్ల కీటకాల విస్తృతిని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటారని వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తెలిపారు..

గ్రామాలలో ప్రభల సందడి

● కోటప్పకొండ తిరునాళ్లకు సిద్ధమవుతున్న 20 ప్రభలు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా జరిగే కోటప్పకొండ తిరునాళ్లకు చిలకలూరిపేట ప్రాంతం నుంచి తరలించేందుకు భారీ విద్యుత్‌ప్రభలు సిద్ధమవుతున్నాయి. గ్రామాలలో మూడు వారాల క్రితం నుంచే ప్రభల నిర్మాణం పనులు చేస్తున్నారు. ఆ పనులు ఇప్పుడు తుదిదశకు చేరాయి. చిలకలూరిపేట ప్రాంతంలో 11 గ్రామాల నుంచి మొత్తం 20 వరకు ప్రభలు సిద్ధం చేస్తున్నారు. వీటిలో 16 భారీవిద్యుత్ ప్రభలున్నాయి. చిలకలూరిపేట మండలంలోని కమ్మవారిపాలెం, గోవిందపురం, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెం, కావూరు, మద్దిరాల, యడవల్లి, బొప్పూడి, పురుషోత్తమ పట్నం, నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెం, అప్పాపురం గ్రామాలలో ప్రభలు సిద్ధమవుతున్నాయి. గణపవరం ప్రభలు కోటప్పకొండ వద్దనే సిద్ధం చేస్తున్నారు. కోటప్పకొండకు ప్రభను తరలించే రోజు కోమటినేనివారిపాలెం గ్రామానికి చెందిన ఆడపడుచులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పంబతాళ్లు పట్టుకుని ప్రభను ముందుండి నడిపించడం ఆనవాయితీగా ఉంది.

యడవల్లి ప్రభను 1961 నుంచి ఏటా కోటప్పకొండకు తరలిస్తున్నారు. 2012నుంచి భారీ విద్యుత్తు ప్రభలను క్రమం తప్పకుండా నిర్మించి కొండకు తరలిస్తున్నారు. 80 సంవత్సరాలుగా విద్యుత్ ప్రభలు నిర్మిస్తున్న కావూరు గ్రామ ప్రభకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. గ్రామం మొత్తాన్ని 6 ముఠాలుగా విభజించుకుని ఏటా ఒక ముఠా వారు ఎకరానికి కొంత చొప్పున విరాళంగా వేసుకుని ప్రభను నిర్మించడం ఆనవాయితీగా ఉంది. కావూరు ప్రభకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంలో 1996లో కోటప్పకొండ వద్ద ప్రభ నిలిపేందుకు రాజావారు ఈనాంగా 1.5 ఎకరాల స్థలం కేటాయించి శిలాఫలకం వేయించారు. 1988 మే 28న విజయవాడ మహానాడులో ఎన్టీఆర్ నుంచి ప్రభకు మొదటి బహుమతి అందుకోవడం గ్రామస్థులకు తీపి జ్ఞాపకం. కాగా కోటప్పకొండకు ప్రభలు తరలించే గ్రామాల్లో పురుషోత్తమపట్నంకు ఒక ప్రత్యేకత ఉంది. ఇక్కడ నుంచి ఈ ఏడు ఆరు భారీ విద్యుత్తు ప్రభలు, నాలుగు సాధారణ ప్రభలు తరలివెళ్తున్నాయి.



క్రేన్లతో నిలబెట్టిన యడవల్లి ప్రభ



క్రేన్లతో నిలబెట్టిన కోమటినేనివారిపాలెం ప్రభ

ప్రైవేటు వర్సిటీల.. ప్రలోభాల ఎర

(5వ పేజీ తరువాయి)

మరుసటి రోజు నుంచి యధావిధిగా ఫోన్లు చేయిస్తోన్నాయి. ఏపీలో చదువుకొన్నా పెద్దగా ఉద్యోగాలు రావని ఫోన్లు చేసిన రిప్రజెంటేటివ్‌లు చెబుతున్నారు. తమ వద్ద ఇండస్ట్రీ అవకాశాలు మెరుగ్గా ఉన్నా యని, ప్లేస్‌మెంట్ గ్యారెంటీ ఇస్తామని నమ్మించే ప్రయత్నం చేస్తోన్నారు.

కాగా ఐటీ రంగం ప్రస్తుతం అంతంత మాత్రంగా ఉండటం, తరచుగా కంపెనీలు ఉద్యోగస్థులను లేఆఫ్‌ల పేర్లతో తొలగిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కాస్త ఖర్చు ఎక్కువైనా చదువు అయిపోయాక ఉద్యోగం గ్యారెంటీ అంటే వెంటనే నమ్మే పరిస్థితికి చేరుకొన్నారు. అలానే మెరిట్ స్కాలర్‌షిప్‌లు కూడా ఇస్తామని ప్రలోభ పెడుతున్నారు. అడ్మిషన్ టెస్టు అంటూ ఆదివారం విద్యార్థులను పరీక్ష రాయడానికి రమ్మంటున్నారు. తూతూ మంత్రంగా పరీక్ష నిర్వహించి ఆ తర్వాత మీ పిల్లలకు మంచి మార్కులు వచ్చాయని, ఫీజులో 30 శాతం రాయితీ ఇస్తామంటూ వాళ్ల దారిలోకి తెచ్చుకొంటున్నారు. ఇప్పటికే కొందరు అడ్వాన్స్‌గా ఫీజులు కూడా చెల్లించారు. రాబోయే రోజుల్లో ఈ ఫోన్‌కాల్స్ బెడద మరింత పెరగొచ్చని సమాచారం.

వీఐపీలకే.. పెద్దపీట

(5వ పేజీ తరువాయి)

వాహన పాసులు పంపిణీతోనే ట్రాఫిక్ స్తంభించి భక్తులు తీవ్రంగా ఇక్కట్లు పడ్డారు. ఈ పరిస్థితుల్లో వీఐపీ వాహనాలకు పాసుల పంపిణీని నియంత్రించాల్సి ఉంది. అయితే అందుకు విరుద్ధంగా కొండ కింద వరకు వీఐపీ వాహన పాసులు పంపిణీ చేయనున్నట్లు పోలీసులు చెబుతున్నారు. వీఐపీ దర్శనం పాసులు రద్దుతో వాహనాల పాసులు తగ్గించే అవకాశం ఉన్నా ఈ దిశగా పోలీసు అధికారులు దృష్టి సారించడంలేదన్న విమర్శలున్నాయి. వీఐపీ వాహన పాసులతో వచ్చే వారి కోసం కొండ దిగువ నుంచి కొండపైకి వెళ్లేందుకు 22 బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. రూ.300 దర్శనం టిక్కెట్ కొనుగోలు చేసిన వీఐపీలను ఈ బస్సుల్లో అనుమతిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కొక్కరు రూ.25 టిక్కెట్ చెల్లించాలని తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం, రూ.500 అభిషేకం టిక్కెట్లు కొనుగోలు చేసిన వారు మామూలు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించాలంటున్నారు.

రెవెన్యూ సిత్రాలు

(5వ పేజీ తరువాయి)

రిజిస్ట్రేషన్‌కు ఇచ్చిన ప్రాముఖ్యత వెబ్‌ల్యాండ్‌లో నమోదుపై పెట్టడం లేదు. విదేశాలలో ఉంటూ ఇక్కడ భూములు కొనుక్కున్న వారిలో అధికంగా ఆన్‌లైన్ చేసుకోవడం లేదు. వీటిపైనే దృష్టి పెట్టిన అక్రమార్కులు కొంతమంది రెవెన్యూ సిబ్బంది సహకారంతో కావాలనే సదరు భూమిని లిటిగేషన్‌లో పెట్టి వారిని ముప్పతిప్పలు పెడుతున్నారు.

సంతృప్తి సర్వేలో ఇదే వెల్లడి

వివిధ విభాగాల పనితీరుపై ప్రజల సంతృప్తి స్థాయి తెలుసుకోవడానికి ప్రభుత్వం సర్వే నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. రెవెన్యూ విభాగానికి సంబంధించి ప్రజల నుంచి వస్తున్న ఫీడ్‌బ్యాక్‌లో అపరిష్కృత భూ సమస్యలు ఉండటం గమనార్హం. కావాలనే తమ భూమిని ఆన్‌లైన్‌లో తారుమారు చేశారనే బాధితులే అధికంగా ఉన్నారు. రెవెన్యూ విభాగంలో జీరో గ్రీవెన్స్ చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులను గమనిస్తే సదరు విభాగంలోని కొంతమంది ఉద్యోగులే కావాలని భూ సమస్యలు సృష్టించినట్లు బాధితులు చెబుతున్నారు. ప్రస్తుతం అదే హోదాలో పనిచేస్తున్న ఉద్యోగులు నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించలేమని చెబుతూ అర్జీని రిజక్ట్ అని డిస్పోజ్ చేస్తున్నారు. దీని ఫలితమే సంతృప్తి స్థాయిలో రెవెన్యూ పనితీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. భూ సమస్యపై గ్రామాల్లో క్షేత్రస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపి దానిని పరిష్కరించే అధికారం నిబద్ధత గల అధికారులకు కట్టబెడితే తప్ప ఈ అర్జీల పరంపర ఆగే అవకాశం లేదు.

ఆంధ్రజ్యోతి

నవ్య

కుటుంబ కదంబం

గురువారం • 12 ఫిబ్రవరి 2026



గర్భం ధరించగలనా? లేనా?

డాక్టర్ నా వయసు 30. ఇప్పుడే పిల్లలు వద్దనుకుంటున్నాం. అయితే నాలో గర్భం దాల్చే అవకాశాలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకోవాలని ఉంది. ఎలా సాధ్యపడుతుందో వివరించగలరు?

- ఓ సోదరి, హైదరాబాద్

గర్భం ధరించే వీలు ఉందా, లేదా అని ఎవరికి వారు గ్రహించాలంటే, కొన్ని ముఖ్యమైన అంశాల మీద అవగాహన పెంచుకోవాలి. గర్భం దాల్చే అవకాశాలు పెరిగే వయసుతోపాటు తరుగుతూ ఉంటాయి. మెనార్కీకి (మొదటి నెలసరి) చేరుకునేటప్పటికి మహిళల్లో 3 నుంచి 4 మిలియన్ల అండాలు ఉంటే, వయసుతోపాటు తగ్గుతూ 30 ఏళ్ల వయసుకు చేరుకునేసరికి ఇంకా తగ్గిపోతాయి. 35 ఏళ్లు దాటేటప్పటికి 25 వేల అండాలే మిగులుతాయి. కాబట్టి 30 ఏళ్ల లోపే గర్భం దాల్చాలి. ఒకవేళ 30 ఏళ్లొస్తే గర్భధారణకు ఒక 1 నుంచి 2 ఏళ్లకు మించి ఆగకూడదు. ఈ వ్యవధిలో ఒకసారి వైద్యులను కలిసి గర్భధారణకు సంబంధించిన ఆరోగ్యంగా ఉన్నారో, లేదో నిర్ధారించుకోవాలి. స్కానింగ్ ద్వారా ఫైబ్రాయిడ్, ఎండోమెట్రియాసిస్ లేదని నిర్ధారించుకోవాలి. భర్త సెమెన్ కౌంట్, భార్యలో అండాలు విడులయవుతున్నాయా? థైరాయిడ్ సమస్యలేమైనా ఉన్నాయా?.. ఈ పరీక్షలతో గర్భధారణ అవకాశాన్ని లెక్కించవచ్చు. ఈ పరీక్షలన్నీ సక్రమంగానే ఉండి 'అన్‌ఎక్స్‌ప్లెయిన్డ్ రీజన్స్' వల్ల గర్భధారణ జరగట్లేదని అనిపించినా, మరో ఏడాదిపాటు ఆగవచ్చు. 35 ఏళ్లు దాటితే వెంటనే గర్భం దాల్చాలి.

- డాక్టర్ సునీత ఇలినాని
కన్సల్టెంట్ అసిస్టెడ్ రిప్రొడక్టివ్ టెక్నాలజీ (ఆర్ట్ అండ్ ఇన్‌ఫెర్టిలిటీ) స్పెషలిస్ట్, హైదరాబాద్.

ఆహారంలో తీపి ఆరోగ్యంపై ప్రభావం

నేటి ఆధునిక జీవనశైలిలో పిల్లల ఆహారపు అలవాట్లు వేగంగా మారుతున్నాయి. చాక్లెట్లు, ఐస్‌క్రీంలు, కూల్‌డ్రింక్స్ వంటివి పిల్లలకు ఇష్టమైన పదార్థాలుగా మారిపోయాయి. అయితే, పిల్లలకు ఇచ్చే ఆహారంలో చక్కెర స్థాయిలు తగ్గించడం అనేది వారి భవిష్యత్తు ఆరోగ్యంపై పెట్టే ఒక గొప్ప పెట్టుబడి. చిన్నతనంలో అలవడే ఆహారపు అలవాట్లే వారు పెద్దయ్యాక ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను నిర్ణయిస్తాయి.

హైపర్ యాక్టివిటీకి ప్రధాన కారణం

- **చక్కెర:** చాలామంది తల్లిదండ్రులు గమనించే విషయం ఏంటంటే తీపి పదార్థాలు తిన్న తర్వాత పిల్లలు అకస్మాత్తుగా అతిగా ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు. దీనినే 'షుగర్ రష్' అంటారు.
- **శక్తి హెచ్చుతగ్గులు:** పంచదార ఎక్కువగా తీసుకుంటే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. దీనివల్ల వారు హైపర్ యాక్టివ్‌గా మారి కంట్రోల్ తప్పడం, ఏకాగ్రత కోల్పోవడం వంటివి చేస్తారు.
- **చిరాకు, నీరసం:** పెరిగిన శక్తిస్థాయిలు అంతే వేగంగా పడిపోయినప్పుడు పిల్లలు విపరీతమైన చిరాకు, అలసట, కోపాన్ని ప్రదర్శిస్తారు.



ప్యాక్ చేసిన ఆహారంతో ముప్పు

మనం ఆరోగ్యకరం అని భావించే అనేక ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో చక్కెర భారీ స్థాయిలో ఉంటుంది.

- **లేబుల్స్ గమనించండి:** బయట దొరికే జ్యూస్ ప్యాకెట్లు, ఎనర్జీ డ్రింక్స్, బిస్కెట్లలో మనకు తెలియకుండానే 'హిడెన్ షుగర్స్' ఉంటాయి. ఇవి ఊబకాయం, చిన్న వయసులోనే మధుమేహం వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయి.
- **తాజా పండ్ల రసాలే మేలు:** ప్యాక్ చేసిన జ్యూస్‌లకు బదులుగా ఇంట్లోనే తయారుచేసిన తాజా పండ్ల రసాలను అందించండి. పండ్లలో ఉండే సహజసిద్ధమైన పీచు పదార్థం ఆరోగ్యాన్ని ఇస్తుంది.
- **సహజసిద్ధమైన తీపి:** పిల్లలకు పూర్తిగా తీపిని దూరం చేయలేం. కాబట్టి తెల్ల చక్కెరకు బదులుగా బెల్లం, ఖర్జూరం, ఎండుద్రాక్ష వంటి సహజ సిద్ధమైన తీపి పదార్థాలను అలవాటు చేయండి.
- **దీర్ఘకాలిక ప్రభావాలు:** అధిక చక్కెర వినియోగం కేవలం దంత సమస్యలకే పరిమితం కాదు. ఇది రోగ నిరోధక శక్తిని తగ్గిస్తుంది. మెదడు ఎదుగుదలను మందగింపజేస్తుంది. భవిష్యత్తులో గుండె సంబంధిత సమస్యలకు కారణం అవుతుంది.
- **హైపర్ యాక్టివిటీ:** పంచదార ఎక్కువగా తీసుకుంటే పిల్లల్లో శక్తి ఒక్కసారిగా పెరిగి వారు కంట్రోల్ తప్పడం, చిరాకు పడటం వంటివి చేస్తారు.
- **ప్రత్యామ్నాయ స్వీట్లు:** ఇంట్లోనే తయారుచేసిన లడ్డూలు (బెల్లంతో చేసినవి), ఖర్జూరం, ఎండుద్రాక్ష వంటి సహజసిద్ధమైన తీపిని అలవాటు చేయండి.
- **ప్యాక్ చేసిన ఆహారం:** బయట దొరికే జ్యూస్ ప్యాకెట్లు, బిస్కెట్లలో దాగి ఉండే చక్కెర గురించి అవగాహన పెంచుకోండి. వీలైనంత వరకు తాజా పండ్ల రసాలనే అందించండి.

గ్లోబల్ ఫ్యాషన్ రాణి



భారతీయ మహిళలకు కలలు కనే ధైర్యమే కాదు, వాటిని నిజం చేసుకునే సత్తా కూడా ఉంటుందని నిరూపించారు లీనా నాయర్. ప్రపంచ కార్పొరేట్ రంగంలో అగ్రగామిగా ఎదగడం అంటే కేవలం డిగ్రీలు ఉండటం కాదు, ఒక స్పష్టమైన విజన్ ఉండాలని ఆమె జీవితం చాటిచెబుతోంది. ఫ్రాన్స్‌కు చెందిన అతిపెద్ద విలాసవంతమైన వస్తువుల సంస్థ 'షనెల్'కు గ్లోబల్ సీఈవోగా బాధ్యతలు చేపట్టి ప్రపంచవ్యాప్తంగా భారత కీర్తి పతాకాన్ని ఎగరవేశారామె.

అడుగులు పడ్డాయిలా

లీనా నాయర్ జూన్ 11, 1969న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఒక సాధారణ హిందూ మలయాళీ కుటుంబంలో జన్మించారు. చదువు విషయంలో ఆమె తల్లిదండ్రులు ఎంతో శ్రద్ధ చూపించేవారు. అప్పట్లో ఆడపిల్లల చదువుపై ఉన్న పరిమితులను దాటుకుని హోలీక్రాస్ కాన్వెంట్ స్కూల్‌లో మొదటి బ్యాచ్ విద్యార్థినిగా ఆమె విద్యను అభ్యసించారు. ఆ తర్వాత తన లక్ష్యం వైపు ప్రయాణాన్ని వేగవంతం చేశారు. ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తిచేసి గోల్డ్ మెడల్ సాధించారు. అంతటితో ఆగకుండా మేనేజ్‌మెంట్ రంగంపై ఉన్న ఆసక్తితో జంషెడ్‌పూర్‌లోని ప్రతిష్ఠాత్మక 'ఎక్స్ఎల్ఆర్ఐ' నుంచి 1992లో ఎంబీయే పూర్తిచేశారు. తన కుటుంబంలో ఉన్నత చదువులు చదివిన మొట్టమొదటి మహిళగా లీనా అప్పుడే రికార్డు సృష్టించి, భవిష్యత్ తరాలకు మార్గదర్శిగా నిలిచారు.



సవాళ్ల మధ్య విజయం

లీనా నాయర్ కెరీర్ హిందూస్థాన్ యూనీలీవర్ (హెచ్‌యూఎల్)లో ఒక సమ్మర్ ఇంటర్న్‌గా ప్రారంభమైంది. అప్పట్లో ఫ్యాక్టరీలు, ఫీల్డ్ వర్క్ అంటే కేవలం పురుషులకే పరిమితం అనే భావన ఉండేది. కానీ 1992లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరిన లీనా ఆ అపోహలను తుడిచిపెట్టేశారు. పారిశ్రామిక ప్రాంతాల్లో, గ్రామీణ మార్కెట్లలో తిరుగుతూ క్షేత్రస్థాయిలో సమస్యలను అర్థం చేసుకున్నారు. ఆమె పనితీరు చూసి యాజమాన్యం ఆశ్చర్యపోయింది. అలా క్రమంగా ఎదిగిన లీనా 2007లో 'హెచ్‌యూఎల్‌లో హెచ్ఆర్ విభాగానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అతి పిన్న వయసులోనే మేనేజ్‌మెంట్ కమిటీలో చోటు సంపాదించిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు యూనీలీవర్ సంస్థలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2016లో లండన్‌ని ప్రధాన కార్యాలయానికి వెళ్లిన ఆమె అక్కడ గ్లోబల్ చీఫ్ హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్ (సీహెచ్ఆర్‌వో)గా బాధ్యతలు చేపట్టారు. ఒక ఆసియా మహిళ అంతర్జాతీయ స్థాయి సంస్థలో అటువంటి కీలక పదవి చేపట్టడం అదే తొలిసారి.

షనెల్ సీఈవోగా

2021 డిసెంబర్‌లో లీనా నాయర్ పేరు ప్రపంచవ్యాప్తంగా మార్మోగిపోయింది. ఫ్రెంచ్ లగ్జరీ గ్రూప్ 'షనెల్' తమ గ్లోబల్ సీఈవోగా లీనా నాయర్ పేరును ప్రకటించగానే ప్రపంచ బిజినెస్ వర్గాలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయాయి. ఎందుకంటే, వందేళ్లకుపైగా చరిత్ర ఉన్న ఆ సంస్థకు ఒక భారతీయురాలు నాయకత్వం వహించడం అనేది సామాన్యమైన విషయం కాదు. ఫ్యాషన్ ప్రపంచంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ బ్రాండ్‌ను నడిపిస్తున్న రెండో మహిళా సీఈవోగా ఆమె బాధ్యతలు చేపట్టారు. 2023 జూలైలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ పారిస్‌ను సందర్శించినప్పుడు లీనా నాయర్‌ను ప్రత్యేకంగా కలిశారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయుల ప్రతిభ ఏ స్థాయిలో ఉందో ఆ సమావేశం మరోమారు నిరూపించింది.

అవార్డులు.. గుర్తింపులు

లీనా నాయర్ ప్రతిభకు ప్రపంచవ్యాప్తంగా గౌరవాలు దక్కాయి. రిటైల్, వినియోగదారుల పరిశ్రమలో ఆమె చేసిన సేవలకు గాను 2025లో బ్రిటన్ యువరాజు ప్రిన్స్ విలియమ్స్ చేతుల మీదుగా ప్రతిష్ఠాత్మక 'కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ అంపైర్' అవార్డు అందుకున్నారు. 2021లో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన మహిళల జాబితాలో ఫోర్బ్స్ ఆమెకు 68వ స్థానాన్ని ఇచ్చింది. 2017లో క్వీన్ ఎలిజబెత్-2 చేతుల మీదుగా కూడా అరుదైన గౌరవాన్ని పొందారు.

వ్యక్తిగత జీవితం

వృత్తిరీత్యా ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన బ్రాండ్‌ను నడిపిస్తున్నప్పటికీ లీనా వ్యక్తిగత జీవితం చాలా నిరాడంబరంగా ఉంటుంది. ఆర్థిక సేవల రంగంలో ఉన్న కుమార్ నాయర్‌ను ఆమె వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఇక ఆమె ఆర్థిక విషయానికి వస్తే.. లీనా నాయర్ నికర ఆస్తి విలువ సుమారు 40 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 362 కోట్లు). లీనా నాయర్ ప్రయాణం నేటి యువతకు ముఖ్యంగా మహిళలకు గొప్ప పాఠం. పరిమితులు మన మెదడులోనే ఉంటాయని, పట్టుదల ఉంటే ప్రపంచాన్నే జయించవచ్చని ఆమె నిరూపించారు.

వంటింటి అమరిక ఆరోగ్యానికి తొలిమెట్టు

వంటిల్లు శుభ్రంగా ఉంటేనే వంటపై ఆసక్తి పెరుగుతుంది. అందుకు ఈ చిట్కాలు పాటించండి.

- **లేబులింగ్:** ప్రతి డబ్బాపై పేరు రాసి ఉంచడం వల్ల వంట చేసేటప్పుడు వెతుక్కునే పని తప్పుతుంది. ట్రాన్స్‌పరెంట్‌గా (గాజు లేదా ప్లాస్టిక్) డబ్బాలు వాడితే లోపల ఏముందో తెలుస్తుంది.



- **వర్టికల్ స్పేస్:** కిచెన్ ప్లాట్‌ఫామ్ మీద వస్తువులు తక్కువగా ఉంచి, గోడలకు ఉండే హ్యాంగర్స్ లేదా స్టాండ్స్‌ను ఎక్కువగా వాడండి. దీనివల్ల వంటగది విశాలంగా కనిపిస్తుంది.
- **ప్రకృతి స్పర్శ:** కిటికీ దగ్గర చిన్నచిన్న ఇండోర్ ప్లాంట్స్ (మనీప్లాంట్ లేదా తులసి) పెంచండి. ఇది వంటింటికి కొత్త కళను తెస్తుంది.

ఓటమిని స్వీకరించడం నేర్పండి

నేటి పోటీ ప్రపంచంలో పిల్లలు ఎప్పుడూ గెలవాలని, అందరి కంటే ముందుండాలని ఒత్తిడికి గురవుతుంటారు. ఓటమి ఎదురైనప్పుడు వారు కుంగిపోకుండా ఉండాలంటే..

- **శ్రమను గుర్తించండి:** మార్కుల కంటే లక్ష్యం కోసం వారి కష్టాన్ని, అంకితభావాన్ని మెచ్చుకోండి. 'నువ్వు ఈ రోజు గెలవకపోవచ్చు, కానీ నీ శ్రమ నాకు చాలా గర్వంగా అనిపించింది" అనే ఒక్క మాట వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది.
- **విమర్శించవద్దు:** ఏదైనా తప్పు జరిగినప్పుడు, ఓడిపోయినప్పుడు మందలించడం వల్ల వారు భవిష్యత్తులో కొత్త పనులు చేయడానికి భయపడతారు. దానికి బదులుగా "ఎక్కడ తప్పు జరిగింది? ఎలా మెరుగుపరుచుకోవచ్చు?' అని చర్చించండి.
- **ప్రత్యర్థిని అభినందించడం:** మనం ఓడిపోయినప్పుడు ప్రత్యర్థిని అభినందించడం అనేది గొప్ప సంస్కారం. ఇది వారిలో అసూయను తగ్గించి, పక్కవారి పట్ల గౌరవాన్ని పెంచుతుంది.
- **సహజత్వం:** ఆటల్లో గెలుపోటములు సహజమని, ఈ రోజు ఓడితే రేపు గెలవడానికి అవకాశం ఉంటుందని చెప్పాలి.
- **రోల్‌మోడల్:** పిల్లలు మీరు చెప్పే మాటల కంటే, మీరు చేసే పనులనే ఎక్కువగా గమనిస్తారు. మీరు ఓటమిని ధైర్యంగా స్వీకరిస్తే, వారు కూడా అదే బాటలో నడుస్తారు.
- **ఎమోషనల్ సపోర్ట్:** ఓడిపోయినప్పుడు పిల్లలు బాధపడటం సహజం. ఆ బాధను తక్కువ చేయకుండా 'నీకు బాధగా ఉందని నాకు తెలుసు, పర్వాలేదు' అని వారిని దగ్గరకు తీసుకోండి. వారి భావాలను గౌరవిస్తూనే, ఆ పరిస్థితి నుంచి బయటకు వచ్చి మళ్లీ ప్రయత్నించేలా ప్రోత్సహించాలి.



మక్రామే మెరుపులు

డిజైనర్ వాల్ హ్యాంగింగ్స్ అంటే వేల రూపాయలు ఖర్చు చేయనక్కర్లేదు. కేవలం కాటన్ తాడుతో అల్లికలు చేసే 'మక్రామే' ఆర్ట్ ఇప్పుడు ఇళ్లకు కొత్త అందాన్ని ఇస్తోంది.

వాల్ హ్యాంగింగ్స్: గోడకు అందమైన డిజైన్లతో అల్లిన మక్రామే పీస్ తగిలిస్తే గదికి బోహో లుక్ వస్తుంది.

ప్లాంట్ హ్యాంగర్స్: కుండీలను గాలిలో వేలాడదీసేలా అల్లిన దారాలు బాల్కనీకి స్పెషల్ అట్రాక్షన్.

ప్రయోజనం: ఇది ఇంట్లో ఉన్న పాత వస్తువులకు ఒక మట్టివాసనతో కూడిన స్వచ్ఛమైన రూపాన్ని ఇస్తుంది.



మానసిక ఆరోగ్యమే ప్రధానం

కొందరి ప్రాధామ్యాలు కాస్త భిన్నంగా, సంభ్రమాశ్చర్యాలకు గురి చేసేలా ఉంటాయి. ప్రముఖ సితార్ విద్వాంసులు పండిట్ రవిశంకర్ కుమార్తె అనౌష్క శంకర్ తాజాగా, గ్రామీ అవార్డులకు బదులుగా, తన మానసిక ఆరోగ్యానికీ, ఇండియా టూర్‌కూ ప్రాధాన్యం ఇచ్చింది. అందుకు ఆమె వెల్లడించిన ఆసక్తికరమైన కారణాలివి.



"ఈసారి గ్రామీ అవార్డుల్లో రెండు విభాగాలకు నా పాటలు ఎంపికయ్యాయి. ఇది కచ్చితంగా హర్షించదగిన విషయమే! ఇవి నా 12, 13వ గ్రామీ నామినేషన్లు. గెలిస్తే అదొక అపురూపమైన అనుభవమయ్యేది. కానీ నిజానికి ఆ గెలుపోటముల మీద నాకు ఆసక్తి లేదు. ఆ పాటల పోటీలు, గెలుపులు, గుర్తింపుల కంటే నా మానసిక ఆరోగ్యం, వృత్తిపరమైన బాధ్యతలకే నా తొలి ప్రాధాన్యం.

అంతటి శ్రమ అవసరమా?

ఇలాంటి పాటల పోటీలు వేడుకలన్నీ భావోద్వేగాలు, ఆర్థికపరమైన ప్రభావాలతో ముడిపడి ఉంటాయి. నాకు నా మానసిక ఆరోగ్యమే ప్రధానం. వేలకొద్దీ డాలర్లు ఖర్చుపెట్టి, విమానాల్లో గంటల తరబడి ప్రయాణించి వేడుకలకు హాజరవడం ఒక ఎత్తైతే, ఆ సమయంలో ధరించవలసిన దుస్తులు, ఓటమిని ఎదుర్కోగలిగే మనోధైర్యాన్ని కూడదీసుకోవడం మరొక ఎత్తు. గెలిస్తే పెట్టుబడిగా పెట్టిన శ్రమకు, ఖర్చుకు తగిన ఫలం దక్కుతుంది. ఓడిపోతే ఆ ప్రభావం మన మానసిక, శారీరక ఆరోగ్యాలను దెబ్బతీస్తుంది. నిజానికి సంగీత ప్రపంచంలో ప్రత్యేకించి గ్రామీ లాంటి ప్రపంచ విభాగాల్లో ప్రధాన స్రవంతికి చెందిన పెద్ద కళాకారులకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఎక్కువ డబ్బున్న వాళ్లందరూ మార్కెటింగ్ కోసం విరివిగా ఖర్చు పెడతారు. నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని, నామినీ ఈవెంట్లకు హాజరవుతూ, వాళ్ల సంగీతం, పేర్లను ఓటర్ల మనసుల్లో ముద్రించుకుపోయేలా కృషి చేసే సంగీతకారులు కూడా ఉంటారు.

> భారత దేశంలో నా అద్భుతమైన బ్యాండ్‌తో, సిబ్బందితో మ్యూజిక్ టూర్‌లో పాల్గొనడం నాకొక అపురూప అనుభవం. గ్రామీకి ఎంపికైన నా సాటి నామినీలకూ, మరీ ముఖ్యంగా నా అభిమాన సంగీతకారులకూ బెస్ట్ విషెస్ తెలుపుకుంటున్నాను.

దురుద్దేశం లేదు

ఈ ఏడాది ఈ వేడుకలకు హాజరు కాకూడదనీ, బదులుగా భారతదేశంలో టూర్‌లో పాల్గొనాలనీ ఉద్దేశపూర్వకంగానే నిర్ణయించుకున్నాను. అవార్డులు ముఖ్యం కాదు. కళాకారిణిగా ప్రజలకు సంగీతాన్ని వినిపించడం ద్వారా మనకు దొరికే ఆదరణ నాకెంతో ముఖ్యం. ఈ అనుభవం ప్రశంసలకు మించినది.

ఛాప్టర్ 3: వి రిటర్న్ టు లైట్ ఆల్బమ్‌కూ, ఆల్బమ్‌లోని ప్రధాన పాట, డే బ్రేక్‌కూ రెండుసార్లు నామినేట్ అయినందుకు గర్వపడుతున్నాను. అయినప్పటికీ అవార్డులకు హాజరవడానికి బదులుగా స్వదేశంలో టూర్‌కు ప్రాధాన్యం ఇవ్వడంలో ఎలాంటి దురుద్దేశం లేదు. గ్రామీ అవార్డుల పట్ల ఎలాంటి వ్యతిరేకతా లేదు. తెర వెనక వాస్తవం ఎలా ఉంటుందో తెలియపరచడానికే ఈ వివరణ ఇస్తున్నాను.

నేనిలా లాస్ ఏంజిల్స్‌లో గ్రామీ వేడుకలకు హాజరు కాకూడదనే నిర్ణయం తీసుకోవడం వెనక మరొక బలమైన కారణం లేకపోలేదు. నాకు నా పాటలు, అభిమానులు, పర్యటనలే ముఖ్యం.

వజ్రం ఇక అందుబాటే

వజ్రం అంటే కేవలం ధనవంతుల అలంకారం. ఇది ఒకప్పుడు. కానీ ఇప్పుడు... ఆధునిక సాంకేతికత సృష్టించిన 'ల్యాబ్ గ్రోన్ డైమండ్స్'తో సామాన్యుడికీ అందుబాటులోకి వచ్చింది. జేబుకు చిల్లు పడకుండా, గుండె నిండా తృప్తినిచ్చేలా వజ్రపు మెరుపులు ప్రతి ఇంట్లోనూ వెలుగులు నింపుతున్నాయి.





వజ్రం.. ఆ పేరులోనే ఒక రకమైన హుందాతనం, ఆకర్షణ ఉన్నాయి. తరతరాలుగా వజ్రాభరణాలు ధరించడం అనేది ఒక హోదాకు చిహ్నంగా, తీరని కోరికగా మిగిలిపోయింది. సగటు మధ్య తరగతి మనిషికి తన జీవిత భాగస్వామికి ఒక వజ్రపుటుంగారాన్ని బహుమతిగా ఇవ్వాలని ఉన్నా, ఆకాశాన్నంటే ధరలు చూసి వెనకడుగు వేయక తప్పని పరిస్థితి. అయితే కాలం మారింది. ప్రయోగశాలల్లో రూపుదిద్దుకుంటున్న 'ల్యాబ్ గ్రోన్ డైమండ్స్' ఇప్పుడు సామాన్యుడికి వజ్రాల రాజయోగం కల్పిస్తున్నాయి. ఇవి కేవలం కృత్రిమ రాళ్లు కావు, ప్రకృతి ఒడిలో వేల ఏళ్లు పట్టే ప్రక్రియను శాస్త్రవేత్తలు అధునాతన పద్ధతుల్లో ల్యాబ్‌లోనే సృష్టిస్తున్నారు.

మధ్యతరగతి ముంగిట్లోకి మణిహారం


సామాన్యులకు ఈ వజ్రాలు అందుబాటులోకి రావడం అనేది ఒక సామాజిక విప్లవమనే చెప్పాలి. సహజ సిద్ధమైన వజ్రాల వెలికితీతలో ఉండే కష్టనష్టాలు, ఖరీదైన మైనింగ్ ఖర్చులు వీటిలో ఉండవు. కాబట్టి ఇవి చాలా తక్కువ ధరకే లభిస్తున్నాయి. నాణ్యతలోను, కాంతిని పరావర్తనం చేయడంలోనూ ఇవి సహజ వజ్రాలతో ఏమాత్రం తీసిపోవు. ఒక సాధారణ మనిషి తన పొదుపు మొత్తంతోనే ఇప్పుడు స్వచ్ఛమైన వజ్రాన్ని పోలిన కృత్రిమ వజ్రాన్ని కొనుగోలు చేయగలుగుతున్నాడు. పెళ్లిళ్లు, పుట్టిన రోజులు వంటి వేడుకల్లో వజ్రాలు ధరించాలనే మధ్య తరగతి కల ఇప్పుడు కలగా మిగిలిపోకుండా, అందమైన వాస్తవంగా మారుతోంది.

ఇవి ఎలా తయారవుతాయి?

అసలు ఈ మ్యాన్‌మేడ్ వజ్రాలు ఎలా తయారవుతాయనేది ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన ఆసక్తికరమైన అంశం. భూమి అంతర్భాగంలో విపరీతమైన వేడి, ఒత్తిడి వల్ల బొగ్గు వజ్రంగా ఎలా మారుతుందో, సరిగ్గా అదే వాతావరణాన్ని ల్యాబ్‌లో కృత్రిమంగా సృష్టిస్తారు. ప్రధానంగా హెచ్‌పీహెచ్‌టీ పద్ధతిలో అతి తక్కువ సమయంలోనే వజ్రపు ముక్కలను అద్భుతమైన ఆకృతులుగా మలుస్తారు. మరోవైపు సీవీడీ అనే అత్యాధునిక రసాయనిక పద్ధతి ద్వారా వజ్రపు పొరలను నిర్మిస్తారు. ఈ ప్రక్రియలో కార్బన్ పరమాణువులు ఒకదానిపై ఒకటి పేరుకుంటూ పోయి అచ్చం భూమిలో దొరికే వజ్రంలాంటి కఠినత్వాన్ని, స్వచ్ఛతను సంతరించుకుంటాయి.

అందరికీ చేరువైన అపురూప స్వప్నం

అంతిమంగా చెప్పాలంటే ల్యాబ్ డైమండ్స్ అనేవి కేవలం సాంకేతిక ఆవిష్కరణలు మాత్రమే కాదు, అవి సామాన్యుల కోరికలకు రెక్కలు తొడిగే ఆశలు. భూమిని తవ్వి పర్యావరణాన్ని పాడుచేయకుండా, తక్కువ ధరకే మేలిమి రత్నాలను అందించే ఈ మ్యాన్‌మేడ్ వజ్రాలు భవిష్యత్తులో ప్రతి సామాన్యుడి ఇంట మెరవడం ఖాయం. ఒకప్పుడు సిరిమంతులకే పరిమితమైన ఆ మెరుపులు ఇప్పుడు సామాన్యుడి ఇంట వెలుగులు నింపుతూ అందరికీ చేరువవుతున్నాయి. తక్కువ బడ్జెట్‌లో



ఎక్కువ మెరుపును కోరుకునే వారికి ఇవి నిజంగా ఒక అపురూపమైన కానుక.



- రాధిక మన్నె
జెమాలజిస్ట్, జువెల్లరీ డిజైనర్

మహీంద్రా @ 50,000 కోట్లు

త్రైమాసికాదాయంలో కొత్త రికార్డు

న్యూఢిల్లీ: దేశీయ వాహన తయారీ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా రూ.50,000 కోట్ల ఆదాయం మైలురాయిని దాటింది. ఒక త్రైమాసికంలో కంపెనీ ఆదాయం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఈ కీలక స్థాయిని దాటడం ఇదే ప్రథమం. డిసెంబరు 31వ తేదీతో ముగిసిన వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీ రూ.51,579.95 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.5,021 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,624.48 కోట్లతో పోల్చితే లాభం 38.54% పెరిగింది. ఆటో, వ్యవసాయ ఉత్పత్తుల రంగం బలమైన పనితీరు ప్రదర్శించడం ఇందుకు దోహదపడింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.41,464.98 కోట్లుగా ఉంది. నూతన కార్మిక చట్టాల అమలు కారణంగా తమపై 292.94 కోట్ల అదనపు భారం పడిందని కంపెనీ వెల్లడించింది.

3.02 లక్షల వాహనాల విక్రయం

ఆటో విభాగం 3.02 లక్షల త్రైమాసిక విక్రయాలను నమోదు చేసిందని, గత ఏడాదితో పోల్చితే ఇది 23 శాతం అధికమని ఎం అండ్ ఎం గ్రూప్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ అనిష్ షా అన్నారు. వ్యవసాయ విభాగం సైతం అంతే వృద్ధితో 1.5 లక్షల యూనిట్లు విక్రయించిందని చెప్పారు. కస్టమర్ డిమాండు నిలకడగా ఉండడంతో ఈ రెండు విభాగాల్లోనూ తాము అగ్రస్థానాన్ని సాధించగలిగామని ఆయన చెప్పారు. టెక్ మహీంద్రా సైతం మంచి వృద్ధిని నమోదు చేసిందని, మహీంద్రా ఫైనాన్స్ ఆస్తుల నాణ్యత మెరుగ్గా ఉన్నదని; మహీంద్రా లాజిస్టిక్స్, మహీంద్రా లైఫ్ సైన్సెస్ విభాగాలు సైతం వృద్ధికి తమ వంతు వాటా అందించాయని షా వివరించారు.

అశోక్ లేలాండ్ లాభం రూ.862 కోట్లు

వాణిజ్య వాహనాల తయారీలోని అశోక్ లేలాండ్ డిసెంబరు త్రైమాసికంలో 5.19% వృద్ధితో రూ.862.24 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. ఇదే త్రైమాసికంలో ఆదాయం రూ.11,995.21 కోట్ల నుంచి రూ.14,830.24 కోట్లకు పెరిగింది. అయితే మొత్తం వ్యయాల భారం రూ.10,937.89 కోట్ల నుంచి రూ.13,490.15 కోట్లకు పెరగడం వల్ల లాభాలకు గండి పడింది. క్యు3లో కంపెనీ 32,929 మధ్య, భారీ శ్రేణి వాణిజ్య వాహనాలు; 20,518 తేలిక రకం వాణిజ్య వాహనాలు విక్రయించింది.

బ్యాంకుల మిస్‌సెల్లింగ్‌కు చెక్

● ఈ విధానాలకు బాటలు వేసే ప్రోత్సాహకాలపై నిషేధం

● ఆర్‌బీఐ మార్గదర్శకాల సవరణ ముసాయిదా విడుదల

ముంబై: బ్యాంకుల మిస్‌సెల్లింగ్‌కు (కస్టమర్లకు అవసరం లేకున్నా తమ ఆర్థిక సాధనాలు లేదా సేవలను అంటగట్టడం) చెక్ పెట్టేందుకు ఆర్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు ఏదేని ఆర్థిక సాధనం/ఉత్పత్తి/పాలసీ లేదా సేవల మిస్‌సెల్లింగ్‌కు దారితీసే ప్రోత్సాహకాలను ప్రకటించరాదని ప్రతిపాదించింది. కస్టమర్ల నుంచి సమ్మతి లభించాకే బ్యాంక్‌లు వారిని ఫోన్ ద్వారా సంప్రదించాలని, పనివేళల్లో వారికి కాల్ చేయరాదని కూడా నిర్దేశించింది. తన నియంత్రణ సంస్థల ఆర్థిక ఉత్పత్తులు, సేవల ప్రచారం, మార్కెటింగ్, విక్రయాలకు సంబంధించిన మార్గదర్శకాల సవరణ ముసాయిదాను ఆర్‌బీఐ బుధవారం విడుదల చేసింది. అందులోని మరిన్ని ముఖ్యాంశాలు..

● బ్యాంక్ తన ఆర్థిక సాధనం లేదా సేవలతో థర్డ్ పార్టీ ఉత్పత్తులను కలిపి విక్రయించడానికి వీల్లేదు. అంతేకాదు, కస్టమరు తనకు నచ్చిన కంపెనీ ఆర్థిక సాధనం/ఉత్పత్తి లేదా సేవను ఎంచుకునే అవకాశాన్ని కల్పించాలి.

● ఒకవేళ మిస్‌సెల్లింగ్ జరిగితే, కస్టమరు చెల్లించిన మొత్తం సొమ్మును వాపసు (రిఫండ్) చేయాలి. తద్వారా కస్టమరుకు కలిగిన నష్టానికి కూడా పరిహారం చెల్లించాలి.

● ఈ సవరణ ముసాయిదాలోని ప్రతిపాదనలపై మార్చి 4 లోగా అభిప్రాయాలు తెలపాల్సిందిగా ఆర్‌బీఐ ప్రజలను కోరింది. ఇవి ఈ జూలై 1 నుంచి అమలులోకి రానున్నాయి.

24.64 లక్షల ఐటీ రిటర్న్‌ల పెండింగ్

న్యూఢిల్లీ: ఐటీ రిటర్న్‌ల వ్యవస్థను ఎంతగా ఆధునికం చేసినా రిటర్న్‌ల ప్రాసెసింగ్‌లో జాప్యం కొనసాగుతూనే ఉంది. 2025-26 పన్ను మదింపు సంవత్సరానికి సంబంధించి ఈ నెల 4వ తేదీ నాటికి 8.8 కోట్ల ఐటీ రిటర్న్‌లు ఫైల్ అయ్యాయి. నిబంధనల ప్రకారం ఐటీ అధికారులు వీటిని మూడు నెలల్లోగా పరిశీలించి రిఫండ్స్ ఏమైనా ఉంటే, వాటిని పన్ను చెల్లింపుదారుల ఖాతాల్లో జమ చేయాలి. అయితే 90 రోజుల గడువు ముగిసినా 24.64 లక్షల రిటర్న్‌ల పరిశీలన ఇంకా పూర్తికాలేదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.19.44 లక్షల కోట్లు: కేంద్ర ప్రత్యక్ష పన్నుల వసూళ్లు జోరందుకున్నాయి. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ నెల 10వ తేదీ వరకు పన్నుల ద్వారా కేంద్ర ప్రభుత్వ ఖజానాకు రూ.19.44 లక్షల కోట్లు చేరాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే ఇది 9.4% ఎక్కువ. కార్పొరేట్ పన్ను వసూళ్లు నికరంగా 14.51% శాతం పెరిగి రూ.8.90 లక్షల కోట్లకు చేరడం ఇందుకు బాగా కలిసి వచ్చింది.

దివీస్‌కు లేబర్ కోడ్ ఎఫెక్ట్

క్యూ3లో రూ.583 కోట్లకు తగ్గిన లాభం

కంపెనీ ఆదాయంలో 12 శాతం వృద్ధి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో హైదరాబాద్‌కు చెందిన దివీస్ లేబొరేటరీస్ రూ.583 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.589 కోట్ల లాభంతో పోలిస్తే స్వల్పంగా తగ్గింది. అంతేకాదు, రెండో త్రైమాసికంలో నమోదైన రూ.696 కోట్ల లాభంతో పోలిస్తే 15.4% తగ్గింది. కొత్త లేబర్ కోడ్స్ అమలు కోసం సమీక్షా త్రైమాసికంలో ఏక కాల ఖర్చుల కింద రూ.74 కోట్లు కేటాయించడంతో కంపెనీ లాభాలకు గండి పడింది. ఈ క్యూ3లో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం వార్షిక ప్రాతిపదికన 12.11% వృద్ధితో రూ.2,692 కోట్లకు పెరిగింది.

అవాంటెల్‌కు రూ.122 కోట్ల ఆర్డరు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇస్రో వాణిజ్య విభాగమైన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్) నుంచి రూ.122.58 కోట్ల ఆర్డరు లభించిందని హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న అవాంటెల్ లిమిటెడ్ బుధవారం వెల్లడించింది. ఇది ఎస్/ఎక్స్ బ్యాండ్ విత్ కే బ్యాండ్ రెడీ ఫుల్ మోషన్ యాంటెన్నాల సరఫరాకు సంబంధించిన ఆర్డరు అని తెలిపింది.

అమర రాజా లాభం రూ.140 కోట్లు

4.2% వృద్ధితో రూ.3,410 కోట్లకు ఆదాయం

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): వర్తమాన ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ ఏకీకృత నికర లాభం రూ.140 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి నమోదైన రూ.298 కోట్లతో పోలిస్తే లాభం 53% క్షీణించింది. నిర్వహణ లాభాల మార్జిన్లు తగ్గడంతోపాటు ఖర్చులు పెరగడం ఇందుకు కారణం. ఈ క్యూ3లో కంపెనీ ఎబిటా మార్జిన్ 11 శాతానికి తగ్గగా.. మొత్తం ఖర్చులు రూ.3,203 కోట్లకు ఎగబాకాయి. కాగా, ఈ క్యూ3లో కంపెనీ ఆదాయం 4.2% వృద్ధి చెంది రూ.3,410 కోట్లకు పెరిగింది. 2024-25లో ఇదే కాలానికి ఆదాయం రూ.3,272 కోట్లుగా నమోదైంది. మూడు త్రైమాసికాలకుగాను అమర రాజా ఏకీకృత ఆదాయం రూ.10,278 కోట్లకు పెరగగా.. ఏకీకృత నికర లాభం రూ.581.44 కోట్లకు తగ్గింది. బీఎస్ఈలో షేరు ధర బుధవారం 0.47% పెరిగి రూ.911.25 వద్ద ముగిసింది.

అమెరికాలో అనుబంధ సంస్థ ఏర్పాటు

అంతర్జాతీయంగా వ్యాపార విస్తరణతోపాటు కస్టమర్ సర్వీస్ సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు 'ఏఆర్ ఈ అండ్ ఎం యూఎస్ ఇంక్' పేరుతో అమెరికాలో పూర్తి అనుబంధ సంస్థ ఏర్పాటుకు బుధవారం బోర్డు ఆమోదం తెలిపిందని అమర రాజా స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు వెల్లడించింది. వచ్చే 3-6 నెలల్లో ఈ అనుబంధ సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు, ఇందుకోసం 50 లక్షల డాలర్ల (రూ.45 కోట్ల పైమాటే) వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు సంస్థ వెల్లడించింది.

బీహెచ్ఈఎల్ వాటాలకు భారీ స్పందన

ప్రభుత్వ రంగంలోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ (బీహెచ్ఈఎల్) వాటా విక్రయానికి భారీ స్పందన లభించింది. బుధవారం ప్రారంభమైన ఈ ఆఫర్ ఫర్ సేల్‌లో (ఓఎఫ్ఎస్) సంస్థాగత ఇన్వెస్టర్లు తొలిరోజు రూ.5,650 కోట్ల విలువైన షేర్లకు బిడ్లు సమర్పించారు. కనీస ఇష్యూ సైజుకు 2.3 రెట్ల బిడ్లు లభించాయి. బీహెచ్ఈఎల్‌లో 5% వరకు వాటాను కేంద్రం విక్రయించనుందని పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) మంగళవారం వెల్లడించింది. ఒక్కో షేరు కనీస ధరను రూ.254గా నిర్ణయించారు.

6 శాతం క్షీణించిన షేరు: కంపెనీలో ప్రభుత్వం వాటా విక్రయిస్తున్న నేపథ్యంలో బీహెచ్ఈఎల్ షేరు ధర బుధవారం బీఎస్ఈలో ఒకదశలో 6.07 శాతం క్షీణించి రూ.259.30 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 5.58 శాతం నష్టంతో రూ.260.65 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



12వ తేదీ			
హైదరాబాద్	495	విజయవాడ	515
వరంగల్	497	గోదావరి	485
చిత్తూరు	573	విశాఖపట్నం	490
		డజను గుడ్లు రూ. 75	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	120
వరంగల్	125	గుంటూరు	120
కరీంనగర్	125	ఒంగోలు	120
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	95
కర్నూలు	125	నెల్లూరు	100
విశాఖపట్నం	115	అనంతపురం	100
గోదావరి	120		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,58,510 ▲	1,45,300 ▲	3,00,000 ▲
విజయవాడ	1,63,000 ▲	1,52,000 ▲	2,84,500 ▲
విశాఖపట్నం	1,61,520 ▲	1,46,000 ▲	3,00,000 ▲
రాజమండ్రి	1,58,510 ▲	1,45,530 ▲	2,62,000 ▲
ప్రొద్దుటూరు	1,59,200 ▼	1,46,460 ▼	2,70,500 ▼
ముంబై	1,57,320 ▲	1,44,110 ▲	2,66,450 ▲

మార్కెట్లో నిస్తేజం..

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ముంబై: స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. బుధవారం ట్రేడింగ్‌లో స్తబ్దత కారణంగా పరిమిత శ్రేణిలో కదలాడిన సూచీలు చివరికి మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ 40.28 పాయింట్ల నష్టంతో 84,233.64 వద్ద ముగిసింది. నిఫ్టీ మాత్రం 18.70 పాయింట్ల వృద్ధితో 25,953.85 వద్ద స్థిరపడింది.

● ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ దేశంలోని అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీల జాబితాలో ఐటీ దిగ్గజం టీసీఎస్‌ను వెనక్కినెట్టి నాలుగో స్థానానికి చేరుకుంది. బీఎస్ఈలో ఎస్‌బీఐ షేరు బుధవారం 3.40% పెరిగి రూ.1,183 వద్దకు చేరుకుంది. దాంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.10.92 లక్షల కోట్లకు ఎగబాకింది.

బెంగళూరులో పౌలోమి కొత్త ప్రాజెక్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక పౌలోమి ఎస్టేట్స్ తన కార్యకలాపాలను బెంగళూరుకు విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బెంగళూరు నగర ఉత్తర ప్రాంతంలో 'పౌలోమి ఫ్లోరిక్యూ' పేరుతో లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపడుతోంది. మొత్తం తొమ్మిది ఎకరాల్లో నాలుగు టవర్లతో చేపట్టే ఈ ప్రాజెక్టు నాలుగేళ్లలో పూర్తవుతుందని పౌలోమి ఎస్టేట్స్ ఎండీ ప్రశాంత రావు చెప్పారు. ఈ ప్రాజెక్టులో అన్నీ ట్రిపుల్ బెడ్ రూమ్ ఫ్లాట్లే ఉంటాయి. ఒక్కో త్రీ బెడ్ రూమ్ ఫ్లాట్ కనీస విస్తీర్ణం 1,550 ఎస్ఎఫ్‌టీ నుంచి ప్రారంభం కానుంది. ఐటీ కంపెనీలు, జీసీసీ ఉద్యోగుల నుంచి ఈ ప్రాజెక్టుకు మంచి ఆదరణ లభిస్తుందని ఆశిస్తున్నట్టు రావు చెప్పారు. ఈ ప్రాజెక్టు అమ్మకం ధరను ఇంకా నిర్ణయించలేదన్నారు.

తెలుగు రాష్ట్రాల్లో మరింత విస్తరణ

కార్స్24 సీఎఫ్ఓ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలోని ప్రముఖ ఆటో టెక్ కంపెనీల్లో ఒకటైన 'కార్స్24' తెలుగు రాష్ట్రాల్లో తన కార్యకలాపాలను మరింత విస్తరించనుంది. ఇందులో భాగంగా యూజ్డ్ కార్ల అమ్మకాల కోసం హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఒక హబ్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు కంపెనీ సీఎఫ్ఓ శివాన్ష్ మక్కర్ చెప్పారు. మరో ఆరు నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ లేదా వైజాగ్‌లో, తెలంగాణలోని వరంగల్‌లో తమ అమ్మకం కేంద్రాలను ప్రారంభించబోతున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని మూడు కేంద్రాల ద్వారా నెలకు 1,200 నుంచి 1,500 యూజ్డ్ కార్లను విక్రయిస్తున్నట్టు తెలిపారు. కార్స్24 ప్లాట్‌ఫామ్ వచ్చే 12 నెలల్లో ఐపీఓకు వచ్చే అవకాశం ఉందన్నారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు	
శ్రీలంక X ఒమన్	(ఉ. 11 గం. నుంచి)
ఇటలీ X నేపాల్	(మ.3 గం.)
భారత్ X నమీబియా	(రా.7 గం.)

పసికూనతో పోరు

అభిషేక్ దూరం.. ఓపెనర్‌గా శాంసన్?

నమీబియాతో భారత్ ఢీ నేడు

టీ20 వరల్డ్‌కప్

రాత్రి 7 గం. నుంచి



నమీబియా కెప్టెన్ ఎరాస్మస్



ప్రాక్టీస్‌లో హార్దిక్

అభిషేక్

న్యూఢిల్లీ: టీ20 ప్రపంచకప్ తమ తొలి మ్యాచ్‌లో అమెరికా చేతిలో తడబాటుకు లోనైన టీమిండియా బ్యాటర్లు.. తదుపరి పోరులో జూలు విదల్చాలనుకొంటున్నారు. గ్రూప్-ఎలో గురువారం జరిగే తమ రెండో మ్యాచ్‌లో పసికూన నమీబియాతో డిఫెండింగ్ చాంపియన్ భారత్ తలపడనుంది. బలాబలాలపరంగా చూస్తే టీమిండియాకు నమీబియా ఏమాత్రం సరితూగే ప్రత్యర్థికాదు. కానీ, ఆదివారం పాకిస్థాన్‌తో జరగబోయే మ్యాచ్‌కు ముందు నమీబియాతో పోరును వామప్‌గా పరిగణించాలి. అయితే, కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరిన ఓపెనర్ అభిషేక్ వర్మ డిశ్చార్జ్ అయ్యాడు. కానీ, అతడిని ఆడించే అవకాశాలు తక్కువే. ఈ నేపథ్యంలో అభిషేక్ స్థానంలో సంజూ శాంసన్‌కు చాన్స్ లభించవచ్చు. అనారోగ్యం నుంచి కోలుకొన్న పేసర్ బుమ్రా బరిలోకి దిగనుండడం శుభపరిణామం. కెప్టెన్ సూర్యకుమార్ సూపర్ ఫామ్‌లో ఉండగా.. పాక్‌తో మ్యాచ్‌కు ముందు ఓపెనర్ ఇషాన్ కిషన్, తిలక్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్ టచ్‌లోకి రావడం ఎంతో ముఖ్యం. అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి స్పిన్ విభాగాన్ని నడిపించనున్నారు. మరోవైపు నమీబియా మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకోవాలనుకొంటోంది. కెప్టెన్ గెరార్డ్ ఎరాస్మస్, ఆల్‌రౌండర్ జేజే స్మిత్ మినహా జట్టులో చెప్పుకోదగ్గ బ్యాటర్లు లేరు.

జట్లు (అంచనా)

భారత్: అభిషేక్/సంజూ శాంసన్, ఇషాన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, శివం దూబే, అక్షర్, అర్ష్‌దీప్, బుమ్రా/సిరాజ్, వరుణ్ చక్రవర్తి.

నమీబియా: లోరెన్ స్టీన్‌కాంప్, జాన్ ఫ్రైలింక్, జాన్ నికోల్, గెరార్డ్ ఎరాస్మస్ (కెప్టెన్), జేజే స్మిత్, జేన్ గ్రీన్ (వికెట్ కీపర్), డ్యాలన్ లీచర్, విలియం మోబర్గ్, రూబెన్ ట్రంపెల్మన్, బెర్నార్డ్ షోల్జ్, బెన్ షికోంగో.

పిచ్/వాతావరణం

ఫిరోజ్ కోట్లా మైదానంలో బుధవారం ఉదయం 11 గంటలకు జరిగిన మ్యాచ్‌లో ఓ మాదిరి స్కోర్లు నమోదయ్యాయి. అయితే, రాత్రి జరిగే మ్యాచ్‌లోనూ పిచ్ ఇదేవిధంగా మందకొడిగా ఉంటుందా? అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి. బ్యాటింగ్ బలాన్ని చాటాలనుకొంటున్న టీమిండియా.. తొలుత బ్యాటింగ్ చేయడానికే మొగ్గుచూపొచ్చు. వాతావరణం సాధారణంగా, పొడిగా ఉండనుంది.

ఎలిస్, జంపా వికెట్ల వేట

ఆస్ట్రేలియా అదిరే బోణీ ● ఐర్లాండ్ ఓటమి

కొలంబో: పేసర్ నాథన్ ఎలిస్ (4/12), స్పిన్నర్ ఆడమ్ జంపా (4/23) వికెట్ల వేట కొనసాగించడంతో వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా అదిరే బోణీ చేసింది. బుధవారం జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో 67 పరుగులతో ఐర్లాండ్‌పై విజయం సాధించింది. తొలుత ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 182/6 స్కోరు చేసింది. స్టొయినిస్ (45), ఇన్‌గ్లిస్ (37), రెన్షా (37) సత్తా చాటారు. మార్క్ అడైర్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో ఎలిస్, జంపా దెబ్బకు ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకే చేతులెత్తేసింది. డాక్‌రెల్ (41), టకెర్ (24) మాత్రమే రాణించారు. కెప్టెన్ పాల్ స్టిర్లింగ్ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగి మళ్లీ బ్యాటింగ్‌కు రాలేదు.

సంక్షిప్తస్కోర్లు

ఆస్ట్రేలియా: 20 ఓవర్లలో 182/6 (స్టొయినిస్ 45, ఇన్‌గ్లిస్ 37, రెన్షా 37, గ్రీన్ 21, మార్క్ అడైర్ 2/44).

ఐర్లాండ్: 16.5 ఓవర్లలో 115 ఆలౌట్ (డాక్‌రెల్ 41, టకెర్ 24, ఎలిస్ 4/12, జంపా 4/23).

టోర్నీకి మార్ష్ దూరం?

ఆసీస్ కెప్టెన్ మిచెల్ మార్ష్ గాయంతో ప్రపంచ కప్‌నకు దాదాపు దూరమయ్యాడు. ఈవారం ఆరంభంలో ప్రాక్టీస్ సందర్భంగా మార్ష్ తీవ్రంగా గాయపడ్డాడు. దాంతో ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు బరిలో దిగలేదు. తాత్కాలిక సారథిగా హెడ్ బాధ్యతలు చేపట్టాడు. ఇక.స్టీవ్ స్మిత్‌ను రప్పిస్తుండడంతో మార్ష్ టోర్నీకి దూరమైనట్టేనని భావిస్తున్నారు.

సూపరో.. సూపరు!

రెండు సూపర్ ఓవర్లు

మజా పంచిన దక్షిణాఫ్రికా - అఫ్ఘానిస్థాన్ పోరు

చివరకు సఫారీలదే గెలుపు

మ్యాచ్‌లో ఇరుజట్ల స్కోర్లు ఒక్కటై.. సూపర్ ఓవర్ దాకా సాగి.. ఆ సూపర్ ఓవర్‌లోనూ స్కోర్లు సమమై.. ఫలితం రెండో సూపర్ ఓవర్‌లో తేలితే.. ఆ ఆటలో మజాయే వేరు. బుధవారం అహ్మదాబాద్‌లో ఇలాంటి అద్భుతమే జరిగింది. ఇరుజట్లు సహా విశ్వవ్యాప్త క్రికెట్ అభిమానులను మునివేళ్ల మీద నిలబెడుతూ.. టై మీద టైకి దారితీసిన దక్షిణాఫ్రికా, అఫ్ఘానిస్థాన్ మధ్య మ్యాచ్ ఈ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే హైలైట్‌గా నిలిచింది. ఆద్యంతం ఉత్కంఠ రేపుతూ, సూపర్ థ్రిల్లర్‌ను తలపించిన ఈ ఫైట్‌లో చివరకు సఫారీలను విజయం వరించింది.

సూపర్ ఓవర్ 1 సాగిందిలా..

అఫ్ఘానిస్థాన్ (17/0)	దక్షిణాఫ్రికా (17/1)
అజ్మతుల్లా (4)	మిల్లర్ (1)
అజ్మతుల్లా (6)	బ్రేవిస్ (6)
అజ్మతుల్లా (1)	బ్రేవిస్ (అవుట్)
గుర్బాజ్ (1)	స్టబ్స్ (4)
అజ్మతుల్లా (4)	స్టబ్స్ (0)
అజ్మతుల్లా (1)	స్టబ్స్ (6)
బౌలర్: ఎంగిడి	బౌలర్: ఫరూఖీ

సూపర్ ఓవర్ 2 సాగిందిలా..

దక్షిణాఫ్రికా (23/0)	అఫ్ఘానిస్థాన్ (19/2)
స్టబ్స్ (6)	నబీ (0)
స్టబ్స్ (1)	నబీ (అవుట్)
మిల్లర్ (2)	గుర్బాజ్ (6)
మిల్లర్ (6)	గుర్బాజ్ (6)
మిల్లర్ (6)	గుర్బాజ్ (6)
మిల్లర్ (2)	గుర్బాజ్ (వైడ్-1)
	గుర్బాజ్ (అవుట్)
బౌలర్: అజ్మతుల్లా	బౌలర్: కేశవ్ మహరాజ్



రికెల్టన్ (61)

గుర్బాజ్ (84)

అహ్మదాబాద్: టీ20 ప్రపంచ కప్ చరిత్రలోనే చిరస్మరణీయంగా నిలిచిపోయే మ్యాచ్‌కు అహ్మదాబాద్ స్టేడియం వేదికైంది. ఏకంగా రెండు సూపర్ ఓవర్లతో మ్యాచ్ ఫ్యాన్స్‌ను మునివేళ్లపై నిలబెట్టింది. చివరకు సఫారీలు విజయంతో ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం జరిగిన గ్రూప్ 'డి' పోరులో తొలుత దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 187/6 స్కోరు చేసింది. రికెల్టన్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సలతో 61) తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. డికాక్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లతో 59) హాఫ్ సెంచరీ సాధించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 61 బంతుల్లోనే 114 రన్స్ జోడించారు. ఛేదనలో అఫ్ఘాన్ 19.4 ఓవర్లలో సరిగ్గా 187 రన్స్‌కు ఆలౌటైంది. రహ్మానుల్లా గుర్బాజ్ (42 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్సలతో 84) ఒంటిచేత్తో అఫ్ఘాన్ ఇన్నింగ్స్‌ను నడిపించాడు. లోయరార్డర్‌లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (17 బంతుల్లో 22), కెప్టెన్ రషీద్ ఖాన్ (12 బంతుల్లో 20) ధాటిగా ఆడడంతో అఫ్ఘాన్ గెలుపునకు ఒక్క పరుగు దూరంలో నిలిచింది. మ్యాచ్‌ను సూపర్ ఓవర్‌కు మళ్లించింది.

తొలి సూపర్ ఓవర్: ఎన్‌గిడి వేసిన ఈ ఓవర్‌లో అజ్మతుల్లా (16 నాటౌట్) రెండు ఫోర్లు, ఓ సిక్సర్ దంచడంతో అఫ్ఘానిస్థాన్ వికెట్ నష్టపోకుండా 17 రన్స్ చేసింది. 18 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన దక్షిణాఫ్రికా బ్రేవిస్ (6) వికెట్‌ను కోల్పోయింది. ఫరూఖీ వేసిన ఈ ఓవర్లో స్టబ్స్ (10 నాటౌట్) ఓ బౌండరీ, చివరి బంతికి సిక్సర్ కొట్టడంతో సఫారీలు కూడా 17/1 స్కోరే చేశారు. ఫలితంగా మ్యాచ్ మరో సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

రెండో సూపర్ ఓవర్: రెండో సూపర్ ఓవర్‌లో మిల్లర్ (16 నాటౌట్), స్టబ్స్ (7 నాటౌట్) కలిపి మూడు సిక్సర్లు సాధించడంతో దక్షిణాఫ్రికా 23/0 స్కోరు చేసింది. ఛేదనలో మహ్మద్ నబీ (0)ని కేశవ్ మహరాజ్ అవుట్ చేశాడు. అయితే రహ్మానుల్లా గుర్బాజ్ (18) మూడు వరుస సిక్సర్లతో విరుచుకుపడడంతో అఫ్ఘానిస్థాన్ గెలుస్తుందేమోననిపించింది. కానీ మరో భారీ షాట్ కొట్టబోయి రహ్మానుల్లా నిష్క్రమించడంతో దక్షిణాఫ్రికాకు విజయం దక్కింది. ఎన్‌గిడి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

సంక్షిప్తస్కోర్లు

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 187/6 (రికెల్టన్ 61, డికాక్ 59, బ్రేవిస్ 23, అజ్మతుల్లా ఒమర్జాయ్ 3/41, రషీద్ ఖాన్ 2/28)

అఫ్ఘానిస్థాన్: 19.4 ఓవర్లలో 187 ఆలౌట్ (రహ్మానుల్లా గుర్బాజ్ 84, అజ్మతుల్లా ఒమర్జాయ్ 22, రషీద్ ఖాన్ 20, ఎన్‌గిడి 3/26).

ఇంగ్లండ్‌కు విండీస్ షాక్

రూథర్‌ఫోర్డ్ ధనాధన్ ● రాణించిన మోటీ, చేజ్ ● 30 రన్స్‌తో బ్రూక్ సేన చిత్తు



రూథర్‌ఫోర్డ్ (42 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లతో 76 నాటౌట్)

ముంబై: షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్ (42 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లతో 76 నాటౌట్) అర్ధ శతకంతోపాటు బౌలర్లు చెలరేగడంతో.. ఇంగ్లండ్‌కు వెస్టిండీస్ షాకిచ్చింది. గ్రూప్-సిలో బుధవారం జరిగిన మ్యాచ్‌లో విండీస్ 30 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచింది. తొలుత వెస్టిండీస్ 20 ఓవర్లలో 196/6 స్కోరు చేసింది. రోస్టన్ చేజ్ (34), జాసన్ హోల్డర్ (33) రాణించారు. రషీద్, ఓవర్టన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఓపెనర్లు బ్రెండన్ (1), హోప్ (0)లను అవుట్ చేసిన ఆర్చర్, సామ్ కర్రాన్‌లు ఆరంభంలోనే వెస్టిండీస్‌ను దెబ్బతీశారు. అయితే, హెట్‌మయర్ (23), చేజ్ మూడో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. దూకుడుగా ఆడుతున్న హెట్‌మయర్‌ను ఓవర్టన్ వెనక్కిపంపడంతో.. పవర్‌ప్లేలో విండీస్ 55/3తో నిలిచింది. చేజ్‌ను రషీద్ ఎల్బీ చేశాడు. ఈ దశలో పావెల్ (14)తో కలసి ఐదో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన రూథర్‌ఫోర్డ్.. హోల్డర్‌తో కలసి ఆరో వికెట్‌కు 61 పరుగులు జోడించాడు. దీంతో విండీస్ స్కోరు 200 మార్క్‌కు చేరువైంది. ఛేదనలో ఇంగ్లండ్ 19 ఓవర్లలో 166 పరుగులకు ఆలౌటైంది. సామ్ కర్రాన్ (43 నాటౌట్), బెథెల్ (33), ఫిల్ సాల్ట్ (30) పోరాటాలు వృథా అయ్యాయి. గుడకేష్ మోటీ మూడు, చేజ్ రెండు వికెట్లు దక్కించుకొన్నారు.

ముకేష్ డబుల్ ధమాకా

ఆసియా షూటింగ్



న్యూఢిల్లీ: ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ నేలవల్లి ముకేష్ మరో రెండు పతకాలు కొల్లగొట్టాడు. దీంతో ఈ టోర్నీలో అతను సాధించిన పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. బుధవారం జరిగిన 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ జూనియర్ వ్యక్తిగత విభాగంలో ముకేష్ కాంస్య పతకం గెలిచాడు. అనంతరం టీమ్ ఈవెంట్‌లో సూరజ్ శర్మ, సాహిల్ చౌధురితో కలిసి ముకేష్ స్వర్ణం సాధించాడు. ఇక, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ సీనియర్ కేటగిరిలో అనీష్ భన్వాలా కాంస్యం నెగ్గాడు.

నాలా బకాయిలపై ఉన్నతస్థాయి కమిటీ!

▸ రెవెన్యూ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు చేయండి

▸ సీఎస్‌కు హైకోర్టు కీలక ఆదేశాలు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూములుగా మార్చేందుకు చెల్లించాల్సిన నాలా ట్యాక్స్ వసూలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఒక్క విజయవాడ నార్త్ జోన్‌లోనే రూ.167 కోట్ల బకాయిలు ఉండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. బకాయిల వసూలుకు రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని నియమించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ని ఆదేశించింది. విచారణను మూడు నెలలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. విజయవాడలోని గుణదల పరిధిలో ఉన్న కార్మెల్ నగర్ సర్వేనెం 150/2లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేసిన 90 ఫ్లాట్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇచ్చిన విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులపై చర్యలకు ఆదేశించాలని కోరుతూ ఏపీ యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ అధ్యకుడు ఎన్.సత్యనారాయణ దాఖలు చేసిన ప్రజాప్రయోజనవ్యాజ్యం(పిల్)పై విచారణలో కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది.

కౌంటర్ ఎందుకు వేయడం లేదు?

▸ లులూకు భూ కేటాయింపుల పిల్‌పై ప్రభుత్వానికి హైకోర్టు ప్రశ్న

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో లులూ గ్రూపునకు భూముల కేటాయింపును సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌లో కౌంటర్ ఎందుకు వేయలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. పిల్ దాఖలై ఏడాది కావొస్తోందని గుర్తుచేసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి స్పందిస్తూ.. భూకేటాయింపును సవాల్ చేస్తూ బహుళ పిల్స్ దాఖలయ్యాయని, కొందరు కేటాయింపుల పాలసీని, మరికొందరు కేటాయింపు ప్రతిపాదన జీవోలను సవాల్ చేశారన్నారు. కౌంటర్ సిద్ధంగా ఉందని, ఒకటి రెండు రోజుల్లో దాఖలు చేస్తామని వివరించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం పిల్‌పై తదుపరి విచారణను మార్చి 11కి వాయిదా వేసింది. విశాఖ, విజయవాడ నగరాల్లో షాపింగ్ మాల్ ఏర్పాటుకు లులూ గ్రూపునకు తక్కువ ధరకు భూములు కేటాయిస్తున్నారంటూ విశాఖకు చెందిన పాకా సత్యనారాయణ, విజయవాడకు చెందిన న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు హైకోర్టులో పిల్స్ దాఖలు చేశారు. పాకా సత్యనారాయణ తరఫున న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపించారు.

మద్యం ముడుపులు చోక్రా ద్వారా మళ్లింపు

▸ ఏసీబీ కోర్టులో 61 పేజీల చార్జిషీట్ దాఖలు చేసిన సిట్

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మద్యం కంపెనీల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని ప్రధాన నిందితులు చాలా రహస్యంగా ముంబైకి చెందిన అనిల్ చోక్రా ద్వారా దారి మళ్లించినట్టు సిట్ పేర్కొంది. మద్యం కుంభకోణంలో ఏ49గా ఉన్న అనిల్ చోక్రాపై 61 పేజీల చార్జిషీటును విజయవాడ ఏసీబీ కోర్టులో దాఖలు చేసింది. రాష్ట్రంలో 2019 నుంచి 2024 మధ్య వేల కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలకు కేంద్ర బిందువుగా వ్యవహరించాడని పేర్కొంది. 'రాజకీయ నేతలు, ఉన్నతాధికారులు, మద్యం డిస్టిలరీల మధ్య కమీషన్ల కుంభకోణం నడిచింది. మద్యం సరఫరా కొనసాగాలంటే కంపెనీలు తప్పనిసరిగా బేసిక్ ధరలో సుమారు 20 శాతం కిక్‌బ్యాక్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 25కు పైగా షెల్ కంపెనీలను చోక్రా ఏర్పాటు చేశాడు. గతంలో రూ.304 కోట్లతో బ్యాంక్‌ను మోసం చేశాడు. ఆర్థిక మోసాల్లో అనిల్‌చోక్రాకు అనుభవం ఉంది' అని సిట్ పేర్కొంది. ఈ నిధుల వ్యవహారాలను ముందుగా ప్రధాన నిందితుడు కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తోడల్లుడు ముప్పిడి అవినాష్‌రెడ్డి పర్యవేక్షించాడని, తర్వాత ఆ బాధ్యతను చాణక్య తీసుకున్నాడని తెలిపింది.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల జవాబుపత్రాలు సక్రమంగా ఉన్నాయా? లేదా? వాటిని ఎవరైనా ట్యాంపర్ చేశారా? వీరి జవాబుపత్రాలపై ఉన్న బార్ కోడ్లు, ఒరిజినల్ ఓఎంఆర్ షీట్లు, విజయవాడ మూల్యాంకనంలో ఉపయోగించిన ఓఎంఆర్ షీట్లపై ఉన్న బార్ కోడ్‌లు సరిపోలుతున్నాయా? లేదా? పరిశీలించండి.

ఈ కేసులో పిటిషనర్లు, ఉద్యోగాలకు ఎంపికకాని అభ్యర్థుల జవాబుపత్రాలను కూడా తనిఖీ చేయాలి. అలాగే మెరిట్ లిస్ట్‌లో ఆఖరిన ఎంపికైన అభ్యర్థి కంటే దిగువన ఉన్న 100 మంది అభ్యర్థుల జవాబు పత్రాలనూ పరిశీలించాలి. జవాబుపత్రాల ట్యాంపరింగ్‌కు సంబంధించి మరేదైనా సమాచారం ఉంటే శాస్త్రీయ పద్ధతుల ద్వారా గుర్తించండి.

– సిట్‌కు హైకోర్టు ఆదేశం

గ్రూప్-1పై సిట్

(మొదటి పేజీ తరువాయి)

అడిషనల్ డీజీ స్థాయి హోదా తగ్గని అధికారి నేతృత్వం వహించాలని స్పష్టం చేసింది. సిట్ ఏర్పాటు వివరాలను మూడు రోజుల్లో రిజిస్ట్రార్(జ్యుడీషియల్)కు సమర్పించాలని ఏజీని ఆదేశించింది. కోర్టు సూచించిన పలు అంశాలపై విజయవాడ వెలుపల ఉన్న ఏదైనా కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నిపుణులతో దర్యాప్తు చేయాలని సిట్‌కు స్పష్టం చేసింది. మార్చి 16లోగా నివేదిక సమర్పించాలంది. ఎంపికైన అభ్యర్థులందరినీ తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు కీలక పోస్టుల నుంచి అప్రాధాన్య పోస్టులకు మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఉత్తర్వుల అమలుకు సంబంధించి వారం రోజుల్లో రిజిస్ట్రార్‌కు నివేదిక సమర్పించాలని సీఎస్‌ను ఆదేశించింది. అనుబంధ వ్యాజ్యాలను పరిష్కరించింది. ప్రధాన అప్పీళ్లపై విచారణను మార్చి 16కి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

అనుబంధ పిటిషన్ల దాఖలు

'కోర్టు నియమించిన కమిటీ గుర్తించిన, పరిశీలించిన ఓఎంఆర్ షీట్స్, కంట్రోల్ బండిల్స్‌పై ఉన్న సంతకాలు, చేతిరాతపై ఫోరెన్సిక్ పరిశీలనకు ఆదేశించండి. కోర్టు నియమించిన కమిటీ ఇచ్చిన నివేదిక అసంపూర్తిగా ఉంది. జవాబుపత్రాలకు జతచేసిన ఓఎంఆర్ షీట్ల పరిశీలన సందర్భంగా కమిటీ గుర్తించిన అంశాలను, పరిశీలించిన వాస్తవాలను నివేదికలో భాగం చేసేలా ఆదేశించండి. విచారణ సందర్భంగా ఏపీపీఎస్సీ కోర్టుకు డాక్యుమెంట్లు, రికార్డులు, ఇతర నివేదికలకు సంబంధించి సర్టిఫైడ్ కాపీలను అందజేసేలా రిజిస్ట్రీని ఆదేశించండి' అని కోరుతూ అనుబంధ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అనుబంధ పిటిషన్లపై వాదనలు ముగియడంతో ధర్మాసనం నిర్ణయాన్ని వాయిదా వేసింది. బుధవారం వాటిపై నిర్ణయాన్ని ప్రకటించింది.

తీర్పులో ఏముందంటే..

'రికార్డులు పరిశీలిస్తే ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా అప్పటి ఏపీపీఎస్సీ సెక్రటరీ పీఎస్ఆర్ ఆంజనేయులు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షకు సంబంధించిన జవాబుపత్రాలను హాయ్‌ల్యాండ్‌లోని అవాస రిసార్ట్స్‌కు తరలించారు. జవాబుపత్రాలను ప్రైవేటు రిసార్ట్స్‌కు తరలించడం, వాటిని 65 రోజుల పాటు అక్కడే ఉంచాలని ఎవరు నిర్ణయించారో నిరూపించే ఏ ఫైలూ ఏపీపీఎస్సీ వద్ద లేదని అడ్వొకేట్ జనరల్ కోర్టుకు చెప్పారు. హాయ్‌ల్యాండ్‌లో ఎలాంటి మూల్యాంకనం జరగలేదని ఏపీపీఎస్సీ చెబుతోంది. అందుకు విరుద్ధంగా ఒరిజనల్ ఓఎంఆర్ షీట్లపై మార్కులు కేటాయించారని కోర్టు నియమించిన విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ నివేదిక ఇచ్చింది. విజయవాడలో మూల్యాంకనం నిర్వహించేందుకు ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్స్ తాజాగా ముద్రించారు. ఇటువంటి అంశాలు ఏపీపీఎస్సీ విశ్వసనీయతపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి. మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ ఎంపికకాని అభ్యర్థుల ఆరోపణలు అంగీకరించేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. గ్రూప్-1 పోస్టులు రాష్ట్ర పరిపాలనలో అత్యంత కీలకమైనవి. మూల్యాంకనంలో తమ పాత్ర లేదని, అమాయకులమని ఎంపికైన అభ్యర్థులు చెబుతున్నప్పటికీ.. మూల్యాంకన విధానం, జవాబుపత్రాలు దిద్దే ప్రదేశాలు మారినప్పుడు ఎంపికైనవారి పేర్లు జాబితా నుంచి మాయం కావడం, కీలక సమాచారాన్ని, రికార్డులను సమర్పించడంలో ఏపీపీఎస్సీ విఫలమవడం చూస్తుంటే మూల్యాంకనంలో నిష్పాక్షితపై అనుమానం కలుగుతోంది. ఎంపికైన, ఎంపికకాని అభ్యర్థుల జవాబుపత్రాలను పోల్చి చూడడం ద్వారా ముఖ్యంగా పేపర్ వయస్సు, సిరా వయస్సు, బార్‌కోడ్‌ల సరిపోలిక, కొట్టివేతలు, రాతలో తేడాలు వంటి అంశాలపై ఫోరెన్సిక్ నిపుణుల సహాయంతో విచారణ చేపడితే అనుమానాలు నివృత్తి అవుతాయి. కొంతమంది ఎంపికైన అభ్యర్థుల నిజాయితీ కారణంగా ఇతర అభ్యర్థుల విషయంలో జరిగిన మోసాలను విస్మరించలేం. ఒక చుక్క విషం మొత్తం పాలను విషపూరితం చేస్తుందనే విషయం గుర్తుంచుకోవాలి. ఈ నేపథ్యంలో మూల్యాంకనం ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించడానికి ఫోరెన్సిక్ పరీక్ష అవసరమని భావిస్తున్నాం. అసాధారణ పరిస్థితుల్లో నిజాన్ని వెలికితీయడానికి అసాధారణమైన దర్యాప్తే సరైన మార్గం. నిధుల దుర్వినియోగం, నిర్వహణ లోపం, మూల్యాంకన ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు అవసరం. ఈ నేపథ్యంలోనే సిట్‌ను ఏర్పాటు చేస్తున్నాం' అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

నకిలీ మద్యం కేసులో మరో ఇద్దరికి బెయిల్

▸ అయినా..రిమాండ్ ఖైదీలుగానే జినేష్, షిబు


▸ ములకలచెరువులో నమోదైన కేసులో లభించని బెయిల్

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం తయారీ కేసులో మరో ఇద్దరు నిందితులకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. విజయవాడలోని జిల్లా జైల్లో ఉన్న జినేష్, షిబులకు బెయిల్ మంజూరు చేస్తూ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి జి.లెనిన్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బెయిల్ కోసం వీరిద్దరూ దాఖలుచేసిన పిటిషన్లపై వాదప్రతివాదనలు ముగియడంతో కోర్టు తీర్పును వెలువరించింది. ఒకొక్కరు రూ.2 వేలతో రెండు పూచీకతులను సమర్పించాలని, ఎక్సైజ్ అధికారులు విచారణకు పిలిచినప్పుడు హాజరుకావాలని, పాస్‌పోర్టులను కోర్టులో సమర్పించాలని, అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని షరతులు విధించింది. భవానీపురం ఎక్సైజ్ పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ వచ్చినప్పటికీ ములకలచెరువు కేసులో బెయిల్ రాకపోవడంతో ఇంకా రిమాండ్ ఖైదీలుగా ఈ ఇద్దరు నిందితులు ఉండబోతున్నారు.

జోగి రమేశ్‌కు నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

▸ పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్ పర్యటన సందర్భంగా అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించారని, ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించారని వైసీపీ నేత జోగి రమేశ్‌పై ఎస్ఐ రవివర్మ ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా ఈనెల 6న ఆయనపై కేసు నమోదు చేశారు. ఆ కేసు కొట్టేయాలని జోగి రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. పిటిషనర్‌పై నమోదైన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్షకు వీలున్నవే అయినందున బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చిన వివరణ తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.



ఒడ్డుకు కొట్టుకొచ్చిన డాల్ఫిన్ కళేబరం

తీరంలో తాబేళ్ల మృత్యుఘోష..!



రెండు రోజుల్లో 40కి పైగా మృతి

▸ మొగల్తూరు నుంచి నరసాపురం తీరం వరకు ఎక్కడ చూసినా తాబేళ్ల కళేబరాలే..

నరసాపురం రూరల్/మొగల్తూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తీరంలో తాబేళ్ల మృత్యుఘోష ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల్లోనే సుమారు 40 తాబేళ్లు మృతిచెంది ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. తాజాగా బుధవారం మూడు క్వింటాళ్ల బరువుండే డాల్ఫిన్ కళేబరం కూడా ఒడ్డుకు కొట్టుకొచ్చింది. పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు నుంచి నరసాపురం సముద్రతీరం వరకు ఎక్కడ చూసినా తాబేళ్ల కళేబరాలే కనిపిస్తున్నాయి. స్థానికులు తొలుత అనారోగ్యంతో చనిపోయి ఉండవచ్చని భావించారు. కానీ.. ఎక్కువ సంఖ్యలో ఉండటంతో వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ, మత్స్యశాఖ అధికారులు వచ్చి చనిపోయిన తాబేళ్లను పరిశీలించారు. వైద్య పరీక్షల నిమిత్తం కొన్నింటిని ల్యాబ్‌లకు తరలించారు. సాధారణంగా తాబేళ్లు జనవరి, ఫిబ్రవరి నెలల్లో గుడ్లు ఎక్కువగా పెడతాయి. ఈ సమయంలో అవి మృత్యువాత పడి ఒడ్డుకు చేరడంపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కలుషిత నీటి వల్లే మృతి చెందాయా..? వలలు, బోట్లు తగిలి చనిపోయాయా..? లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా..? అనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. గతంలో కూడా ఇదే తరహాలో తాబేళ్లు మృతి చెందాయి. దీంతో పీఎం లంక వద్ద ఒక సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గుడ్డు పొదిగే వరకు వాటిని కేంద్రంలో ఉంచి ఆ తర్వాత సముద్రంలో విడిచిపెట్టారు. ప్రస్తుతం ఈ కేంద్రాన్ని మూసివేశారు. చనిపోయిన తాబేళ్లను పరిశీలించిన ఫారెస్ట్ జిల్లా అధికారి డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ.. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టామన్నారు. పోస్టుమార్టం తర్వాత వీటి మృతిపై ఒక అంచనాకు వస్తామని అన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

హృదయాన్ని హత్తుకునే ప్రేమకథ



"కపుల్ ఫ్రెండ్లీ' టైటిల్ చూసి ఇది యూత్ సినిమా అనుకోవద్దు... ఇందులో ఫ్యామిలీ ఎమోషన్స్ ఉన్నాయి' అని నిర్మాత, డిస్ట్రిబ్యూటర్ ధీరజ్ మొగిలినేని చెప్పారు. సంతోశ్ శోభన్, మానస వారణాసి జంటగా దర్శకుడు అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించిన చిత్రమిది. యూవీ కాన్సెప్ట్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సినిమాను ధీరజ్ రెండు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'చెన్నై నేపథ్యంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథా చిత్రమిది. సంతోష్ శోభన్ నటన సరికొత్తగా ఉంటుంది. దర్శకుడు అశ్విన్ ఎక్కడా బోర్ కొట్టకుండా, ప్రతి సీన్‌కు లింక్ ఉండేలా పక్కా స్క్రిప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ప్రతి సన్నివేశం మనసులో నిలిచిపోయేలా ఉంటుంది. సమకాలీన సమాజంలో చర్చనీయాంశంగా మారిన లివ్ ఇన్ రిలేషన్‌షిప్ అనే అంశం చుట్టూ కథ తిరుగుతుంది' అని చెప్పారు.



రాయలసీమ యోధుడి గాథ

వైవిధ్యమైన కథలతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరో నిఖిల్ సిద్ధార్థ, ఇప్పుడు 'స్వయంభు' అనే భారీ పీరియడ్ యాక్షన్‌తో వస్తున్నాడు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మించారు. బుధవారం చిత్రబృందం టీజర్ ను విడుదల చేసింది. ఇదొక పురాతన యుద్ధ వీరుడి కథ అని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. కృష్ణ అనే ఒక సామాన్య రాయలసీమ యోధుడు సామ్రాజ్యాన్ని రక్షించే మహావీరుడిగా ఎలా ఎదిగాడు అనేది ప్రధానాంశంగా కనిపిస్తోంది. కండలు తిరిగిన శరీరంతో నిఖిల్ యుద్ధవీరుడి పాత్రలో పర్ఫెక్ట్‌గా సరిపోయారు. పురాతన కోటలు, వేల సంఖ్యలో సైనికులతో కూడిన యుద్ధ సన్నివేశాలు హాలీవుడ్‌ని తలపిస్తున్నాయి. ఈ సందర్భంగా నిఖిల్ మాట్లాడుతూ "కార్తికేయ 2 తర్వాత అంతకంటే గొప్ప సినిమాతో రావాలని రెండేళ్లు కష్టపడి 'స్వయంభు' చేశాం. సినిమా చూశాక నిఖిల్ మా వాడు అని మీరంతా గర్వంగా ఫీలవుతారు" అని అన్నారు. ప్రతి ఒక్కరికీ ఈ సినిమా గొప్ప అనుభూతిని ఇస్తుందని భరత్ కృష్ణమాచారి చెప్పారు. 'స్వయంభు' కోసం దర్శకుడు చాలా పరిశోధన చేశారు, ఆయన కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయా అని సంయుక్త తెలిపారు.

విపరీతంగా నవ్విస్తుంది



విష్వక్సేన్

నా ప్రతీ సినిమా విడుదలకు ముందు చాలా టెన్షన్ ఉంటుంది. కానీ 'ఫంకీ' విడుదలకు ముందు మాత్రం చాలా ప్రశాంతంగా ఉన్నాను. ఈ సినిమాను మీరంతా బాగా ఎంజాయ్ చేస్తారు. మంచి హిట్టు కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఇంత అద్భుతమైన కథ నా దగ్గరకు వచ్చింది. థియేటర్లకు వచ్చిన ప్రతీ ఒక్కరినీ 'ఫంకీ' విపరీతంగా నవ్విస్తుంది. అందర్నీ అలరించి ఘనవిజయం సాధిస్తుంది' అని విష్వక్సేన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా అనుదీప్ కేవీ తెరకెక్కించిన చిత్రం 'ఫంకీ'. సితార ఎంటర్టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనుదీప్ కేవీ మాట్లాడుతూ 'ఫంకీ' పూర్తిస్థాయి కుటుంబ చిత్రం. ప్రారంభం నుంచి చివరి వరకూ వినోదాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. 'ఫంకీ' మీ అందరికీ కచ్చితంగా నచ్చుతుంది. ఇందులో నేను పోషించిన చిత్ర పాత్రపై ప్రేమ కురిపిస్తారని కోరుకుంటున్నాను' అని చిత్ర కథానాయిక కయాదు లోహర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందం పాల్గొంది.

బంధాల విలువలు చెప్పే సినిమా



సీనియర్ నటుడు అర్జున్ సర్జా దర్శకత్వం వహించిన 'సీతా పయనం' చిత్రం ఈ నెల 14న విడుదలవుతోంది. నిరంజన్, ఐశ్వర్య జంటగా నటించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 'అర్జున్ మంచి మనిషి. సౌమ్యుడు. ఆయన దర్శకత్వం వహించిన ఈ చిత్రం హిట్ కావాలి. వారి అమ్మాయి ఐశ్వర్యకు మంచి పేరు రావాలి' అని కోరారు. 'నా కూతురిని ఓ మంచి కథతో, పాజిటివిటీ ఉన్న సినిమాతో పరిచయం చేయాలని అనుకున్నా.ఆమెకు ఓ బహుమతిలా ఈ సినిమాను ఇవ్వాలని అనుకున్నా. అలాగే ప్రేక్షకులకు ఓ మంచి సినిమా అందించాలనే తపనతో నిజాయితీతో 'సీతా పయనం' తీశాను. ఉపేంద్రగారి అన్న కొడుకు నిరంజన్ అద్భుతంగా నటించాడు. సినిమా చూసి నా కూతురిని అందరూ మెచ్చుకుంటారని ఆశిస్తున్నా' అన్నారు. తను గర్వంగా చెప్పుకొనే సినిమా తీసిన తండ్రి అర్జున్‌కు కృతజ్ఞతలు తెలిపారు ఐశ్వర్య.

'సన్ ఆఫ్' చిత్రం హిట్ కావాలి



కోన వెంకట్

సాయి సింహాద్రి హీరోగా నటిస్తూ తనే నిర్మిస్తున్న చిత్రం 'సన్ ఆఫ్'. బత్తుల సతీశ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. తాజాగా జరిగిన గ్రాండ్ ఈవెంట్‌లో సినిమా ట్రైలర్, పాటలు విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోన వెంకట్ మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం సాయి హీరో అయి నిర్మాత అయ్యాడా, లేక నిర్మాత అయ్యాక హీరో అయ్యాడా తెలీదు కానీ చిత్రంలో మంచి కంటెంట్ ఉంది. ఇలాంటి కంటెంట్ ఉన్న చిత్రాలు హిట్ అయితే మరికొంతమంది కొత్తవాళ్లు పరిశ్రమలోకి వస్తారు. అందుకే ఈ సినిమా హిట్ కావాలి' అని కోరారు. 'నేను ఎన్నో కథలు విన్నా. సతీశ్ చెప్పిన ఈ కథ బాగా నచ్చింది. నటనలో శిక్షన తీసుకున్నా. నిర్మాత శోభగారు అమ్మోరులా నా చేతిని పట్టుకుని నడిపించి మా సినిమాను ఇంత దూరం తీసుకువచ్చారు' అని చెప్పారు హీరో సాయి సింహాద్రి. నిర్మాత శోభారాణి మాట్లాడుతూ 'ఈ సినిమా టైటిల్‌లోనే ఎమోషన్ ఉంది. ట్రైలర్ చూసి మంచి సినిమా అవుతుందని చెప్పా. కొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమాను అందరూ చూసి ఆదరించాలి' అని కోరారు.



హీరోయిన్ శ్రీలీల.. డాక్టర్ శ్రీలీలగా మారారు. ఇటీవలే మహారాష్ట్రలోని డీవై పాటిల్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఆమె బుధవారం కాలేజి నుంచి మెడికల్ డిగ్రీ పట్టా అందుకున్నారు. ఓ వైపు వరుస చిత్రాల్లో నటిస్తూనే ఆమె ఎంబీబీఎస్‌ను పూర్తి చేయడం విశేషం. ప్రస్తుతం 'ఉస్తాద్ భగత్‌సింగ్' పాటూ, 'తూ మేరీ జిందగీ హై', 'డీ55' చిత్రాల్లో నటిస్తున్నారు.

సుహాస్ ఇమేజ్‌ను మార్చే కథ



యంగ్ హీరో సుహాస్, శివానీ నగరం జంటగా నటించిన తాజా చిత్రం 'హే భగవాన్'. బన్నీ వాస్, వంశీ నందిపాటి సమర్పణలో బి. నరేంద్ర రెడ్డి నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు గోపీ అచ్చర మీడియాతో మాట్లాడారు. 'సుహాస్ నాకు బాల్య మిత్రుడు. నటుడిగా సుహాస్ బలం కామెడీనే అయినా, ఈ సినిమాలో తన పాత్ర ప్రేక్షకుల అంచనాలను తలకిందులు చేసేలా ఉంటుంది. ఇంతవరకూ తను చేసిన పాత్రలకు భిన్నంగా, ఆద్యంతం నవ్విస్తూనే, సరికొత్త మేకోవర్‌లో కనిపిస్తాడు. సుహాస్ ఇమేజ్‌ను మార్చే చిత్రమిది. మన నిత్య జీవితంలో ఎదురయ్యే ఇబ్బందికర పరిస్థితుల్లో వచ్చే 'హే భగవాన్' అనే పలుకును ఈ సినిమాకు టైటిల్‌గా పెట్టాం. సినిమాలో పాత్రలకు కూడా అలాంటి ఘటనలే ఎదురవుతాయి. ఆరంభం నుంచి పతాక సన్నివేశాల వరకూ ఆద్యంతం నవ్వులు పంచుతూనే, చివర్లో తండ్రీ కొడుకుల మధ్య ఉండే ఎమోషన్‌తో గుండెల్ని బరువెక్కిస్తాం. నిర్మాత సహకారంతో 36 రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేశాం. కుటుంబం అంతా కలసి చూసేలా మా సినిమా ఉంటుంది' అని గోపీ చెప్పారు.



సభలో సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల, అచ్చెన్న, లోకేశ్, ఆనం తదితరులు

మార్చి 7 వరకు అసెంబ్లీ

17 పనిదినాలు సమావేశాల నిర్వహణ

- 14న రాష్ట్ర బడ్జెట్.. 17, 18న దానిపై చర్చ
- సభావ్యవహారాల సలహా సంఘం నిర్ణయం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను మార్చి 7వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. మొత్తం 17 పనిదినాలు సమావేశాలు నిర్వహించాలని బుధవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన జరిగిన సభావ్యవహారాల సలహా సంఘం (బీఏసీ)లో నిర్ణయించారు. శాసనసభ సమావేశాలను ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరపాలని నిర్ణయించారు. బీఏసీలో తీసుకున్న నిర్ణయాల మేరకు... '14న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. 15, 16 తేదీలు సెలవులు. 17, 18న బడ్జెట్‌పై చర్చ, 18న ఆర్థిక మంత్రి సమాధానం ఉంటాయి. 19 నుంచి 8 పనిదినాలు డిమాండ్లు, గ్రాంట్లుపై చర్చ ఉంటుంది. 28న శనివారం అయినా అసెంబ్లీ జరుగుతుంది. మార్చి 1, 2, 3 తేదీలు అసెంబ్లీకి సెలవులు. అవసరాన్ని బట్టి అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలని బీఏసీలో నిర్ణయించారు. ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 10 గంటల వరకు... గంటపాటు క్వశ్చన్ అవర్ ఉంటుంది. ఆ తర్వాత అరగంటపాటు జీరో అవర్ నిర్వహించి అరగంట టీ బ్రేక్ ఇస్తారు. తిరిగి 11 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సమావేశాలు జరుగుతాయి. జీరో అవర్‌లో ప్రతి సభ్యుడూ 2 నిమిషాలు మాత్రమే మాట్లాడేలా చూడాలని విప్‌లకు సూచించారు. ఈసారి సారూప్యత కలిగిన శాఖలన్నింటిపైన ఒకే రోజు చర్చ జరిగేలా నిర్ణయం తీసుకున్నారు. దీని కోసం మొత్తం అన్ని శాఖలను 8 గ్రూపులుగా చేశారు. ప్రజాప్రతినిధులకు ఆటల పోటీలు ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో విజయవాడలో, మార్చి 6న ప్రజాప్రతినిధుల సాంస్కృతిక కార్యక్రమాలు రాజధాని అమరావతిలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తారు.'

సభ్యత్వం రద్దవుతుందనే సభకు వచ్చారు: అనిత

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'గవర్నర్‌ను అవమానించేందుకే వైసీపీ సభ్యులు అసెంబ్లీకి వచ్చారు. ఆయన్ను అవమానించి వెళ్లిపోయారు' అని హోం మంత్రి అనిత మండిపడ్డారు. బుధవారం అమరావతి సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'మూడు నెలల్లోపు సభకు హాజరుకాకపోతే సభ్యత్వం రద్దు అవుతుందన్న ప్రచారం ఉంది. ఈ విషయంలో స్పీకర్ కఠినంగా ఉన్నారు. దానిని నిలబెట్టుకునేందుకు, షో చేసేందుకు వైసీపీ సభ్యులు సభకు వచ్చినట్లుంది' అని అన్నారు.

రాష్ట్రం తలదించుకునేలా వైసీపీ వికృత చేష్టలు

- ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, మురళి

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జగన్ అండ్‌కో బ్యాచ్ వికృత చేష్టలు రాష్ట్రం తలదించుకునేలా ఉన్నాయని శ్రీకాళహస్తి, పూతలపట్టు టీడీపీ ఎమ్మెల్యేలు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, మురళి విమర్శించారు. మంగళవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో వారు మాట్లాడారు. పెద్దరికం లేకుండా పెద్దిరెడ్డి వికృత చేష్టలు చేశారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో తిరుపతికి నెయ్యి సరఫరా చేసిన వ్యక్తులే శ్రీకాళహస్తి, కాణిపాకం దేవాలయాలకూ నెయ్యి సరఫరా చేశారని బొజ్జల అన్నారు. మరో ఎమ్మెల్యే మురళి మాట్లాడుతూ నెయ్యిలో జంతుకొవ్వు కలవలేదని జగన్ చెబుతున్నారని, అంటే కొవ్వు కాకపోతే ఏదైనా కలిపేయవచ్చునేది మీ అభిప్రాయమా? అని ప్రశ్నించారు.

పునరుజ్జీవనం నుంచి.. శిఖరాగ్ర దిశగా..

- గవర్నర్ ప్రసంగాన్ని స్వాగతించిన మంత్రి సత్య

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజనతో బాలారిష్టాలు మొదలయ్యాయి. వాటికితోడు వైసీపీ ప్రభుత్వ విధ్వంసక పాలనతో పెను సవాళ్లు ఎదురయ్యాయి. అన్నింటినీ అధిగమిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న సమగ్ర యాగానికి గవర్నర్ ప్రసంగం అద్దం పట్టింది' అని మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యానించారు. పునరుజ్జీవనం నుంచి ఉన్నత శిఖరాల అధిరోహణ అన్న ప్రధాన ఇతివృత్తంతో, దార్శనికుడు సీఎం చంద్రబాబు అలుపెరుగని శ్రమతో, సవాళ్లను అవకాశాలుగా తీసుకుని రాష్ట్రం ముందుకుపోతున్న వైనాన్ని గవర్నర్ కళ్లకు కట్టేలా వివరించారని అన్నారు.


గవర్నర్ ప్రసంగమంతా అబద్ధాలే: వైసీపీ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీలో గవర్నర్‌తో కూటమి ప్రభుత్వం అబద్ధాలు చెప్పించిందని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విమర్శించారు. ప్రభుత్వం చెప్పిన అబద్ధాలు పలకడంపై రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న గవర్నర్ ఆలోచన చేసి ఉండాల్సిందన్నారు. గవర్నర్ ప్రసంగమంతా టీడీపీ ఆఫీస్‌లో రాసిన స్క్రిప్టు అని అభివర్ణించారు. బుధవారం అసెంబ్లీలో ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలో వైసీపీ సభ్యులు గొడవకు దిగి, వాకౌట్ చేశారు. అనంతరం అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, తూమాటి మాధవరావు, బొమ్మి ఇజ్రాయెల్, ఇస్సాక్ బాషా, రామచంద్రారెడ్డి, వరుదు కళ్యాణి, కల్పలతా రెడ్డి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గవర్నర్ ప్రసంగమంతా వాస్తవాలకు వ్యతిరేకంగా ఉందన్నారు.

ఏపీలో ఆర్‌ఆర్‌ఆర్

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిబింబిస్తోందని అన్నారు. "2024లో బాధ్యతలు చేపట్టిన తొలి ఏడాది నుంచే సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేందుకు ఏడాదికి సుమారు రూ.33వేల కోట్లు వ్యయం చేయడం ప్రపంచంలోనే అతిపెద్ద డీబీటీ కార్యక్రమాల్లో ఒకటిగా నిలిచింది. ఎన్టీఆర్ భరోసా కింద 63.12 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం వారికి గౌరవం, భరోసా కల్పిస్తోంది. పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా 66లక్షల మందికి పైగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు నేరుగా ఏడాదికి రూ.15వేలు బదిలీ చేస్తున్నాం. గత స్వాతంత్ర్య దినోత్సవం నుంచి మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు 37.8 కోట్ల ఉచిత బస్సు ప్రయాణాలు కల్పించాం. అన్నదాత సుఖీభవ పథకం కింద 46.86 లక్షల మంది రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థికసాయం అందుతోంది. దీపం 2.0 ద్వారా 1.08 కోట్ల పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తూ కుటుంబ నిర్వహణ భారాన్ని తగ్గిస్తున్నాం. మెగా డీఎస్సీ -2025 ద్వారా 15,941 ఉపాధ్యాయ పోస్టులు, శాంతిభద్రతల పరిరక్షణకు 5,757 కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియను చేపట్టాం. ఆటో డ్రైవర్ల సేవలో పథకం కింద 2.90 లక్షల మంది ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. మత్స్యకార సేవలో కార్యక్రమంలో భాగంగా 1.2 లక్షలకు పైగా మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ సమయంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు సాయం అందుతోంది. ఏప్రిల్ 1నుంచి లక్షకు పైగా చేనేత కుటుంబాలు 200 యూనిట్ల వరకు, మరమగ్గ చేనేత కుటుంబాలు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సదుపాయం పొందుతారు" అని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర పునరుజ్జీవం, ప్రగతి వేగం మనందరి సమష్టి భాగస్వామ్యంపైనే ఆధారపడి ఉన్నాయని తెలిపారు. ప్రజల సహకారం, నిర్మాణాత్మక భాగస్వామ్యం ఉన్నప్పుడే సంస్కరణల ఫలాలు వేగంగా, అందరికీ సమానంగా అందుతాయని, అభివృద్ధి ప్రక్రియలో పౌరులు చురుగ్గా భాగస్వాములైనప్పుడు ప్రగతి మరింత వేగవంతమవుతుందని వివరించారు.



శాశ్వత రాజధానిగా అమరావతి

ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణం కొత్త ఉత్సాహంతో, వేగంగా జరుగుతోందని, దీనికి కేంద్రం నుంచి సహకారం అందుతోందని గవర్నర్ తెలిపారు. అమరావతిని శాశ్వత రాజధానిగా గుర్తించే దిశగా చట్టాన్ని తీసుకొచ్చే ప్రక్రియను కేంద్రం ప్రారంభించిందని చెప్పారు.

గవర్నర్ ప్రసంగంలో ముఖ్యాంశాలు...

- సామాజిక భద్రత, సాధికారితతోనే నిజమైన పునరుద్ధరణ సాధ్యమవుతుందని ప్రభుత్వం గుర్తించింది. అసంపూర్ణ పథకాలకు బదులుగా, ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుస్తూ పేదరికాన్ని నిర్మూలిస్తున్నాం.
- గత ఉగాది రోజున ప్రారంభించిన పీ4 కింద ఇప్పటివరకు లక్షమందికి పైగా మార్గదర్శులు 10.30 లక్షల బంగారు కుటుంబాలను స్వచ్ఛందంగా దత్తత తీసుకున్నారు.
- ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న ఆశయంతో అన్న క్యాంటీన్ కార్యక్రమం సామాజిక సంక్షేమానికి మూలస్తంభంగా కొనసాగుతోంది.
- స్వర్ణాంధ్ర విజన్- 2047 కింద అందరికీ ఇల్లు లక్ష్యంతో గృహనిర్మాణం, పౌష్టికాహార కల్పనపై ప్రధానంగా దృష్టి సారించాం.
- ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లడం ద్వారా రిజర్వేషన్లు, ప్రభుత్వ ఫలాలు ప్రతి ఉపవర్గానికి అందేలా చూస్తున్నాం.
- గిరిజన సమాజాల సామాజిక ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది.. చట్టసభలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవుల్లో వారికి తగిన ప్రాతినిధ్యం కల్పించడానికి కట్టుబడి ఉంది.
- మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, పారదర్శకమైన పాలనను అందించడానికి కఠిన చర్యలు తీసుకుంటున్నాం.
- నేషనల్ క్వాంటమ్ మిషన్ ద్వారా అమరావతిలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించాం.
- వైద్య ఖర్చులు కుటుంబాలను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టకుండా ఉండేలా ఆరోగ్య భద్రతను బలోపేతం చేస్తున్నాం. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డేటా ఆధారిత విధానాల ద్వారా మాతా, శిశు ఆరోగ్యం, పోషణ, వ్యాధి నియంత్రణను మెరుగుపరుస్తున్నాం.
- రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ రూ.2.50 లక్షల సమగ్ర ఆరోగ్య బీమా కల్పించేందుకు ఒక యూనివర్సల్ కవరేజ్ పథకాన్ని ప్రవేశపెడుతున్నాం.
- నాటు సారా తయారీ నుంచి విముక్తి పొందిన రాష్ట్రంగా ఏపీ 2025లో ఒక నిర్ణయాత్మక మలుపుగా నిలిచింది.
- జీ రామ్ జీ చట్టం-2025 అమలు ద్వారా ప్రతి గ్రామీణ కుటుంబానికి 100 నుంచి 125కు ఉపాధి పనిదినాలు పెరిగాయి.
- స్వయం కార్యక్రమం కింద ఈ సంవత్సరం లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.
- విశాఖపట్నం, అమరావతి, తిరుపతిని కేంద్ర బిందువులుగా చేస్తూ మూడు సమీకృత వృద్ధి ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నాం.
- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నాం.
- కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక క్లస్టర్లు సమతుల్య ప్రాంతీయ అభివృద్ధిని బలోపేతం చేస్తున్నాయి.
- రూ.4,498 కోట్ల విద్యుత్తు బకాయిలు భరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంది. ట్రూడౌన్‌తో యూనిట్‌కు 13 పైసల విద్యుత్ చార్జీ తగ్గింది.

లీడర్‌తో ఆత్మీయ భేటీ!

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కుటుంబాలతో సమావేశం
- కొత్త సంప్రదాయానికి లోకేశ్ శ్రీకారం
- నేడు బందరు, రేపు చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాల ప్రజాప్రతినిధులతో భేటీ

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మంత్రి లోకేశ్ కొత్త సంప్రదాయానికి తెరదీశారు. అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో పార్లమెంటు నియోజకవర్గాలవారీగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కుటుంబాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. రోజుకో పార్లమెంటు పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు, వారి కుటుంబాలతో పాటు ఆ పార్లమెంటు పరిధిలో ఎవరైనా ఎమ్మెల్సీ ఉంటే వారి కుటుంబంతోనూ లోకేశ్ సమావేశం కానున్నారు. ప్రతి రోజూ రాత్రి ఏడు గంటల నుంచి ఉండవల్లిలోని లోకేశ్ నివాసంలో ఈ ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ సమావేశాల ద్వారా.. నేతల యోగక్షేమాలు, సమస్యలు తెలుసుకోవడంతోపాటు వారి కుటుంబ సభ్యుల మంచిచెడులను తెలుసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

అసెంబ్లీలో పవన్‌తో లోకేశ్ భేటీ

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. బుధవారం అసెంబ్లీకి వచ్చిన వెంటనే పవన్ కల్యాణ్ చాంబర్‌కు వెళ్లిన లోకేశ్ ఆయనతో అరగంటపాటు సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలు, గవర్నర్ ప్రసంగం తదితర అంశాలపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. చివరిలో శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ కూడా వీరితోపాటు సమావేశంలో పాల్గొన్నారు.



డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ ఆత్మీయ ఆలింగనం

బాధ్యతాయుతంగా ఉండండి



క్యాబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, అచ్చెన్న, అనిత తదితరులు

ఏది పడితే అది మాట్లాడొద్దు

- మంత్రులకు ముఖ్యమంత్రి నిర్దేశం
- సబ్జెక్ట్ తెలియకపోతే తెలుసుకుని మాట్లాడండి
- అమరావతిలోనే ఎడ్యుకేషన్ సిటీ, హెల్త్ సిటీ
- సోలార్ ప్లాంట్ల లీజులతో 'అసైన్డ్'కు ఆదాయం
- అసైన్డ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించండి
- క్యాబినెట్ సమావేశంలో చంద్రబాబు వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మంత్రులు బాధ్యతాయుతంగా ఉండాలని, ఏది పడితే అది మాట్లాడవద్దని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం రాష్ట్ర మంత్రి మండలి సమావేశం జరిగింది. ఎజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులకు ఆయన అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన పద్ధతులు, ఇతర అంశాలపై దిశానిర్దేశం చేశారు. మంత్రులు మాట్లాడేటప్పుడు సబ్జెక్టు మీద అవగాహనతో మాట్లాడాలని, విషయం తెలియకపోతే తెలుసుకుని అవగాహన చేసుకుని మాట్లాడాలని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఈ మార్పు స్పష్టంగా కనబడాలని కోరారు. కేవలం ఎమ్మెల్యేలకే కాకుండా ఐదు కోట్ల మంది ప్రజలకు సమాధానం ఇస్తున్నామని భావిస్తూ, స్పందించాలన్నారు. మంత్రులందరూ అసెంబ్లీకి వచ్చే ముందు తాము సమాధానాలు చెప్పాల్సిన అంశాలపై సంపూర్ణ అవగాహనతో రావాలని కోరారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అసెంబ్లీలో, ఆ తర్వాత సాయంత్రం వరకు మీ పేషీలో ఉండి, ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇన్‌చార్జి మంత్రులు జిల్లాలకు వెళ్లినప్పుడు ఆ జిల్లాల్లో అమలవుతున్న అన్ని శాఖల ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా సమీక్ష చేయాలని కోరారు. ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి పనులనన్నింటినీ సమీక్షించి, నిర్దేశిత సమయంలో అవి పూర్తయ్యేలా ఫాలో అప్ చేయాలన్నారు. అసైన్డ్ భూములను సోలార్ ప్రాజెక్టులకు లీజుకు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని, తద్వారా ఆ భూముల లబ్ధిదారులకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. బడ్జెట్‌లో ప్రకటించిన హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీని అమరావతిలోనే ఏర్పాటు చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం నివాళి

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యే ముందు సీఎం చంద్రబాబు వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

11న 11 మంది 11 నిమిషాలు ఉండి పోయారుగా!

వైసీపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ సరదా వ్యాఖ్య

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం ముగిసిన తర్వాత ఆయనకు వీడ్కోలు పలికి తిరిగి వచ్చే సమయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు లాబీల్లో ఉన్న మీడియాను పలకరించారు. ఈ సందర్భంగా వైసీపీ ఎమ్మెల్యేలు రావడంపై స్పందించాల్సిందిగా మీడియా కోరగా..ఏ ముంది 11న (బుధవారం) 11 మంది వచ్చి 11 నిమిషాలు ఉండి వెళ్లిపోయారుగా.. అంతేనా.. అంతకు మించి ఏమైనా జరిగిందా ?" అని సరదాగా స్పీకర్ వ్యాఖ్యానించారు. సభ్యులు పార్టీల కతీతంగా సభా సంప్రదాయాలు పాటిస్తే బాగుంటుందన్నారు. అసెంబ్లీలో ఏఐ ఆధారిత అటెండెన్స్ మంచి ఫలితాలను ఇస్తుందని ఆశిస్తున్నానని చెప్పారు. పెద్ద పెద్ద కంపెనీల సీఈవోలే బయోమెట్రిక్ వాడుతున్నారని, పార్లమెంటులో కూడా త్వరలో ఏఐ ఆధారిత అటెండెన్స్ తీసుకు రానున్నారని తెలిపారు. అమరావతిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాస సముదాయాలకు ఏప్రిల్ నెలాఖరులో గృహ ప్రవేశాలు చేయాలని భావిస్తున్నామన్నారు.

ఎవరో ఉద్దేశపూర్వకంగా రాసిన లేఖే

'మావోయిస్టు' లేఖపై మంత్రి దుర్గేశ్ వ్యాఖ్య

మావోయిస్టుల పేరుతో వచ్చిన లేఖ చూసి తన కుటుంబ సభ్యులు ఆందోళన చెందారని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. బుధవారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడుతూ.. ఈ లేఖను ఎవరో ఉద్దేశపూర్వకంగా రాసినట్లు ఉందని, మావోయిస్టుల లేఖలు ఇలా ఉండే అవకాశం లేదన్నారు. "లేఖ విషయం తెలిసి కుటుంబ సభ్యులతోపాటు చాలా మంది ఫోన్లు చేశారు. నేను పనిచేసేది టూరిజం లాంటి చిన్న శాఖ. వ్యక్తిగతంగా గానీ, శాఖాపరంగాగానీ నేను ఎప్పుడూ తప్పు చేయబోను" అని స్పష్టంచేశారు.

ఏం నేర్చుకుంటున్నాం?: శ్రీశైలం ఘటనపై సీఎం సీరియస్

శ్రీశైలంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారని సీఎం వ్యాఖ్యానించారు. "తిరుపతి తొక్కిసలాట తర్వాత కూడా అదే తరహా సంఘటన జరగడం సరికాదు. వీటినుంచి మనం ఏం నేర్చుకుంటున్నాం?" అని ప్రశ్నించారు. క్యూ లైనులో ఊపిరాడక పోవడంతో పెద్ద వయసు స్వాములను బయటకు తీసుకొచ్చే క్రమంలో పరిస్థితి అదుపు తప్పిందని హోం మంత్రి అనిత సీఎంకి చెప్పే ప్రయత్నం చేశారు. "ఆ విషయాన్ని పోలీసులు క్యూలైనులో ఉన్న వారికి తెలియజేయాలి కదా! ఏం జరుగుతుందో మైకులో పోలీసులు వివరించి ఉంటే భక్తులు అనవసర అపోహలకు గురి అయ్యేవారు కాదు. పరిస్థితి అదుపు తప్పేది కాదు కదా" అని సీఎం వ్యాఖ్యానించారు.

బీసీలంటే వైసీపీ నేతలకు చులకన: టీడీపీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): బీసీలంటే వైసీపీ నేతలకు చులకనభావమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు విమర్శించారు. టీటీడీ ఈవోగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బీసీ సామాజికవర్గానికి చెందిన ముద్దాడ రవిచంద్ర పట్ల వైసీపీ నేత భూమన చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనమన్నారు. 'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు బీసీలకు ప్రాధాన్యమిస్తున్నారు. వైసీపీ నేతలు మాత్రం బీసీలను తీవ్రంగా అవమానిస్తున్నారు. అవినీతి కేసుల్లో అరెస్టయిన భూమన ఒక ఐఏఎస్ అధికారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గం. వెంటనే క్షమాపణలు చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

అలా వచ్చారు.. ఇలా వెళ్లారు!

- 9.59 గంటలకు అసెంబ్లీలోకి జగన్ అండ్ కో
- గవర్నర్ ప్రసంగిస్తుండగా అబద్ధాలు చదువుతున్నారని నినాదాలు
- 10.10 గంటలకే వాకౌట్

11వ తేదీ.. 11 మందితో 11 నిమిషాలు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని మొండికేస్తున్న మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ఎట్టకేలకు సభకు హాజరయ్యారు. అయితే అలా వచ్చి.. ఇలా వెళ్లారు. రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమైన బుధవారం (ఫిబ్రవరి 11).. ఆయన తనతో పాటు 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలతో, పార్టీ ఎమ్మెల్సీలతో వెలగపూడిలోని అసెంబ్లీకి చేరుకున్నారు. పార్టీ శ్రేణులు, సొంత మీడియా ప్రతినిధులు అక్కడ సిద్ధంగా ఉంచిన ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేస్తూ ర్యాలీగా సభలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని అసెంబ్లీ ప్రాంగణం వరకూ అనుమతించిన సెక్యూరిటీ.. సభలోకి ప్లకార్డులు అనుమతించలేదు. దీంతో వాటిని అక్కడే వదిలేసి సరిగ్గా 9.59 గంటలకు సభలోకి చేరుకున్న జగన్, ఆయన పార్టీ సభ్యులు.. 10.10కు అంటే కేవలం 11 నిమిషాల్లోనే బయటకు వెళ్లిపోయారు. ఏడాదిన్నర క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ తరపున జగన్ సహా 11 మంది మాత్రమే గెలిచిన సంగతి తెలిసిందే. ప్రతిపక్ష హోదా కోసం అవసరమైన 18 స్థానాలు కూడా ఆ పార్టీకి రాకపోవడంతో ప్రతిపక్ష హోదా దక్కలేదు. దిక్కుతోచని జగన్ సభకు రానంటూ భీష్మించుకున్నారు. పలు వర్గాల నుంచి ఆరోపణలు రావడంతో పాటు సభకు వరుసగా 60 రోజులు రాకపోతే సభ్యత్వం రద్దయ్యే ప్రమాదం ఉండడంతో జగన్ తన ఎమ్మెల్యేలతో కలిసి వచ్చారు. అసెంబ్లీ బయట ఆయన వాహనం ఆపి.. అప్పటికే అక్కడకు చేరుకున్న పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ప్లకార్డులు పట్టుకుని ర్యాలీగా ముందుకు సాగారు. 'ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వరు' అనే ప్లకార్డు ఆయన స్వయంగా పట్టుకోగా.. 'సమస్యలు ప్రస్తావించనీయరు..', 'శాంతిభద్రతలు కాపాడాలి..', 'మెడికల్ కాలేజీల నిర్మాణం పీపీపీ పద్ధతిలో వద్దు..' అంటూ ఇతర సభ్యులు ప్లకార్డులు చేతబూనారు. నాలుగో నంబర్ గేటు వద్ద.. ప్లకార్డులకు అనుమతి లేదని భద్రతాసిబ్బంది చెప్పడంతో వాటిని అక్కడే వదిలేసి లోపలకు వెళ్లారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తుండగా.. అబద్ధాలు చదువుతున్నారంటూ నినాదాలు చేశారు. పోడియం వద్దకు వెళ్లి పేపర్లు చించి విసిరేశారు. గవర్నర్ అవేవీ పట్టించుకోకుండా తన ప్రసంగాన్ని కొనసాగించడంతో.. సరిగ్గా 11 నిమిషాల తర్వాత జగన్, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ నుంచి వాకౌట్ చేశారు. జగన్ నేరుగా తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిపోగా.. ఆ పార్టీ సభ్యులు ప్రాంగణంలోనే ఆగి మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, కూటమి నేతలు గవర్నర్‌తో అబద్ధాలు చెప్పించారని ఆరోపించారు. కాగా.. సభ్యత్వం రద్దవుతుందన్న భయంతోనే జగన్ అండ్ కో సభకు వచ్చారని కూటమి ఎమ్మెల్యేలు లాబీల్లో చర్చించుకున్నారు.



సభకు ప్లకార్డులతో వస్తున్న జగన్, పెద్దిరెడ్డి, వైసీపీ ప్రజాప్రతినిధులు

ప్రతిపక్ష హోదా కోసం జగన్ తపన!!

ప్రధాన ప్రతిపక్ష నేత హోదా కోసం జగన్మోహన్‌రెడ్డి ఎంతగా తపించిపోతున్నారో బుధవారం మరోసారి బహిర్గతమైంది. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలన్న ప్లకార్డును అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన స్వయంగా ప్రదర్శించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. శాసనసభలో తగిన సంఖ్యాబలం (18 సీట్లు) లేనిదే ఆ హోదా ఇవ్వరన్న నిజం తెలిసీ ఆయన పదేపదే హడావుడి చేస్తున్నారని రాజకీయ వర్గాలు ఆక్షేపిస్తున్నాయి. ప్రత్యేక హోదా కోసమో, తిరుమల లడ్డూ కల్తీ, ఇతర ప్రజా సమస్యలపై చర్చకు డిమాండ్ చేయడం కాకుండా.. తనకు పదవి ఇవ్వాలని ప్లకార్డు పట్టుకోవడమేంటని ఎద్దేవాచేస్తున్నాయి. శాసన మండలిలో వైసీపీకి సంఖ్యాబలం ఉంది గనుకే సీనియర్ నేత బొత్స సత్యనారాయణకు అక్కడ ప్రతిపక్షనేతహోదా దక్కిందని,పైగా మండలిలోపార్టీ నేతగా జగనే ఆయన్ను నియమించారని గుర్తుచేస్తున్నాయి

నేడు వైసీపీ శాసనసభాపక్ష సమావేశం..

గురువారం మధ్యాహ్నం 2 గంటలకు తాడేపల్లి ప్యాలెస్‌లో జగన్ అధ్యక్షతన వైసీపీ శాసనసభాపక్ష సమావేశం జరుగనుంది. ఇందులో కూడా.. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే సభకు వస్తానంటూ ఆయన పునరుద్ఘాటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

ప్రైవేటు వర్సిటీల్లో ఫీజులకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు యూనివర్సిటీల్లో కన్వీనర్ కోటా కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఫీజుల కష్టాలు తొలగనున్నాయి. 2024-25, 2025-26 విద్యా సంవత్సరాల్లో ప్రైవేటు యూనివర్సిటీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తింపును పొడిగిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రైవేటు యూనివర్సిటీల్లో 35శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీచేసేలా గత ప్రభుత్వం ప్రైవేటు యూనివర్సిటీల చట్టంలో సవరణలు చేసింది. అయితే ఫీజుల చెల్లింపుపై స్పష్టతను విస్మరించింది. ఫలితంగా ప్రతి సంవత్సరం ఫీజుల విడుదలకు ప్రత్యేకంగా అనుమతుల జీవో ఇవ్వాల్సి వస్తోంది. ఆ జీవో జారీలో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల ఆ విద్యార్థులకు ఫీజులు నిలిచిపోయాయి. తాజా ఉత్తర్వులతో ప్రభుత్వం ఫీజులు విడుదల చేయనుంది.

టెన్త్ పరీక్షలకు 25శాతం మంది ప్రైవేటు టీచర్లు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో పాఠశాల విద్యాశాఖ కొన్ని మార్పులు చేసింది. ఇప్పటివరకూ ప్రభుత్వ, ప్రైవేటు అన్ని పాఠశాలల్లో ప్రభుత్వ టీచర్లే ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. దీనివల్ల ప్రభుత్వ పాఠశాలల్లో బోధన కుంటుపడుతోందని భావించిన పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది నుంచి 25శాతం మంది ప్రైవేటు టీచర్లను ఇన్విజిలేటర్లుగా తీసుకోనుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ టెన్త్ పరీక్షల నిర్వహణపై నిబంధనలు రూపొందించింది. ఈఏడాది నుంచి ఇన్విజిలేటర్ల నియామకానికి ఆటోమేషన్ విధానం తీసుకొస్తోంది. నిబంధనల ప్రకారం ఆన్‌లైన్ విధానంలోనే ఇన్విజిలేటర్ల బాధ్యతల కేటాయింపు జరుగుతుంది. ఏప్రిల్ 4 నుంచి పది రోజుల పాటు జవాబు పత్రాల మూల్యాంకనం జరుగుతుంది. ఈ ఏడాది నుంచి మూల్యాంకనం కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేయనున్నారు.

టీచర్ల అంతర్‌జిల్లాల బదిలీలు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల అంతర్‌జిల్లాల బదిలీలకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జీవిత భాగస్వామి (స్పౌజ్ గ్రౌండ్స్) పరిశీలనలో 22 మందికి, పరస్పర అంగీకార విధానంలో ఇద్దరి బదిలీలకు అనుమతించినట్లు అందులో పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం కొత్త జిల్లాల్లో అందరు టీచర్ల తర్వాత చివరి ర్యాంకులో వీరు ఉంటారని తెలిపారు. జిల్లాల్లో అవసరాలకు అనుగుణంగా వీరిని 3, 4 కేటగిరీల్లోని పాఠశాలల్లో నియమించాలని స్పష్టంచేశారు.

'ఎయిడెడ్ పాఠశాలల'పై త్వరలో వర్క్‌షాప్

ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణపై త్వరలో వర్క్‌షాప్ నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాలసీ విధానాలు, సిబ్బంది నియామకాలు, నిబంధనలపై ఇందులో చర్చించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 739 పాఠశాలల్లో 7532 పోస్టులుండగా 4719 ఖాళీలున్నాయి. సుమారు 80వేల మంది విద్యార్థులు పాఠశాలల్లో చదువుతున్నట్లు యాజమాన్యాలు చూపుతున్నాయి. అయితే అంతమంది విద్యార్థులు లేరనే ఆరోపణల నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలి

విజయవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల(ఎస్జీటీ)కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న పాఠశాల సహాయకులకు కూడా ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

మోహన్‌బాబు వర్సిటీపై చర్యలు తీసుకోవాలి

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీపై చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్య పర్యవేక్షణ, నియంత్రణ కమిషన్‌ను ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె.ప్రసన్నకుమార్, ఉపాధ్యక్షుడు బి.రవి బుధవారం తాడేపల్లిలోని కార్యాలయంలో కమిషన్ సభ్య కార్యదర్శి సూర్యచంద్రరావుకు వినతిపత్రం అందజేశారు.



కూటమికి చెందిన ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై డిప్యూటీ సీఎం పవన్, బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు

కలిసికట్టుగా 'కూటమి'

(మొదటి పేజీ తరువాయి)

నేడు కూటమి బలం, ప్రజల మద్దతు మరింత పెరిగాయి. ఎన్నికల ముందు ఏ స్ఫూర్తితో పనిచేశామో, అదే స్ఫూర్తితో ముమ్మందు కూడా పనిచేయాలి. మూడు పార్టీలూ ఐక్యంగా ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే పరిస్థితి ఉండాలి. గుజరాత్‌లో వరుసగా ఐదుసార్లు బీజేపీ గెలిచి అధికారంలో కొనసాగుతోంది. అదే స్ఫూర్తితో ఇక్కడా విజయాలు సొంతం చేసుకోవాలి. శాశ్వతంగా రాజకీయాల్లో నిలబడేలా అందరూ మంచి పేరు తెచ్చుకోవాలి" అని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలు తమ వ్యక్తిగత కక్షలను ప్రస్తావించేందుకు అసెంబ్లీని వేదికగా చేసుకోవద్దని సీఎం చంద్రబాబు సూచించారు. 'సభలో మనం మాట్లాడే ప్రతి మాటా 5కోట్ల మంది ప్రజలు వింటున్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోండి. సభకు వైసీపీ వారు వచ్చారా లేదా అన్నది లెక్క కాదు. మనం ప్రజలకు జవాబుదారీగా ఉండాలనే విషయాన్ని సభ్యులందరూ గుర్తుంచుకోవాలి' అని హితవుపలికారు. అసెంబ్లీ సమావేశాలను సభ్యులందరూ సీరియస్‌గా తీసుకోవాలని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సభ్యులు అంతా సభలోనే ఉండాలని స్పష్టం చేశారు. తాను కూడా సభను పూర్తిగా ఫాలో అవుతానని, సభలో సబ్జెక్టుపై అర్థవంతమైన చర్చలు జరగాలని స్పష్టం చేశారు. సభలో ఆవు కథలు మాట్లాడవద్దని.. అడిగే ప్రతి అంశమూ అర్థవంతంగా ఉండాలని అన్నారు. అనుకున్న విషయాన్ని 3-5 నిమిషాల్లో చెప్పేలా ప్రతి సభ్యుడూ సన్నద్ధమై రావాలని సూచించారు. తాను ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు సభకు వచ్చి ముగిసేవరకు ఉంటానని.. ప్రతి సభ్యుడు, మంత్రి మాట్లాడే అంశాలను నోట్ చేసుకుంటానన్నారు.

సబ్జెక్టు పెంచుకోండి..

మంత్రులు, ఎమ్మెల్యేలు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలని సీఎం సూచించారు. తనకు టెక్నాలజీ గురించి లోతుగా తెలియదని.. కానీ దాని వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో బాగా తెలుసుకుంటానని.. అదే మనకు ఆ అంశంపై అవగాహన కలిగిస్తుందని అన్నారు. 'క్వాంటమ్‌పై మన రాష్ట్రంలో కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని కోరితే 1.60 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఐఐటీ-మద్రాస్ ఈ కోర్సుపై దరఖాస్తులు ఆహ్వానిస్తే మొత్తం 2.50 లక్షల దరఖాస్తులు వచ్చాయి. వాటిలో మన రాష్ట్రం వారివే 1.10 లక్షలు ఉన్నాయి' అన్నారు. ఇక జిల్లాల వారీగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎస్పీ, కలెక్టర్‌తో ఉమ్మడి సమావేశం నిర్వహిస్తామని.. పొలిటికల్ గవర్నెన్స్‌లో భాగంగా ఎమ్మెల్యేల గౌరవాన్ని పెంచుతామని సీఎం చెప్పారు. నియోజకవర్గాల్లో పెండింగ్ పనులు గుర్తిస్తే ప్రాధాన్య క్రమంలో వాటిని పూర్తి చేద్దామన్నారు. 'మనం చేసే అభివృద్ధి కార్యక్రమాలు మంచి ఫలితాలిస్తున్నాయి. రాష్ట్రం ఇంకా పూర్తిగా కోలుకోలేదు. కానీ వ్యవస్థలను గాడిన పెట్టాం' అని చెప్పారు.

కేంద్ర సాయంతోనే పురోగతి..

ఎన్నికల్లో చెప్పిన అన్ని పథకాలను అమలు చేస్తున్నామంటే కేంద్రం ఎంతో సహకారం అందించబట్టే అది సాధ్యమవుతోందని సీఎం తెలిపారు. అందుకే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని గాడిన పెట్టగలిగామన్నారు. 'కేంద్రం అమరావతి, పోలవరానికి డబ్బులు ఇవ్వకపోయి ఉంటే ఆ ప్రాజెక్టులు మళ్లీ గాడిన పడేవి కావు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేయబోతున్నామంటే కేంద్రం అందిస్తున్న సాయమే కారణం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను దాని సాయంతోనే నిలబెట్టాం. మన రాష్ట్రం కోసం కేంద్రం తన పాలసీనే మార్చుకుని స్టీల్‌ప్లాంట్‌కు సాయం చేసింది. దీంతో చాలాకాలం తర్వాత ఉక్కు ఫ్యాక్టరీ రూ.54 కోట్ల లాభాలు ఆర్జించగలిగింది. స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు ఇదే స్థాయిలో పనిచేస్తే దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిలుస్తుంది. విజయవాడ, విశాఖ నడుమ హైస్పీడ్ రైలు కావాలని కేంద్రాన్ని కోరాం. అది కూడా త్వరలో సాకారమయ్యే అవకాశముంది. రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు.. రూ.90వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. వీటన్నిటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి' అని కోరారు.

తమ అరాచకాలు మరిచారు..

ప్రస్తుత సమావేశంలో ఉన్న 90 శాతం మంది వైసీపీ ప్రభుత్వ బాధితులేనని సీఎం అన్నారు. 'నేడు నీతులు చెబుతున్న వైసీపీ నేతలు.. నాడు అధికారంలో తాము చేసిన అరాచకాలను మరచిపోయారు. వారి హయాంలో పవన్ కల్యాణ్ విశాఖ వెళ్తే కారు కూడా దిగనివ్వలేదు. హోటల్ గది నుంచి బయటకు కూడా రానివ్వకుండా అడ్డుకున్నారు. నా అరెస్టు సమయంలో మద్దతుగా పవన్ హైదరాబాద్ నుంచి వస్తుంటే అనేక అడ్డంకులు సృష్టించారు. ఇలా అనేక సవాళ్లను.. ఇబ్బందులను ఎదిరించి కూటమి ఐక్యంగా నిలబడి ఎన్నికల్లో గెలిచింది' అని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి రంగంలోనూ వృద్ధి నమోదైందని, విధ్వంసం నుంచి వికాసం దిశగా రాష్ట్రం పురోగతి సాధిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం 20 నెలల పాలనలో సాధించిన విజయాలు, చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అతి తక్కువ కాలంలో జనం మెచ్చే పాలన అందించామని, వారి అవసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే ఈ విజయాలను, ప్రభుత్వ కార్యక్రమాలను వివరించాలని కోరారు. గవర్నర్ ప్రసంగం కూడా అదే విధంగా సాగిందన్నారు.

అన్ని మతాలనూ గౌరవిస్తాం..

కూటమి ప్రభుత్వం ఎవరి మతవిశ్వాసాలను, భక్తుల సెంటిమెంటును దెబ్బతీయదని చంద్రబాబు స్పష్టం చేశారు. అన్ని మతాలను గౌరవిస్తుందన్నారు. వైసీపీ హయాంలో హిందూ ఆలయాలపై ప్రణాళిక ప్రకారం దాడులు జరిగాయని గుర్తుచేశారు. జగన్‌కు దేవాలయాలంటే గౌరవం లేదని, అందుకే రామతీర్థం సహా అనేక ఆలయాలపై దాడులు జరిగాయని అన్నారు. తిరుమల శ్రీవారి లడ్డూతోపాటు ఎక్కడ వీలైతే అక్కడ కల్తీకి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు.

40 మంది ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదు

టీడీపీ ఎమ్మెల్యేలందరూ దాదాపు మంచి పనితీరు కనబరుస్తున్నారన్న సీఎం.. 40 మంది ఎమ్మెల్యేల పనితీరుపై మాత్రం అసహనం వ్యక్తం చేశారు. వారి తీరు ఆశించిన స్థాయిలో లేదని.. వారిని ఈ అసెంబ్లీ సమావేశాల సమయంలోనే వ్యక్తిగతంగా పిలిపించి మాట్లాడతానని చెప్పారు.

15 ఏళ్లు కలిసి ప్రయాణించాల్సిందే

- కూటమి ఎమ్మెల్యేలు తప్పు చేయొద్దు: పవన్

కూటమి ఎమ్మెల్యేలెవరూ తప్పు చేయవద్దని, మనం చేసే తప్పు విపక్షానికి అవకాశం కాకూడదని పవన్ కల్యాణ్ అన్నారు. 'మనం ఏ స్ఫూర్తితో కలిశామో దానికి నష్టం కలిగించేలా ఎవ్వరూ పనిచేయొద్దు. 15 ఏళ్లపాటు మనం కలిసి ప్రయాణం చేయాల్సిందే. మన మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.. అందరం అప్రమత్తంగా ఉండి అడ్డుకోవాలి' అని స్పష్టంచేశారు. వైసీపీ ఐదేళ్ల విధ్వంసాన్ని అధిగమించి, 20 నెలల్లోనే ప్రగతి వైపు రాష్ట్రాన్ని తీసుకెళ్తున్నామని అన్నారు.

కాంట్రాక్టర్లకు అడ్వాన్సులు చెల్లించింది మేం కాదు

- షోకాజ్ నోటీసులపై చర్యలు నిలిపివేయండి
- హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని కలిసిన ఇంజనీర్లు
- నెల్లూరు నుంచి మూడు బస్సుల్లో వచ్చి వినతిపత్రం

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్లకు ముందుగానే అడ్వాన్సులు చెల్లించిన వ్యవహారంలో తమ పాత్ర ఏమీ లేదని.. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న హౌసింగ్ ఇంజనీర్లు స్పష్టం చేశారు. తమ ప్రమేయం లేకుండానే రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం నుంచి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి, వారి ఖాతాల నుంచి కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి బదిలీ అయ్యేలా ఏర్పాట్లు చేసుకుని చెల్లింపులు చేశారని వివరించారు. గృహనిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, అప్పటి హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లాల జాయింట్ కలెక్టర్లు, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్లు ప్రతి దశలోనూ తమకు జారీ చేసిన సూచనలు, ఆదేశాల మేరకు పేదల ఇళ్ల నిర్మాణ దశలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడం వరకే తమ పాత్ర పరిమితమని వారు వివరించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నివేదికను చూపిస్తూ ఉన్నతాధికారులు తమకు షోకాజ్ నోటీసులు జారీ చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. నెల్లూరు జిల్లాలో ఈ షోకాజ్ నోటీసులు అందుకున్న హౌసింగ్ ఏఈలు, డీఈలు, డీఈఈలు, ఈఈలు, పదవీ విరమణ చేసిన ఇంజనీర్లు బుధవారం మూడు బస్సుల్లో విజయవాడకు వచ్చి హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పి.అరుణ్‌బాబును కలిసి మాట్లాడారు. తమకు ఇచ్చిన షోకాజ్ నోటీసులపై తదుపరి చర్యలను నిలిపివేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. అనంతరం గృహనిర్మాణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్‌ను కలిసి తమ గోడు వినిపించారు. తమను బాధ్యులను చేస్తూ షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదని చెప్పారు. షోకాజ్ నోటీసులు జారీ అయిన రిటైర్డ్ ఇంజనీర్లకు రావలసిన బెనిఫిట్స్‌ను పూర్తిగా ఆపేశారని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. కాగా... క్షేత్రస్థాయిలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం సమగ్ర విచారణ చేపట్టి ఇచ్చిన నివేదిక ఆధారంగానే తాము షోకాజ్ నోటీసులు జారీ చేశామని, వాటికి తగిన వివరణలు ఇస్తే సమస్యలన్నీ తొలగిపోతాయని హౌసింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, ఎండీ అరుణ్‌బాబు వారికి నచ్చజెప్పి పంపించారు.

రేపే బార్ కౌన్సిల్ ఎన్నికలు.. పోటీలో 143 మంది

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఏపీ బార్ కౌన్సిల్‌కు శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. గతంలో ఎన్నడూలేని విధంగా 143 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర వ్యాప్తంగా 148 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత ఎన్నికల్లో గెలిచిన 25మంది సభ్యుల్లో 19మంది తిరిగి పోటీ చేస్తున్నారు. ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో మహిళలకు 30శాతం ప్రాతినిధ్యం కల్పించడంతో ఎన్నికల బరిలో ఉన్న మహిళ న్యాయవాదుల సంఖ్య ఎక్కువగా ఉంది. బార్ కౌన్సిల్‌కు 25మంది సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. అడ్వొకేట్ జనరల్ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా వ్యవహరిస్తారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు.

వక్ఫ్ బోర్డులో క్రమశిక్షణ చర్యలు

- ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు
- విధి నిర్వహణలో తప్పిదాలు సహించబోం: చైర్మన్ అబ్దుల్ అజీజ్

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వక్ఫ్ బోర్డులో ఇద్దరు ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ కేఎండీ అలీం, జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ ఇమ్రాన్‌లను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. పూర్తిస్థాయి విచారణ అయ్యేవరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ అబ్దుల్ అజీజ్ వక్ఫ్ బోర్డు అధికారులు, ఉద్యోగులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, పరిపాలనలో పారదర్శకత, విధి నిర్వహణలో క్రమశిక్షణ అంశాలపై సమగ్రంగా చర్చించారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ ఉల్లంఘనలకు సంబంధించిన అంశాలపై ప్రాథమిక పరిశీలనలో భాగంగా ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. వక్ఫ్ ఆస్తులు పవిత్రమైన అమానత్ అని, వాటి పరిరక్షణలో బాధ్యతారాహిత్యాన్ని, విధి నిర్వహణలో తప్పిదాలను సహించబోమని చైర్మన్ స్పష్టం చేశారు. కొందరు ఉద్యోగుల పనితీరు మార్చుకోవాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమగ్ర భారత నిర్మాణం... దీన్‌దయాళ్ ఆశయం: వల్లూరు జేపీ

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సమగ్ర, సమైక్య భారత నిర్మాణానికి బీజేపీ సిద్ధాంత కర్త పండిట్ దీన్‌దయాళ్ మార్గదర్శకులని బీజేపీ ఏపీ ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాశ్ అన్నారు. దీన్‌దయాళ్ వర్ధంతి సందర్భంగా విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో 'సమర్పణ దివస్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయప్రకాశ్ మాట్లాడుతూ... 'ఏకాత్మ మానవతా వాదంతో దేశ యువతలో స్ఫూర్తి నింపిన మహనీయుడు పండిట్ దీన్‌దయాళ్. ఆయన పేదరికంలో పుట్టారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయారు. అయినా ఎక్కడా విలువలు కోల్పోకుండా పండిట్ జీవించారు. క్రమశిక్షణతో కూడిన ఆయన వ్యక్తిత్వం బీజేపీ శ్రేణులకు ఆదర్శప్రాయం' అని అన్నారు. పార్టీ నాయకుడు అడ్డూరి శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

మెడికల్, ఫార్మా మాఫియాపై 14న సీపీఐ ఆందోళనలు

- పోస్టర్ ఆవిష్కరించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మెడికల్, ఫార్మా రంగాల్లో మాఫియా ఆగడాలను అరికట్టాలన్న డిమాండ్‌తో ఈనెల 14న రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సీపీఐ పిలుపునిచ్చింది. వివిధ డిమాండ్లతో రూపొందించిన పోస్టర్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య బుధవారం విజయవాడలోని తమ పార్టీ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 'నకిలీ మందుల వ్యాపారంతో ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న మెడికల్, ఫార్మా మాఫియాను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. వైద్య విద్యను అభ్యసించిన నిరుద్యోగ యువత, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రజలు ఈ ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలి' అని పిలుపునిచ్చారు.

'లాటరీ' కేసులో నేడు కోర్టుకు అంబటి

- గుంటూరు కోర్టులో సత్తెనపల్లి పోలీసుల పీటీ వారెంట్
- 22లోగా హాజరు పరచాలని కోర్టు ఆదేశం
- సీఐని బెదిరించిన కేసులో బెయిల్ మంజూరు

గుంటూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి వైసీపీ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు బెయిల్‌పై విడుదల విషయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం ఆయన రిమాండ్‌లో ఉన్న కేసులో బుధవారం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే అదే సమయంలో మరో కోర్టులో పల్నాడు జిల్లా సత్తెనపల్లి టౌన్ పోలీసులు పీటీ వారెంట్ జారీ చేయడంతో ఈ నెల 22లోగా అంబటిని హాజరు పరచాలని కోర్టు ఆదేశించింది. సీఎం చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన కేసులో రిమాండ్ విధించడంతో అంబటిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. గతంలో పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐని బెదిరించి, దూషించిన కేసులో పోలీసులు కోర్టులో పీటీ వారెంట్ దాఖలు చేశారు. మూడు రోజుల క్రితం పోలీసులు అంబటిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. ఈ కేసులో బుధవారం గుంటూరులోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే 2023లో సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఉన్న అంబటి రాంబాబు సంక్రాంతి సంబరాల పేరుతో రూ.100 చొప్పున లాటరీ టికెట్లు విక్రయించారు. దీనిపై జనసేన గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు గుంటూరులోని ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా అంబటిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని సత్తెనపల్లి పోలీసులను ఆదేశించింది. దీంతో 2023 జనవరి 16న సత్తెనపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నెంబర్ 8/23 గా ఐపీసీ 420, 506, 109, 267తో పాటు మనీ సర్క్యులేషన్ స్కీమ్‌కు సంబంధించి సెక్షన్ 5 ప్రకారం కేసు నమోదు చేశారు. ఈ కేసులో 14 మందిని విచారించిన అనంతరం పోలీసులు చార్జిషీట్ సిద్ధం చేశారు. ఇందులో 420, 267 సెక్షన్లు నాన్ బెయిలబుల్ కావడంతో సత్తెనపల్లి టౌన్ పోలీసులు బుధవారం గుంటూరులోని ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో వారంట్ దాఖలు చేశారు. దీంతో నిందితుడైన అంబటిని ఈ నెల 22లోగా కోర్టులో హాజరు పరచాలని న్యాయాధికారి కుముదిని ఆదేశించారు.



89 మంది మైనర్లపై టీచర్ లైంగిక దాడి

- భారత్ సహా 9 దేశాలకు చెందిన బాధితులు
- ఫ్రాన్స్‌లో ఐదు దశాబ్దాలు కొనసాగిన దురాగతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: భారత్ సహా 9 దేశాలకు చెందిన కనీసం 89 మంది మైనర్లపై లైంగిక దాడికి పాల్పడిన మాజీ ఉపాధ్యాయుడు ఫ్రాన్స్‌లో విచారణను ఎదుర్కొంటున్నాడు. మరింతమంది బాధితులు ముందుకు వచ్చి తమపై జరిగిన దురాగతాలను వెల్లడించేందుకు వీలుగా నిందితుడు జాక్వస్ లెవెగ్లే (79) పేరును బహిరంగంగా ప్రకటిస్తున్నామని అధికారులు బుధవారం వెల్లడించారు. 1967-2022 మధ్య కాలంలో జర్మనీ, స్విట్జర్లాండ్, మొరాక్కో, అల్జీరియా, నిగర్, ఫిలిప్పీన్స్, భారత్, కొలంబియా, ఫ్రాన్స్ సహా అనేక దేశాలకు చెందిన విద్యార్థులకు ఫ్రీలాన్సర్ ఉపాధ్యాయుడిగా, ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసిన సమయంలో జాక్వస్ 13 నుంచి 17 సంవత్సరాలలోపు వయసున్న బాలురపై లైంగిక దాడులకు పాల్పడినట్టు తెలిపారు. ఫ్రెంచ్ భాష, గుహల అధ్యయనానికి సంబంధించిన స్పెలియాలజీని అతడు బోధించేవాడన్నారు. ఈ దురాగతాలకు సంబంధించి నిందితుడు రాసుకున్న వివరాలతో కూడిన యూఎస్‌బీ డ్రైవ్‌లను అతని మేనల్లుడు అధికారులకు అందజేయడంతో 2024లో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి అతన్ని విచారిస్తున్నారు. మైనర్లతో నెరపిన లైంగిక సంబంధాలను వివరిస్తూ అతడు రాసుకున్న 15 వాల్యూమ్‌ల డిజిటల్ మెటీరియల్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి ఆధారంగా 89 మంది బాధితులను గుర్తించారు. బాధితుల పేర్లను క్లుప్తంగానూ, లేదా ముద్దు పేర్లను ప్రస్తావించడం వల్ల దశాబ్దాల తర్వాత ఇప్పుడు వారిలో చాలామంది బాధితుల జాడ కనుగొనడం సంక్లిష్టంగా మారిందని అధికారులు తెలిపారు. ఈ కేసులో జ్యుడీషియల్ విచారణను 2026లో ముగించాల్సి ఉందని దర్యాప్తు అధికారి సెర్జీ ప్రెసీడ్స్ చెప్పారు. దశాబ్దాల క్రితం ఇద్దరు కుటుంబసభ్యులనూ చంపేశానని నిందితుడు వెల్లడించాడన్నారు. అనారోగ్యంతో ఉన్న తన తల్లిని 1970లలో దిండుతో ఊపిరి ఆడకుండా చేసి చంపేశానని, 1990లలో 90 ఏళ్ల వయసున్న తన ఆంటీని ఊపిరి ఆడకుండా చేసి చంపేశానని నిందితుడు తెలిపాడన్నారు.

ఒకే ప్రశ్న ఎన్నిసార్లు?

- నాయకత్వ మార్పుపై మళ్లీ అడగొద్దు
- అధిష్ఠానం ఆదేశిస్తే నేనూ, డీసీఎం వినాల్సిందే
- మీడియాపై సీఎం సిద్దరామయ్య అసహనం

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): 'ఒకే ప్రశ్న ఎన్నిసార్లు అడుగుతారు..? మూడు నెలలుగా కనిపించిన ప్రతిసారి, ఏ జిల్లాకు వెళ్లినా ఇదే ప్రశ్నేనా?' అని మీడియా ప్రతినిధులపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య అసహనం వ్యక్తం చేశారు. అధిష్ఠానం ఆదేశిస్తే తాను, డీసీఎం డీకే శివకుమార్ వినాల్సిందే అంటూ రుసరుసలాడారు. డీకే శివకుమార్ రెండు రోజులుగా ఢిల్లీలో గడుపుతున్నారు. ఈ నేపథ్యంలో నాయకత్వ మార్పు గురించి బెంగళూరులో మీడియా ప్రతినిధులు బుధవారం ముఖ్యమంత్రి వద్ద ప్రస్తావించగా....ఒక్కసారిగా ఆగ్రహించారు. మరోసారి ఈ ప్రశ్న అడగవద్దని అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు విదేశీ పర్యటనలకు వెళ్తున్న విషయమై ప్రస్తావించగా, ఎవరి డబ్బుతో వారు పర్యటనకు వెళ్తే తప్పేమిటని ప్రశ్నించారు. తన దృష్టికి రాలేదని దాటవేశారు. కాగా, మాజీ ఎంపీ డీకే సురేశ్ బెంగళూరులో బుధవారం మీడియాతో మాట్లాడుతూ...కొంత జాప్యమైనా సిద్దరామయ్య ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటారని అన్నారు. ఈ విషయంపై డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీలో స్పందిస్తూ, అన్నింటికీ కాలమే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు.. ఏం మాట్లాడుకున్నామనేది తమకు మాత్రమే తెలుసునని పేర్కొన్నారు. ఆ కాలం ఎప్పుడు వస్తుంది అని మీడియా ప్రశ్నించగా, ఓ సమయం చూసి చెబుతానని అన్నారు. ఏఐసీసీ కార్యాలయానికి వెళ్లానని, అస్సోం ఎన్నికల అంశాలపై పలువురు నేతలతో చర్చించానని అన్నారు. ఎవరితో అనేది చెప్పలేనని దాటవేశారు.

బైక్‌ను ఢీకొన్న స్కూల్ బస్సు.. ఇద్దరు చిన్నారులు దుర్మరణం

బెంగళూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): స్కూలు బస్సు రూపంలో వచ్చిన మృత్యువు ఇద్దరు చిన్నారుల ఉసురు తీసింది. బెంగళూరు నగరంలోని ధణిసంద్ర పోలీస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న సీఏఆర్ కానిస్టేబుల్ నాగనగౌడ బుధవారం తన కూతురు వర్ష(2), తన అన్న కూతురు భాను(4)ను బైక్‌పై ఎక్కించుకుని పాల ప్యాకెట్లు తెచ్చేందుకు ఇంటి నుంచి బయలుదేరారు. ఎదురుగా వచ్చిన అజ్‌మోని స్కూల్ బస్సు మలుపు తిరిగి బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. దీంతో కానిస్టేబుల్, ఇద్దరు చిన్నారులు ఎగిరిపడ్డారు. పిల్లలు ఇద్దరూ బస్సుకింద పడ్డారు. డ్రైవర్ నియంత్రించేలోగా ఇద్దరిపైనా బస్సు చక్రాలు వెళ్లాయి. క్షణాల్లో చిన్నారులు ప్రాణాలను కోల్పోయారు. నాగగౌడ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. చనిపోయిన ఇద్దరు పిల్లలు పోలీసు సిబ్బంది కుటుంబాలవారే. ఉత్తర విభాగం ట్రాఫిక్ డీసీపీ ప్రమాద స్థలాన్ని సందర్శించారు. హెణ్ణూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



చిన్నారులు (ఫైల్)

నెలాఖరులోగా రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోండి

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రయోజిత పథకాల అమలులో కీలకమైన యూనిక్ ఐడీ కోసం ఈ నెలాఖరులోగా ప్రతి రైతూ రైతు రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గతేడాది పీఎం కిసాన్ నిధుల లబ్ధిదారుల్లో 11.24లక్షల మంది రైతులు మిగిలిపోయారని, వారంతా త్వరితగతిన నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ రైతుల వివరాలను గ్రామ, మండల, జిల్లా వ్యవసాయ అధికారులకు పంపామని పేర్కొన్నారు. ఒకవేళ దూరప్రాంతాల్లో ఉన్న రైతులు, ఓటీపీ చెప్పడానికి ఆసక్తి చూపని రైతుల కోసం ఎస్ఎంఎస్ ద్వారా నమోదు లింక్ పంపుతామని, స్వయంగా రైతులే వివరాలు నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించామని వివరించారు.

పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ స్థానిక సంస్థలకు 15వ ఆర్థిక సంఘం నిధులు(2025-26) మొదటి విడతగా రూ.157 కోట్లు విడుదల చేస్తూ మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నాన్ మిలియన్ ప్లస్ సిటీస్‌కు ఇవి విడుదలయ్యాయి. దీంతోపాటు అదనంగా మరో రూ.176కోట్లు అదనంగా విడుదల చేస్తూ మరో ఉత్తర్వు విడుదల చేసింది.

యూఐడీఎఫ్ నిధులతో పట్టణాల్లో తాగునీటి వనరులు

అమరావతి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (యూఐడీఎఫ్) నిధులు రూ.1702 కోట్లతో పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ నిర్మాణాలకు పనులు మంజూరుచేస్తూ మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2024-25 సంవత్సరానికి సంబంధించి యూఐడీఎఫ్ నిధులతో 38 తాగునీటి ప్రాజెక్టులు, 6 ప్రవాహ వాటర్ డ్రైన్ల నిర్మాణానికి నేషనల్ హౌసింగ్ బ్యాంక్‌నుంచి రుణ సహకారంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. టెండర్లు పిలవాలని ప్రభుత్వం ఆదేశించింది.

మున్సిపల్‌శాఖలో విజిలెన్స్ ఆఫీసర్లు

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్‌శాఖలో పలు విభాగాల్లో నిఘా విభాగాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖలో ఉన్న ప్రజారోగ్యశాఖకు చీఫ్ ఇంజనీర్ ఎ.సుధాకర్‌ను, ఏపీసీఆర్‌డీఏలో హెచ్‌ఆర్ డైరెక్టర్ బి.మల్లికార్జునరెడ్డిని, డీటీసీపీకి జీఈఓ డైరెక్టర్ బి.శ్రీనివాసులను, విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీకు ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న బి.దయానిధిని విజిలెన్స్ అధికారులుగా నియమిస్తూ మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది.

మహాశివరాత్రికి నిరంతరాయంగా విద్యుత్

- డిస్కంలను ఆదేశించిన మంత్రి రవికుమార్

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆలయాలు, ఆ పరిసర ప్రాంతాలకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్తు పంపిణీ సంస్థల (డిస్కంలు)ను విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. బుధవారం డిస్కంల సీఎండీలు శివశంకర్, పృథ్వీతేజ్, పుల్లారెడ్డితోపాటు పలువురు ఉన్నతాధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివరాత్రిని పురస్కరించుకుని ప్రధాన శివాలయాలు, ఇతర ఆలయాలకు వెళ్లే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని, వారి సౌకర్యార్థం విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని కోరారు.

విద్యుత్తు ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గిస్తాం...

కూటమి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యమిస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. బుధవారం సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంఘం డైరీని ఎమ్మెల్యే కూన రవికుమార్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యుత్తు ఉద్యోగులపై పనిఒత్తిడి తగ్గించేందుకు త్వరలో నూతన నియామకాలు చేపడుతున్నట్లు ప్రకటించారు. మెడికల్ ఇన్సూరెన్సు లిమిట్‌కు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తామన్నారు.



విశాఖ తీరంలో యుద్ధ నౌకలు

ఐఎఫ్ఆర్, మిలాన్‌కు నేవీ సన్నద్ధం



- 18న ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూ
- 19న ఇంటర్నేషనల్ సిటీ పరేడ్
- విశాఖ చేరుకుంటున్న యుద్ధనౌకలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో నేవీ అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్)-2026, మిలాన్ విన్యాసాలకు ఏర్పాట్లు చకచకా జరుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లు ఒక్కొక్కటీ విశాఖపట్నం చేరుతున్నాయి. ఈ నెల 15న ప్రారంభమై 25వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 'ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ' (ఐఎఫ్ఆర్)కు రాష్ట్రపతి ముర్ము హాజరుకానున్నారు. 18న ఆర్‌కే బీచ్‌కు దూరంగా సముద్రంలో యుద్ధనౌకల సమీక్ష నిర్వహిస్తారు. 19న ఆర్‌కే బీచ్‌లో ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ నిర్వహిస్తారు. ఇందులో సుమారు 60 దేశాలకు చెందిన నేవీ బృందాలు పాల్గొని మార్చ్‌పాస్ట్ చేస్తాయి. దానికంటే ముందు భారత నౌకాదళానికి చెందిన వైమానిక విభాగం తన యుద్ధనైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరవుతారు. ఈ కార్యక్రమానికి రెండు లక్షల మంది ప్రజలు హాజరవుతారని అంచనా. బందోబస్తు కోసం వేలాది మంది పోలీసు సిబ్బందిని వినియోగిస్తున్నారు. 200కు పైగా సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇంటర్నేషనల్ సిటీ పరేడ్ కోసం 17, 18 తేదీల్లో రిహార్సల్స్ నిర్వహించనున్నారు. ఒక దేశం నిర్వహించే సమీక్షలో ఇతర దేశాల ప్రతినిధులు, వారి యుద్ధనౌకలు కూడా పాల్గొంటే దాన్ని 'ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ' (ఐఎఫ్ఆర్)గా అభివర్ణిస్తారు. కాగా, భారత్‌లో ఐఎఫ్ఆర్ నిర్వహించడం ఇది మూడోసారి. 2001లో ముంబైలో, 2016లో విశాఖపట్నంలో దీన్ని నిర్వహించారు. మూడోసారి కూడా విశాఖలోనే నిర్వహిస్తున్నారు.

ఉద్రిక్తత వెనుక కుట్రకోణం?



సోమవారం శ్రీశైలంలో ధ్వజస్తంభం వద్ద గేట్లను దూకి వస్తున్న శివదీక్షాధారులు, గేటును ధ్వంసం చేస్తున్న దృశ్యం

స్థానిక రాజకీయాలతో టార్గెట్‌గా మారిన ఈవో.. 'వైసీపీ భక్త అధికారి'ని తిరిగి రప్పించే యత్నం!

(నంద్యాల - ఆంధ్రజ్యోతి)

శ్రీశైలంలో అసలేం జరిగింది? శివదీక్షా పరులు ఎందుకు సహనం కోల్పోయారు? గతంలో ఎన్నడూ లేని విధంగా రాళ్లతో తాళాలు పగలగొట్టడం, గర్భగుడిలోకే చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించడం వెనుక ఎవరి ప్రోద్బలం ఉంది? అటు అధికారుల మధ్య సమన్వయ లోపం... ఇటు 'స్థానిక' రాజకీయాల కారణంగానే ఈ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నాయా? సోమవారం శ్రీశైలం ఆలయంలో చోటు చేసుకున్న పరిణామాలపై తలెత్తుతున్న ప్రశ్నలివి! అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం...

ఒక్కసారిగా ఎందుకిలా...

మహా శివరాత్రికి 15-20 రోజుల ముందు నుంచే భారీగా శివభక్తులు, దీక్షాపరులు నల్లమల అడవి గుండా పాదయాత్ర చేస్తూ శ్రీశైలానికి చేరుకుంటారు. కానీ... ఈసారి పులుల గణన పేరుతో అటవీ శాఖ అధికారులు పాదయాత్రపై ఆంక్షలు విధించారు. ఈనెల 8 నుంచి 15వ వరకు మాత్రమే పాదయాత్రకు అనుమతిస్తామని తెలిపారు. దీంతో...వేల సంఖ్యలో భక్తులు 8వ తేదీన యాత్ర మొదలుపెట్టి... 9కి శ్రీశైలం చేరుకున్నారు. సామాన్య భక్తులు, దీక్షాపరులు, పాదయాత్రగా చేరుకున్న వారితో శ్రీశైలంలో రద్దీ అనూహ్యంగా పెరిగింది. 20-25 వేల మంది వస్తారన్న అధికారుల అంచనా తప్పింది. సోమవారం శ్రీశైలానికి దాదాపు 60వేల మంది తరలి వచ్చారు. ఇక... 12వ తేదీ అర్ధరాత్రి నుంచి శివదీక్షాదారులకు స్పర్శ దర్శనం రద్దు చేస్తామని అధికారులు తెలిపారు. ఇది రద్దీకి మరో ప్రధాన కారణం. దేవదాయ, అటవీ అధికారుల మధ్య సమన్వయం లోపంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. రద్దీని ఊహించలేక శ్రీశైలం ఆలయ అధికారులు భద్రతా చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. సోమవారం ఆలయంలో దాదాపు 6 వేలమంది వరకూ భక్తులు ఉన్నారు. ఇక్కడ రద్దీని నియంత్రిస్తూ... బయటి కంపార్ట్‌మెంట్ల నుంచి భక్తులను అనుమతించాలి. కానీ... అనూహ్యంగా మనోహర గుండం వద్ద ఉన్న కంపార్ట్‌మెంట్లలోని కొందరు శివ భక్తులు ఒక్కసారిగా లోపలికి వచ్చే ప్రయత్నం చేశారు. ఇది ఎలా జరిగిందన్నదే అసలు ప్రశ్న! అక్కడి ఆలయ సిబ్బంది ఎవరైనా తాళాలు తీసి వదిలారా? లేక శివభక్తులే నేరుగా తాళాలు పగల కొట్టి లోపలికి చొచ్చుకువచ్చారా? శివభక్తుల చేతుల్లోకి రాళ్లు ఎలా వచ్చాయి? ఇనుప గ్రిల్స్‌ను ధ్వంసం చేసేంతలా భక్తులను రెచ్చగొట్టింది ఎవరు?

పోలీసులు ఆపకపోయి ఉంటే!

భారీగా వచ్చిన భక్తులు, అనూహ్య ఘటనలతో సోమవారం ఆలయంలో ఒకింత భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ విధుల్లో ఉన్న ఏఎస్పీ యుగంధర్‌బాబు వెంటనే అప్రమత్తమై పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. పరిస్థితి చేజారి పోకుండా... దూరం వెళ్లాలంటూ లాఠీతో భక్తులను అదిలించారు. లేనిపక్షంలో... ఇటీవల శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ఆలయం తరహాలో తొక్కిసలాట జరిగేది. అంతేకాదు.. భక్తులు గుంపుగా గర్భగుడిలోకి వెళ్లుంటే ఆలయ మర్యాదకూ అపచారం జరిగేదేమో! ఈ క్రమంలోనే పోలీసులు లాఠీలను ఎత్తి దూకుడును నియంత్రించారు. అంతేతప్ప భక్తులపై లాఠీచార్జి చేయలేదు. అయినప్పటికీ... వైసీపీ నేతలు దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారు.

ఈవోను టార్గెట్ చేశారా?

శ్రీశైలం ఆలయం కేంద్రంగా కొన్నాళ్లుగా రాజకీయాలు జరుగుతున్నాయి. ఈవో శ్రీనివాసరావు‌ను బదిలీ చేయించేందుకు కొందరు ఆలయంలోని అధికారులు, ఒక ప్రజాప్రతినిధి తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు. టెండర్లు సహా పలు అంశాల్లో ఈవో నిక్కచ్చిగా వ్యవహరించడం నంద్యాల జిల్లాకు చెందిన ఆ ప్రజాప్రతినిధికి మింగుడు పడటం లేదని తెలుస్తోంది. ఇదే క్రమంలో ఆలయ చైర్మన్‌తో కూడా ఆయనకు విభేదాలు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వైసీపీ హయాంలో శ్రీశైలం ఈవోగా పనిచేసి వివాదాలకు కేంద్రబిందువుగా మారిన 'వైసీపీ భక్త' అధికారిని మళ్లీ శ్రీశైలానికి రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత ఈవోను తప్పించేందుకు జరిగిన కుట్రలో భాగంగానే... సోమవారంనాటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయా?



- జగన్ హయాంలో విశాఖకు తరలించే యత్నం
- ఆంధ్రా వర్సిటీ ఆవరణలో భవనాలు కేటాయింపు
- సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిలిచిన ప్రక్రియ
- ఇప్పటికీ ప్రధాన కార్యాలయం హైదరాబాద్‌లోనే..
- తరలింపు పట్టనట్టు వ్యవహరిస్తున్న ఏపీ ప్రభుత్వం

కృష్ణా బోర్డు అమరావతికి వచ్చేనా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర విభజన జరిగి పుష్కరం కావస్తోంది. అయినా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ప్రధాన కార్యాలయం ఇప్పటికీ హైదరాబాద్‌లోనే కొనసాగుతోంది. విభజన చట్టం మేరకు కృష్ణా బోర్డు ఏపీలోనూ, గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) హైదరాబాద్‌లోనూ ఉండాలి. రాష్ట్ర విభజన జరిగిన వెంటనే అంటే.. 2014లోనే కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని అమరావతి లేదా విజయవాడలో ఏర్పాటు చేయాలి. కానీ తొలి ఐదేళ్లూ ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ చూపలేదు. కేఆర్ఎంబీ చైర్మన్ సహా పలువురు ఇంజనీరింగ్ అధికారులు విజయవాడ రావడానికి ఆసక్తి చూలేదు. హైదరాబాద్‌లో స్థిరపడిన ఏపీకి చెందిన ఇంజనీరింగ్ అధికారులు సైతం బోర్డును తరలించడంలో ఎంత జాప్యమైతే అంత మంచిదని భావించారు. మరోవైపు విభజన అనంతరం కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో తెలుగు రాష్ట్రాల మధ్య వివాదాలు పెరిగాయి. రెండు బోర్డులూ హైదరాబాద్‌లోనే ఉండటంతో నదీ జలాలు ఎక్కువగా వాడేస్తున్నామని, అనుమతులు లేకుండా ప్రాజెక్టులు కట్టేస్తున్నామని తెలంగాణకు చెందిన రాజకీయ నాయకులు ఏపీపై తరచూ ఫిర్యాదు చేస్తున్నారు. దీంతో రాష్ట్ర జల వనరుల ఉన్నతాధికారులు ప్రతిసారీ హైదరాబాద్ వెళ్లి ఆయా బోర్డుల ముందు వివరణలు ఇచ్చి నదీ జలాలపై రాష్ట్రానికి ఉన్న హక్కులను కాపాడుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సహజంగా నదీ పరీవాహక ప్రాంతాల్లోనే యాజమాన్య బోర్డులు ఉండాలి. కానీ గత వైసీపీ ప్రభుత్వం దీనికి పూర్తి విరుద్ధంగా వ్యవహరించింది. కృష్ణానదీ పరీవాహక ప్రాంతంతో సంబంధం లేని విశాఖపట్నంలో కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఇందుకోసం ఆంధ్ర యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇరిగేషన్ కార్యాలయ భవనాలు కేటాయించింది. ఈ ప్రతిపాదనకు కేఆర్ఎంబీ కూడా అంగీకరించింది. అయితే కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంత రైతాంగం, సాగునీటి ప్రాజెక్టుల వినియోగదారులు, ఇంజనీరింగ్ అధికారులు దీనిపై అభ్యంతరం తెలిపారు. ఈలోపు సార్వత్రిక ఎన్నికలు రావడంతో బోర్డు తరలింపు ప్రక్రియ ఆగిపోయింది. నాటినుంచీ కేఆర్ఎంబీ హైదరాబాద్‌లోనే ఉండిపోయింది. దీనిని రాష్ట్రానికి రప్పించే ప్రయత్నాలు జరగకపోవడంపై సాగునీటి రంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేఆర్ఎంబీ ప్రధాన కార్యాలయం ఏపీలో ఉంటేనే కృష్ణానదీ జలాల విషయంలో రాష్ట్ర హక్కులను కాపాడుకోవడం సాధ్యమని పేర్కొంటున్నారు. రాష్ట్రానికి న్యాయం చేసేలా కృష్ణా బోర్డును అమరావతికి తరలించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

17 రాష్ట్రాల్లో ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులు

- సుప్రీం కోర్టుకు తెలియజేసిన కేంద్రం
- రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11: పదికన్నా ఎక్కువ ఉగ్ర కేసుల విచారణ పెండింగ్‌లో ఉన్న 17 రాష్ట్రాల్లో కనీసం ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేసేందుకు కేంద్రం అంగీకరించింది. ఈమేరకు సుప్రీంకు తెలియజేసింది. ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు వేరేగా కోర్టు కాంప్లెక్స్‌లను నిర్మించకుండా ఇప్పటికే ఉన్న కోర్టును రాష్ట్ర ప్రభుత్వం కేటాయించవచ్చని సూచిస్తూ కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు లేఖ రాసినట్టు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనానికి అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి తెలియజేశారు. ఈ కోర్టులకు రికరింగ్, నాన్ రికరింగ్ వ్యయాల నిమిత్తం రూ.కోటి చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. కాగా అనేక దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నందున ఎన్ఐఏ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ముఖ్యమని సీజేఐ పేర్కొన్నారు. నేరాలు తీవ్రంగా ఉన్నప్పటికీ విచారణ లేకుండా నిందితులను కస్టడీలో ఉంచలేమన్నారు. ప్రస్తుత కోర్టులకు ఎన్ఐఏ విచారణలను అప్పగించడంలో ఆలస్యమవుతోందని పేర్కొన్నారు. కాగా ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులకు సంబంధించి స్పందన తెలియజేయాలని ఏపీ, తెలంగాణతోపాటు పలు రాష్ట్రాలకు ధర్మాసనం నోటీసులు జారీ చేసింది.

సుబ్బన్న కోసమే అప్పన్న!

(మొదటి పేజీ తరువాయి)



వైవీ సుబ్బారెడ్డి భార్య దుర్గగుడికి వచ్చినప్పుడు వెనుక అప్పన్న(ఫైల్)

అయ్యాయి. అదే నెలలో... అప్పన్న సిఫారసు మేరకు ఏకంగా 6433 టికెట్లను టీటీడీ అధికారులు జారీ చేశారు. చైర్మన్‌తో అప్పన్నకు ఎలాంటి బంధం లేకుంటే ఇదెలా సాధ్యం!? ఇది 2021 సెప్టెంబరు నెలలో జారీ చేసిన సుపథం టికెట్ల జాబితా మాత్రమే. ఇంకెన్ని వీఐపీ బ్రేక్ దర్శనాలు, ఆర్జిత సేవల టికెట్లు ఇచ్చారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. వైవీ సుబ్బారెడ్డి ఇప్పుడు ఏం చెబుతున్నా... అప్పుడు మాత్రం కొండపై ఆయన 'పీఏ' చిన్నప్పన్న హవా నడిచేది. చిన్నప్పన్న కోరినన్ని దర్శన టికెట్లు పొందారని, స్వామి దర్శన టికెట్లతోనూ దందా చేశారని ఆరోపణలు ఉన్నాయి. అప్పటి చైర్మన్ కార్యాలయ సిబ్బంది చిన్నప్పన్న ఫోన్ చేసి చెబితే చాలు... ఇష్టానుసారం టికెట్లను జారీ చేసినట్టు తెలుస్తోంది. వేల సంఖ్యలో దర్శన టికెట్లు పొందుతూ చైర్మన్ కార్యాలయానికి ఆయన చిన్న బాసుగా వ్యవహరించారని సిబ్బంది చెబుతారు.

సొంత మనిషే కదా...

కల్తీ నెయ్యి కుట్ర కేసులో చిన్నప్పన్న పాత్రను 'సిట్' వెలికి తీసింది. డెయిరీ నిర్వాహకులతో బేరసారాలు, బెదిరింపులు, ముడుపుల వ్యవహారాలను ఆయన చక్కగా నడిపించారు. చిన్నప్పన్న పాత్ర బయటపడగానే... 'ఒకప్పుడు నాకు పీఏ. తర్వాత కాదు' అంటూ వైవీ సుబ్బారెడ్డి కబుర్లు చెబుతున్నారు. ఆయనెవరో తెలియనట్లుగా మాట్లాడుతున్నారు. పర్సనల్ అసిస్టెంట్, ప్రైవేట్ అసిస్టెంట్, పర్సనల్ సెక్రటరీ ఇలా హోదాలు, పేర్ల సంగతి ఎలా ఉన్నా వైవీ సుబ్బారెడ్డికి చిన్నప్పన్న సొంత మనిషి! తన అధికారిక లెటర్ హెడ్‌లో చిన్నప్పన్న 'కాంటాక్ట్ నంబర్' పెట్టుకునేంత 'దగ్గరి' మనిషి! ప్రతి దశలో ఆయనకు నీడలా ఉండే వ్యక్తి. 'ముందు సుబ్బన్న, ఆ వెనుకే అప్పన్న'... ఇలాంటి ఫొటోలు పదుల సంఖ్యలో ఉన్నాయి. కొన్ని ప్రత్యేక 'లక్ష్యాల' కోసమే నాడు చిన్నప్పను ఢిల్లీలోని ఏపీ భవన్‌లో లైజనింగ్ ఆఫీసర్‌గా పంపించారు. కల్తీ నెయ్యికి సంబంధించిన బేరసారాలన్నీ ఢిల్లీ కేంద్రంగానే జరిగాయి. 'సిట్' ఈ సంగతులన్నీ తేల్చింది. అయినప్పటికీ... 'నాకేం సంబంధం లేదు' అని వైవీ సుబ్బారెడ్డి అటుంటే, 'మా బాబాయ్ అమాయకుడు' అని వైసీపీ అధ్యక్షుడు జగన్ వెనకేసుకొస్తున్నారు.

విశాఖకు మళ్లీ ఐబీఎం



- భూమి కోసం అన్వేషణ
- తాత్కాలిక కార్యకలాపాల కోసం ఐస్ప్రౌట్‌లో కో వర్కింగ్ స్పేస్ తీసుకునే అవకాశం..!

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఐటీ దిగ్గజ కంపెనీ ఐబీఎం మళ్లీ విశాఖపట్నంలో కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించింది. అందుకు అవసరమైన భూమి కోసం అన్వేషిస్తోంది. రాజధాని అమరావతిలో ఏర్పాటు చేస్తున్న క్వాంటమ్ వ్యాలీలోనూ ఐబీఎం కీలకంగా వ్యవహరిస్తోంది. ఐటీ మంత్రి లోకేశ్‌తో చర్చల సమయంలో విశాఖలో కూడా ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆయన కోరడంతో సూత్రప్రాయంగా అంగీకరించింది. దానికోసం భూమిని కేటాయించాలని కోరింది. ఈ నేపథ్యంలో విశాఖలో అనువైన ప్రదేశాన్ని చూసుకోవడానికి ఐబీఎం ప్రతినిధులు కూడా నగరానికి వచ్చి వెళ్లారు. సుమారు 20 ఎకరాలు కోరుతున్నట్టు జిల్లా అధికారుల సమాచారం.

విశాఖకు పాత చుట్టమే

ఐబీఎం 2011లోనే విశాఖపట్నంలో గ్లోబల్ డెలివరీ సెంటర్ ఏర్పాటు చేసింది. రుషికొండ ఐటీ హిల్ నంబర్ 3పై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కెనెక్సా ఐటీ కంపెనీకి 25 ఎకరాలు కేటాయించారు. ఆ సంస్థ కొన్నాళ్లు నడిపి ఆ తర్వాత దాన్ని ఐబీఎంకు విక్రయించింది. అయితే.. ఎకరాకు 100 మంది చొప్పున 25 ఎకరాలకు 2,500 మందికి ఉద్యోగాలు ఇవ్వాలనే నిబంధన ఉంది. దాని గురించి ఏపీఐఐసీ అధికారులు ప్రశ్నించగా.. తమకు 25 ఎకరాలు అవసరం లేదని, అంత మందికి ఉద్యోగాలు ఇవ్వలేమని పేర్కొంటూ అందులో 21.8 ఎకరాలను వెనక్కి ఇచ్చేసింది. ఆ తర్వాత హుద్‌హుద్ తుఫాన్ సమయంలో ఐబీఎం కంపెనీ భవనం బాగా దెబ్బతింది. దాంతో చేతిలో ఉన్న 3.2 ఎకరాలను కూడా ఇన్ఫినిటీ సంస్థకు విక్రయించి విశాఖలో సెంటర్ మూసేసింది. ఇది జరిగి చాలాకాలమైంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో ఓ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరడంతో తిరిగి ఇక్కడకు రావడానికి ప్రయత్నిస్తోంది. హిల్ నంబరు 3పై ఐబీఎం వెనక్కి ఇచ్చిన 21.8 ఎకరాలను ఇటీవల ప్రభుత్వం టీసీఎస్‌కు కేటాయించింది.

ఐస్ప్రౌట్ భవనంలో తాత్కాలిక కార్యాలయం..?

ఐస్ప్రౌట్ అనే సంస్థ విశాఖలో తన బ్రాంచి ఏర్పాటు చేయడానికి గతేడాది నవంబరులో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో ఒప్పందం చేసుకుంది. రుషికొండ ఐటీ పార్కులో వారికి ఆరు ఎకరాలు కేటాయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. తాత్కాలిక కార్యాలయం కోసం విశాఖలోని ఇసుకతోట జంక్షన్‌లో ఉన్న లాన్సమ్ భవనంలో కొంత ఏరియాను అద్దెకు తీసుకున్నట్టు తెలిసింది. ఈ సంస్థ ఇతర కంపెనీలకు కో-వర్కింగ్ స్పేస్‌ను సమకూరుస్తుంది. అలాగే ఐబీఎంకు కూడా కో వర్కింగ్ స్పేస్ ఇవ్వడానికి చర్చలు జరుగుతున్నాయని సమాచారం.

రాష్ట్రంలో 'ఏఐ లివింగ్ ల్యాబ్స్'

(మొదటి పేజీ తరువాయి)

మెమొరాండం ఆఫ్ అసోసియేషన్ అండ్ ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌ను రూపొందించడానికి, ఎన్వీడియాతో అవగాహనా ఒప్పందాన్ని సవరించడానికి సమ్మతి తెలిపింది. విద్యార్థులు విద్యా అవసరాల కోసం ఏఐ హార్డ్‌వేర్ సేకరణకు అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు దీని నుంచి ఉచిత ఏఐ టీచింగ్ కిట్స్ అందించడానికి, ఏఐ శిక్షణ వ్యవస్థ అభివృద్ధిలో ఇతరతా మద్దతు అందించడానికి కూడా ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరికైనా ఏఐ శిక్షణ ఇవ్వాలన్నది ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం. ఈ సంస్థకు వచ్చే లాభాలను తిరిగి ఏఐ అభివృద్ధి, పరిశోధనల కోసమే వినియోగించాలని క్యాబినెట్ నిర్ణయించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు డిజాస్టర్ రికవరీ సెంటర్‌ను తిరుపతిలో ఐడీటీ క్యాంపస్‌లో ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టును బిల్డ్-ఓన్-ఆపరేట్-ట్రాన్స్‌ఫర్ మోడల్లో అమలు చేస్తారు.



మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, కొల్లు, అచ్చెన్న, అనిత, తదితరులు

మరిన్ని నిర్ణయాలు..

- 2025-26లో భారీ, మధ్య, చిన్న తరహా నీటి వనరుల నిర్వహణకు రూ.344 కోట్లతో 7,189 పనులు చేపట్టడానికి పరిపాలనా అనుమతులు.
- 2025 నాటి ఆర్డినెన్స్ నంబర్ 10 స్థానంలో ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూములు సవరణ బిల్లు-2026 ముసాయిదాకు ఆమోదం.
- విశాఖపట్నం జిల్లా గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూముల ఆక్రమణ లేదా నిర్మాణాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల సమర్పణ గడువు జూన్ 30 వరకూ పొడిగింపు.
- రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో గృహాల క్రమబద్ధీకరణ పథకం-2025 కింద దరఖాస్తుల సమర్పణ గడువు జూన్ 30 వరకూ పొడిగింపు.
- ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లిలో 45.60 ఎకరాలు ఏపీ నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థకు కేటాయింపు.
- నంద్యాల జిల్లా నొస్సం గ్రామంలో 1,500 ఎకరాల భూమిని 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థకు 30 ఏళ్ల లీజుగా ఇవ్వాలని నిర్ణయం. లీజు ధర ఏడాదికి ఎకరాకు రూ.31 వేలు.
- విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలో 18.57 ఎకరాల ప్రభుత్వ భూమి రాష్ట్ర సేవా సమితికి బదిలీ.
- ఆర్డినెన్స్ స్థానంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ/వార్డు సచివాలయాల బిల్లు-2026ను అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు ఆమోదం.
- అమరావతితో సుమారు ఎకరా నదీతీర భూమిపై పీపీపీ విధానంలో అమరావతి మెరీనా అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టేందుకు ఆమోదం.
- ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 పథకంలో ప్రతి గృహ యూనిట్ విలువ రూ.2,39,000గా నిర్ణయం. ప్రతి యూనిట్ వ్యయంలో కేంద్రం వాటా రూ.95,400, రాష్ట్రం వాటా రూ.63,600 కాగా.. మిగిలిన మొత్తం డ్వాక్రా రుణాలు, కన్వర్జెన్స్ పథకం ద్వారా సమకూరుస్తారు. ఇందులో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పని ద్వారా రూ.27,000, వ్యక్తిగత మరుగుదొడ్ల కోసం రూ.12 వేలు ప్రభుత్వం అందిస్తుంది.
- రామాయపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు ఉన్న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాన్ని సాగర్ మాల ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా రీఫైనాన్స్ చేయడానికి ఆమోదం.
- గత ఏడాది జారీచేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2026 ముసాయిదాకు ఆమోదం.
- ఏపీ జెన్కో-ఎన్‌హెచ్‌పీసీ జాయింట్ వెంచర్ పరిధి నుంచి యాగంటి పీఎస్‌పీ, రాజుపాలెం పీఎస్‌పీలకు మినహాయింపు. వీటిని జెన్కో స్వతంత్రంగా చేపట్టడానికి ఆమోదం.
- జీవిత ఖైదీ (నంబర్ 9709) పి.లియాఖత్ అలీ ఖాన్‌కు శిక్ష తగ్గింపునకు అంగీకారం.
- ఆర్డినెన్స్ 9 స్థానంలో అగ్నిమాపక సేవల చట్టం-1999లో సవరణలు చేయడానికి ఉద్దేశించిన ముసాయిదా బిల్లుకు ఆమోదం.
- పోలవరం-నల్లమల సాగర్ అనుసంధాన పథకం కోసం రూ.10.37 కోట్లతో డీపీఆర్ తయారీ ప్రతిపాదనకు ఆమోదం.

విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి

- భారత్‌లో ఆ సంస్థ అతిపెద్ద పెట్టుబడి ఇదే
- ఏఐ కోర్సుల రూపకల్పనకు పరిశ్రమలతో సంప్రదింపులు: కేంద్రం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో డేటా సెంటర్‌ను స్థాపిస్తున్నట్లు గూగుల్ ఇటీవల ప్రకటించిందని, సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెడుతోందని, ఇప్పటి వరకు భారత్‌లో గూగుల్ చేసిన అతిపెద్ద పెట్టుబడి ఇదేనని కేంద్ర ఎలక్ట్రానిక్స్ సమాచార సాంకేతిక శాఖల సహాయ మంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. బుధవారం, లోక్‌సభలో ఎంపీ పుట్టా మహేష్ అడిగిన ఒక ప్రశ్నకు కేంద్రమంత్రి ఈ మేరకు సమాధానం ఇచ్చారు. స్టాన్‌ఫర్డ్ ఏఐ ఇండెక్స్ రిపోర్ట్-2025 ప్రకారం 2013 నుంచి 2024 వరకు భారత్‌లో ఏఐ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులు సుమారు 11.1 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరాయని కేంద్రమంత్రి తెలిపారు. ఏఐ ఉద్యోగ అవసరాలకు అనుగుణంగా పరిశ్రమలతో సంప్రదింపులు జరిపి కోర్సుల రూపకల్పన చేస్తున్నట్లు చెప్పారు.

గూగుల్ డేటా సెంటర్ బాధ్యత అదానీదే!

- నిర్మాణం, నిర్వహణ ఆ సంస్థదే.. ప్రభుత్వానికి గూగుల్ లేఖ
- అదానీ పేరిటే భూమి కేటాయింపు.. అదనంగా మరో 170 ఎకరాలు
- క్యాబినెట్ సూత్రప్రాయ నిర్ణయం!

అమరావతి, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక గూగుల్ డేటా సెంటర్ నిర్మాణ, నిర్వహణ బాధ్యతలను అదానీ సంస్థే చూసుకోనుంది. ఈ మేరకు 'గూగుల్' ఇది వరకే లేఖ రాసిన నేపథ్యంలో... భూముల యాజమాన్య హక్కులతోపాటు నిర్వహణనూ అప్పగించాలన్న ప్రతిపాదనలపై బుధవారం మంత్రివర్గ సమావేశంలో చర్చ జరిగింది. అదానీ పెట్టిన మరికొన్ని షరతులపై పూర్తిస్థాయిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని మంత్రివర్గం భావించింది. విశాఖలో గూగుల్ సంస్థ రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడితో ఒక గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ డేటా సెంటర్ ఏర్పాటులో అదానీని తమ భాగస్వామిగా పేర్కొంటూ గూగుల్ రాష్ట్రప్రభుత్వానికి లేఖ రాసింది. భవిష్యత్‌లో అదానీతోనే లావాదేవీలు నిర్వహించుకోవాలని సూచించింది. ఈ తరుణంలోనే గూగుల్ డేటా సెంటర్‌కు ఇచ్చిన ప్రోత్సాహకాలన్నీ తమకు బదలాయించాలని కోరుతూ ప్రభుత్వానికి అదానీ లేఖ రాసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న మంత్రివర్గం.. ఇప్పటికే విశాఖలో గూగుల్‌కు కేటాయించిన 480 ఎకరాలతోపాటు మరో 170 ఎకరాలు కేటాయించాలని తీర్మానించినట్లు తెలిసింది. అదానీ ప్రతిపాదించిన మిగిలిన అంశాలన్నింటిపైనా త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.